సంస్థాపకులు
కీ॥ శే॥ వి వి రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి లీలావతి
రాఘవయ్య

సచిత్ర మాసపత్రిక
ఫిబ్రవరి 1978

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 16 **విషయసూచిక** సంచిక 1

ముఖచిత్రం : 'మేలుకొలుపు'లో జయప్రద

జ్యోతి, 17 B రాజారాం కాలనీ, P. B. నెం 2650, మద్రాసు 600 024.
ఫోన్ 423123 సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు 42/

తొలిమాట

తుపాను ఆంధ్రదేశంలో జరిపిన బీభత్సపు వార్తలు నెమ్మదిగా తగ్గిపోతున్నాయి. కాలం మందు పనిచేయనారంభించింది. తుపాను అత్యధికంగా నాశనం చేసిన దివిసీమ ప్రజలుకూడా నెమ్మదిగా కోలుకోనారంభించారు. అయితే వారి వేదన, వారు అనుభవించిన క్షోభ, వారి నష్టం ఇంతలో సమసిపోయేదికాదు. ఉప్పునీటితో పొలాలు కూడా వెంటనే పంటలకు పనికిరావంటున్నారు. పోయినవారు పోగా మిగిలినవారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిది, సాటిప్రజలదీ కూడా. ఈ విషయం గత సంచికలో కూడా ప్రస్తావించాము, మళ్ళీ మళ్ళీ బాధితులగురించి మనం ఆలోచించాలి. వారికి మనకు సాధ్యమయిన రీతిలో సాయం అందజెయ్యాలి. అలా చేయవలసిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము.

* * *

ప్రముఖ రచయిత ధనికొండ హనుమంతరావు నిర్వహించిన ‘మా ప్రశ్నకు మీ జవాబు—మీ ప్రశ్నకు మా జవాబు శీర్షిక ఈ సంచికతో నిలిపివేయబడుతోంది.

* * *

జ్యోతి కథలపోటీ నిర్వహిస్తున్న సంగతి గతసంచికలోనే ప్రకటించాము. ఈ సంచికలో కూడా ఆ వివరాలున్నాయి. మార్చి సంచికతో సంవత్సరంగా జ్యోతి నిర్వహిస్తూ వచ్చిన రచయితలకు ప్రత్యేక పారితోషికాల పథకం పూర్తవుతుంది. రచయితలకు ఇతోధికంగా ప్రోత్సాహం అందించేందుకు నిర్దేశించిన ఈ పథకం ఆ సంచికతో ఆపివేస్తున్నాము. ఆ ప్రోత్సాహాన్ని కథలపోటీ ద్వారా అందిస్తున్నాము.

ఉత్తరాలు

శ్రీ శ్రీ గారి పదబంధ ప్రహేళికల్లో కొన్ని "క్లూ"లు చాలా అసమంజసంగా, అసందర్భంగా వుంటున్నాయి. ఈ పజిల్సును నే నెప్పుడూ sportive గానే తీసుకొని పూర్తిచేసుకుంటున్నాను. నే నెప్పుడూ ప్రైజ్‌కై ఆశపడలేదు. ఆయన యిచ్చిన ఒక క్లూ సాల్వ్ అయితేనే ప్రైజు వచ్చిన సంతోషం కలుగుతుంది. మేము ఆల్ కరక్టుగా చేసిన పజిల్సు మాకు పత్రిక యీ వూరు ఆలస్యంగా రావడంవల్ల పంపడం కుదరడం లేదు. చెప్పొచ్చేదేమిటంటే "నే నెప్పుడూ Below the belt కొట్టను" అన్న శ్రీ శ్రీ ఆ పనిచేస్తున్న దాఖలాలు (పజిల్సులో) వున్నాయి. "సాహిత్య సంస్థలో పోతేనేమి" అని క్లూ యిచ్చి దాని జవాబు "కవితాసతి" అన్న శ్రీ శ్రీ నుంచి సహేతుకమైన వివరణ పత్రికాముఖంగా కోరుతున్నాను. శక్తివుంటే ఆ జవాబును justify చేయమనండి. చూద్దాం. "ఒకటికంటే రెండు నయం" దీనికి జవాబు "తలలు." ఒకటికంటే రెండు తలలే ఎందుకు నయం కావాలి. సాహిత్య పజిల్సును లాటరీ లెవల్‌కు దింపవద్దని శ్రీ శ్రీకి మనవి.

ఇచ్చే క్లూ, రావాల్సిన జవాబు సమంజసంగా, సహేతుకంగా వుండాలి. ఏది ఏమైనా పై రెంటి విషయంలో వివరణ కోరే హక్కు నాకుంది. Public accountability శ్రీ శ్రీ కి వుంది కాబట్టి Gentleman గా జవాబు యిస్తారని ఆశిస్తున్నాను.

పత్రికను 3 రూ. లు పెట్టి అమ్ముతున్న మీకు జవాబు యిప్పించే నైతిక బాధ్యత మీమీదుంది.

—యస్. కె. రామారావు, నల్లగొండ.


జనవరి మాసపు జ్యోతిలో శివల జగన్నాధరావుగారి 'భాను' ద్వితీయ బహుమతి పొందిన నవల చాలా బాగుంది. రచయిత భాను పాత్రను చక్కగా చిత్రించారు. ప్రచురించిన కథలు కూడా బాగున్నాయి. కార్టూన్లు మమ్మల్నెంతగానో నవ్వించాయి.

పోతే నెలా నెలా ప్రచురిస్తున్న మూడు సీరియల్సు పోటీ పడుతున్నట్లుగా చక్కగా సాగుచున్నాయి.

—గంటా ఉమాశంకర్‌రెడ్డి, కమలారెడ్డి, రుక్మిణీదేవి, రామతిలకందేవి, గీతా దేవిరెడ్డిలు, బరంపురం 1(ఒరిస్సా)

జనవరి నెల జ్యోతిలో మైల, ఎర్రెదవ, మెస్, మోదుగుపూలు, ఈ కథలు మాకెంతో నచ్చాయి. ఈ నెల జ్యోతి నవలానుబంధం ద్వితీయ బహుమతి పొందిన నవల 'భాను' చాలా బాగుంది.

—ఆలమూరి-థామసుదేనియల్, సుదాకరు.


కొనుగోలుదారుల సంతృప్తియే
మా ఆశయం.
అశోక్
స్టోర్స్
* బీసెంటురోడ్
* విజయవాడ-2.
సరసమైన
ధరలు,
గ్యారంటీగల
వస్త్రములు,
సరికొత్తడిజైనులు
గల
పట్టుచీరెలకు
మాప్రత్యేకత!

జీవితంలో కష్ట సుఖాలు ఏ క్షణంలోనైనా రావచ్చు! 'ఆంధ్రా బ్యాంక్' వారి ఈ క్రింది పథకాల ద్వారా మీరు రక్షణ పొందవచ్చు!

★ ★ ★

గృహకల్ప	:	మీకంటూ ఒక సొంత ఇంటికోసం!
జన సహాయ	:	మీ ఆకస్మిక అవసరాల కోసం!
కర్షక సహాయ	:	రైతు సోదరులకు తోడ్పాటు కోసం!
సంరక్ష	:	వృద్ధాప్యంలో ఆర్థికంగా రక్షణకోసం!
సంక్షేమ	:	ప్రమాదాల వల్ల రక్షణకోసం!
కల్పతరువు	:	భవిష్యత్తులో భద్రతకోసం!
భాగ్యలక్ష్మి	:	గృహిణుల అవసరాలకోసం!
కిడ్డీ బ్యాంక్	:	చిన్నారి పాపల భవిష్యత్తుకోసం!

★ ★ ★


ఇతర వివరాలకు మీ దగ్గరి ఆంధ్రా బ్యాంక్ బ్రాంచిని సంప్రదించండి!

ప్రజావసరాలకు పాటుపడేదే—ఆంధ్రా బ్యాంక్

ది ఆంధ్రా బ్యాంక్ లిమిటెడ్,

కేంద్ర కార్యాలయం, సుల్తాన్ బజార్,
హైదరాబాద్ - 500 001.

ఒ. స్వామినాథరెడ్డి : చైర్మన్



మయసభ

నేను రాజకీయవాదిని కాను
నాకింకేమీ దుర్గుణాలు లేవు—

—ఆర్టెమస్‌వార్డ్

ఒకవ్యక్తి బ్రతుకు తెరువుకోసం ఊర కర్మను చేపట్టాలి అంటే అందుకు కొంత తర్ఫీదు అవసరం దర్జావాడకాలన్నా ఎవరిదగ్గరో ఆవిద్య నేర్చుకోవాలి పైఎస్టు కావాలంటే ఆ పరీక్షలేవో పాసవాలి ఇంక ఇంజనీరింగ్ వైద్యం చార్టర్డ అకౌంటెన్సీలాటి వాటి సంగతి సరేసరి టొత్తిగా ఏ యోగ్యతలూ లేకుండా అయోగ్యత ఒక్కటే క్వాలిఫికేషన్‌గా పైకి పైపైకివచ్చి పరాయివాళ్ళ కష్టం మీద పరాన్న భుక్కులాగా బ్రతుకుతూ సుఖంగా వెలిగిపోవాలి—అంటేఅందుకు ఒక్కటే వుంది చక్కని రాజమార్గం అది రాజకీయాలు।

అందుకనే దాదాపు ఏందసంవత్సరాల క్రిందే సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత రాబర్ట్ లూయీ స్టీవెన్సన్—"బహుశ ఎటువంటి అర్హతలుగాని శిక్షణగాని అక్కరలేని ఏకయిక వృత్తి రాజకీయాలు।— అని నిర్వచించాడు

ఈ నిర్వచనానికి తార్కాణాలు రెండు కాళ్ళమీద నడిచేటి తార్కాణాలు కావాలి అంటే గుంటుదేవరపల్లి నుండి న్యూఢిల్లీ దాక అసంఖ్యాకంగా దొరుకుతాయి ఐతే టొత్తిగా ఏమీ తెలియని ఖాళీ బుర్రలుంటే చాలా ఏదో ఒక విధమైన చాకచక్య మయినా ఈ వృత్తికి వుండొద్దా అంటే కావాలి

ఇందులో రెండు మార్గాలున్నాయి లేదా రెండురకాల యోగా లున్నాయి ఒకటి—కర్మయోగం రెండు—రాజ యోగం (జ్ఞానయోగం — గుల్జారీలాల్ నందాలాగా రిటైరయింతర్వాతగాని వర్తించదు)

కర్మ—కర్త—క్రియ

కర్మయోగం కొంతమందికి పంచాయతీ సమితిలోగాని జిల్లాపరిషత్‌లోగాని ఆరంభమవుతుంది కమ్మని కబుర్లు చెప్పడము తలలుమార్చి తలలు పెట్టడము తానుంటేగాని మీవూర్లో తెల్లవారదని

ఏ రామసంజీవి

మిమ్మల్ని నమ్మించడం, తన పూరిల్లు పెంకుటిల్లై, పెంకుటిల్లు డాబామేడై, డాబామేడ ప్రహరీవున్న బంగళా అవడం అంతా మీబాగు కోసమేనని మీచేత ఇటు కలూ సిమెంటూ మోయించడం ఇదంతా ప్రాథమిక విద్య.

ఒకటీ అరా సత్యాగ్రహాలు, 'ఇస్టేట్ మెంట్లు'. నిరసనలు, ఊరేగింపులు, 'సహకార' సంఘాలు నడపడం, వీస్తున్న గాలి ఎటుందో తెలుసుకుని ఆగాలి దేవుడికి హారతులు పట్టడం, అవసరం వస్తే ఆదేవుడికే ఎసరు పెట్టడానికి సిద్ధంగా వుండడం రాష్ట్రరాజధానికి తరచు వెళుతూ వస్తుండడం—ఇది ఉన్నతవిద్య. ఈ పాటికి ఆయన జి-ప-చేర్మన్, లేదాశాసన సభ్యుడు. లేదా ఏదో ఒక అమాంబాపతు సంస్థకు అధ్యక్షుడుగా వుంటూ నెలకు మిగతావన్నీ అలావుంచగా జీతంరూపేణా వెయ్యిరూపాయలకు తక్కువ లేకుండా సంపాదిస్తూ విమానాలమీద తిరుగుతూ వుంటాడు — ఇదంతా సెకండరీస్థాయి.


ఉన్నతయోగ స్థాయిలో — ఆయన ఇక్కడో అక్కడో మంత్రి అయుంటాడు వెనకాల వందిమాగధులుంటారు; ఈ దశలో రంగస్థలంమీద తాను కనిపించకుండా, సూత్రాలు మాత్రం చేతిలోవుంచుకుని వాటినాడిస్తుంటే అలా ఆడుతుండే కీలుబొమ్మలు వేలాది వుంటాయి; ఈ బొమ్మలు సమయానుకూలంగా "ఫలానా వారే ఇండియా" అనీ "ప్రకాశం జిల్లా అంటే ఈయనే—" అంటూ ప్రకటనలిస్తూ, తోకలాడిస్తూ, కృతజ్ఞతలుచెబుతూ వుంటాయి; నిజానికి ఈ బొమ్మలు స్వయంగా ప్రాథమిక లేదా సెకండరీదశ కర్మయోగంలో వుంటాయి. వారికివుండాల్సిన ముఖ్య అర్హతలు రెండు అని జార్జి బెర్నార్డ్‌షా చెప్పాడు; "అతడికి ఏమీ తెలియదు. అతడు తాను సర్వజ్ఞుడినని— అనుకుంటూ వుంటాడు." ఈరెండు గుణాలు పెట్టుబడిగా, ఆశ్రయించడానికి నాయకో నాయకుడో వుండేచాలు. వారి భవితవ్యం దివ్యంగా వుంటుంది.

ఇదంతా కర్మమార్గం. దీనికి యెంత లేదన్నా ఇరవైయేళ్ళ కాలం పడుతుంది. అంటే ఏ పద్దెన్మిదీ యేటో, మెట్రిక్ ఆరో సారి కట్టాక ఆరంభిస్తే-మినిస్టరయిపోయి మాలలు వేయించుకుని గ్రంథాలయాల నుండి గోంగూర పచ్చడిదాకా అన్ని విషయాలమీద మాట్లాడుతూ, శంఖుస్థాపనలు చేస్తూ, జనండబ్బు అప్పణంగా ఆరగిస్తూ వాళ్ళకే కష్టపడి పనిచేయమని నీతులు వల్లించే శుక్రదశ వచ్చేసరికి ఎంతలేదన్నా నలభై వచ్చేస్తుంది.

చక్కని 'రాజమాత' మార్గం.

కర్మమార్గం కనుక, ఈ ఇరవై ఏళ్ళ మార్గం పొడుగునా అనేకానేక కర్మలు చేసుకుంటూ రావాలి. ఈ 'కోర్స్'నే బాగా కుదించాలి అంటే 'రాజ యోగం' ఒక్కటే దారి....

కాని "రాజయోగం" అన్నది దానంతట అదిగా రావాలి కాని మీరుగా యత్నిస్తే రాదు. అది కేవలం పూర్వ జన్మ సుకృతఫలం. ఆ విధమైన సంచిత పుణ్యఫలంగా ఈ జన్మలో మీ అమ్మో, నాన్నో దేశానికి ప్రధానమంత్రి అయి వుంటారు; కనీసం రాష్ట్ర ముఖ్యమంత్రి అయివుంటారు.



'కారు' కూతలు

ఇంక ఆపైన మీరు చేయాల్సిందెల్లా ఇరవైయొక్క సంవత్సరాలదాక వేచి వుండడమే! ఈ సస్పెన్స్ భయం లేక పోతే మీరు నరసేనో, వానరసేనో పెట్టించి ఒకటి—అరా 'నిఝమైన' మంచి పనులు చేయొచ్చు; లేపోతే ఏదన్నా సైకిలో కారో పట్టుకొని 'నే నిలాంటివి తయారుచేసి నా దేశ ప్రజలకి పావలా కొకటిచొప్పున పంచిపెడతాను-' అని మొండిపట్టు పట్టవచ్చు. (ఆ దేశ వాసులకు అసలు పావలాలే దొరకవనీ, ఒకవేళ దొరికినా దాంతో వాళ్ళు 'నూకలు' అనేపదార్థం కొనుక్కుంటారనీ—ఇలాటి అరుపులెన్నో "దేశప్రగతి" గిట్టనివాళ్ళు చెబుతూంటారు; కాని పట్టించుకో కూడదు) ఈలోగా మీకు ఇరవైయొకటి నిండుతుంది. (నిండక చస్తుందా....) మరీ బొత్తిగా ప్రజాస్వామ్యపు తొలిదశ అయిపోయిందిగాని, లేపోతే రాజ్యాంగ చట్టం నూటపదహారవ సవరణ బిల్లు ద్వారా కేవలం మీఒక్కరికి మాత్రం పదహారు నిండగానే పరిశ్రమలలైసెన్సులు, బ్యాంకుల ఋణాలు, ముఖ్యమంత్రుల సాష్టాంగ దండాలూ, ఎపుడన్నా ఆదివారాలు సరదాకు వెళ్ళి పడగొట్టడానికి కావలసిన బుల్‌డోజర్లూ, ఇన్స్‌పెక్టర్ జనరల్సూ, డిస్ట్రిక్ట్ మేజస్ట్రేట్లు, ఐఏ 'ఎస్‌మెన్నూ'—లాటి సకల సౌకర్యాలూ అందే ఏర్పాటు చేద్దుము ....ఊళ్ళు తిరగడానికి రక్షణదళాల విమానాలు, ఎత్తడానికి చేతులున్న ప్రాథమిక దశ కర్మయోగులూ, 'సహస్రకోటి భానుతేజా!' అని ఉగ్గతేచడానికి గడ్డాలు కిరీటాలు వున్న కవులూ సంపాదకులూ సరేసరి—చదరపు మీటర్‌కు ఇద్దరు చొప్పున దొరుకుతారీ కర్మభూమిలో!

....ఇలాటి రాజమార్గంలో మీకు దేశ నాయకత్వం అవహించడానికి మహా అయితే అయిదేళ్ళు పడుతుంది; ఆలోగా తలలు పండిన కురువృద్ధులు లక్షలాది జనులున్న బహిరంగ సభలో మీ ఎదుట

చేతులు కట్టుకు నిల్చుని—"స్వామీ! నేను మీ తాతగారి దగ్గర పన్జేశాను; మీ మాతా పితల పాదధూళితో ఈశిరసు పావనమైంది; రేపు మీ రా గద్దెనెక్కినపుడు మీ పాద కమలాలను మోయడానికి సిద్ధంగా వుంది ఈ ముగ్గుబుట్ట"—అంటూ "కాల్మొక్కే బాంచ" లను చూస్తుంటే — ఈ దేశ ప్రజలు ఎంతటి గొర్రెలో తెలిసి మీరు చిరునవ్వు నవ్వితే అది మరునాటి పత్రికల్లో సంపాదకీయమవుతుంది।

కానీ!

ఇది చాలా పెద్ద కానీ।

కోహినూరు వజ్రమంత కానీ।

చరిత్రగతిని మార్చివేసే కానీ।

అనంతము, అతి ఆకర్షణీయమూ అయిన సంసార మాయలో పడి కొట్టుమిట్టాడే జీవుడికి కూడా అపుడపుడు క్షణంలో లక్షవ వంతో కాలం మెరపులా అవుతుండే జ్ఞానదర్శనం లాటి దేశ జీవితంలోనూ ఏ ముప్పైఏళ్ళకొక్కసారో అవుతుంటుంది.

అప్పుడు జాతి మూడవకన్ను తెరుస్తుంది.

ఆ ప్రళయాగ్నిలో ఈ కర్మయోగులూ. రాజయోగులూ మిడతల్లాగా మాడిపోతారు. దేశం ఒక్కసారి నిట్టూరుస్తుంది. ఆ ఉప్పెనకు ఈ దిష్టిబొమ్మలు ఎగిరిపోతాయి.

ఆర్నెల్ల కొక్కసారి సూర్యోదయం అయ్యే ఆర్క్టిక్ దేశాలకు మల్లే మూడు దశాబ్దాల రాత్రి తర్వాత ప్రజా సూర్యోదయం అవుతుంది.

'నరుడో శివుడా!'

అయితే డి.డి.టి.ని చల్లి చల్లి చంపగా చంపగా—మిగిలిపోయిన క్రిమి కీటకాదులు కొంతకాలానికి ఆ డి.డి.టి.ని నిరోధించుకుని బ్రతకడం ఎలా నేర్చుకుంటాయో—అలాగే కదలిన ప్రజల కదన కుతూహల పదఘట్టనాలనుండి, హుంకరించిన ప్రజాశంకరుల విలయతాండవం నుండి, తప్పించుకుని బొరియలలో, బురదలలో పేడపురుగులవలె దాక్కుని —పినేరియో కాస్త శాంతించాక, ఉగ్ర నారసింహుడు శాంతవిష్ణువయాక—శత సహస్రాలుగా బయిటికి వెలువడుతాయి ఈ రాజకీయ గొంగళి పురుగులు.

నేడో రేపో ఎన్నికలనగా ఈ పురుగులన్నీ శీతాకోక చిలుకలుగా దర్శనమిస్తాయి; పంచదార చిలుకలుగా పలుకుతాయి; కోటూ ప్లేటూ మార్చి సరికొత్త సరాగాలు ఆలపించడానికి గొంతులు సవరించుకుంటాయి; నిన్నటిదాక ఆవు తోక పట్టుకుని గోదావరీదిన సొరచేపలన్నీ నేడు పరకాయి ప్రవేశంచేసి బలరాములుగా రంగ ప్రవేశం చేస్తాయి.

కనుక అమ్మలారా। అన్నలారా।

బహుపరాక్।

పార్టీల లేబిల్స్‌ను చూచి మోసపోకండి।

పాత చరిత్రలను అసలే మరవకండి।

ఎదురొచ్చిన కర్మయోగిని నిలవేసి నాలుగూ అడగండి।

వాడు భిక్షకుడు। మీరు దాతలు।

వాడు బూటకపు సన్యాసి; మీరు గృహస్తులు.

నిజం పక్క, నిజాయితీపక్క మొగ్గండి. ఎందుకయినా మంచిది, మూడవ కన్నును సిద్ధంగా వుండమనండి।। □

జ్యోతి కథల పోటీ

బహుమతులు :

ప్రథమ బహుమతి: రు. **1000/-**
ద్వితీయ బహుమతి: రు. **600/-**
తృతీయ బహుమతి: రు. **300/-**

ఇంకా...ప్రశంసార్హమైన మరో ఆరు కథలకు ఒక్కొక్క దానికి రూ. 100/- చొప్పున ప్రత్యేక బహుమతులు.

రచనలు పంపుటకు ఆఖరుతేది : **1, మార్చి, 1978.**

1. కథలు 16 పేజీలు మించకుండా (ముద్రణలో) ఉండాలి (సుమారు పేజీకి 30 లైన్లతో 16 పేజీల పుల్‌స్కేపు పేజీలు మించకుండా).
2. అనువాదాలు, అనుసరణలూ అంగీకరింపబడవు. రచనలు తమ స్వంతమే ననే హామీ పత్రాన్ని విధిగా కథాంతంలోనే, పంపాలి.
3. ముఖ్యగమనిక : రచయితలు తమ చిరునామాను కథవున్న పేజీలలోగానీ, ఆ పేజీల వెనకగానీ కాకుండా, మరోకాగితంపై వ్రాసి జతచేయాలి.
4. రచయితలు కలంపేరుతోబాటు తమ అసలు పేరును విధిగా తెలియచేయాలి.
5. బహుమతుల ప్రకటన, మొదటి మూడు బహుమతులు పొందిన కథలూ జ్యోతి జూన్ 1978 సంచికలో ప్రచురింపబడుతాయి.
6. ప్రచురణార్హముగాని కథలు తిప్పిపంపగోరువారు కథలతోపాటు తగినన్ని తపాలా బిళ్ళలంటించిన స్వంత చిరునామాగల కవరు జతచేసిపంపాలి.
7. పోటీకి రచనలు పంపే కవర్లపై 'జ్యోతి కథలపోటీ'కి అని విధిగారాయాలి.
8. పోటీలో బహుమతి పొందని కథలలో ప్రచురణార్హమైనవాటిని ప్రచురించుకొనే హక్కు మాకుంటుంది.
9. పోటీ విషయంగా జ్యోతి సంపాదకులదే తుది నిర్ణయం. —ఎడిటర్

జనవరి '78 సంచికలో ప్రత్యేక పారితోషికం పొందిన కథలు

ఎర్రెదవ — రచన: వివినమూర్తి
మెస్ — రచన: కేఎస్వీ

జ్ఞానపీఠ్ బహుమతి గెలుచుకొన్న తొలి మహిళ

శ్రీమతి ఆషా పూర్ణాదేవి

గృహిణిగావుంటూ గొప్పనవలా రచయిత్రిగా రూపొందటం—అందునా జ్ఞానపీఠ్ బహుమతిని గ్రహించడం సామాన్యమైన విషయం ఎంతమాత్రమూ కాదు.

ఈ సంవత్సరపు జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత శ్రీమతి ఆషా పూర్ణాదేవి. జ్ఞానపీఠ్ బహుమతిని గ్రహించిన తొలిమహిళ యీవిడే. ఈవిడ వయసు 69 సం॥

ఆవిడ తన్ను గురించి చెప్పుకుంటూ "సాంప్రదాయాలకు పుట్టినిల్లయిన ఇంట్లో జన్మించిన నేను, అసలు స్కూలుకే వెళ్ళలేదు. నాకు 15వ ఏటనే వివాహం అయింది. అప్పటినుండి కుటుంబమే నా ముఖ్యమైన వ్యాపకం" అన్నారు.

తల్లితండ్రులనుంచి ఆవిడకు ప్రేరేపణ కలిగింది. తల్లి మంచి సాహిత్యాభిమాని. తండ్రి చిత్రకారుడు. ఇంట్లో రకరకాల పుస్తకాలు, పత్రికలు వుండేవి. పుస్తకాలను చదివే అలవాటును తల్లినుంచి యీవిడ సంతరించుకొన్నది.

ఇతరులను ఎప్పుడూ సంతోష పెట్టాలనే మనస్తత్వంగల ఈవిడ, దశాబ్దాల నుండీ మన సాంఘిక వ్యవస్థలోని స్త్రీ స్థానాన్ని గురించే రచనలుచేస్తూ వచ్చింది. ఆనాటినుండి ఆవిడ ఒక ఉద్యమంగా భావిస్తూ చేస్తున్న రచనా వ్యాపకాన్ని ఈనాడు మనం 'ఉమెన్స్ లిబ్' అంటున్నామేమో!

జ్ఞానపీఠ్ బహుమతి పొందిన నవల ప్రథమ్ ప్రతిస్మృతి'—అంటే 'మొదటి వాగ్దానం' అని అర్థం. ఆవిడ మాటల్లో చెప్పాలంటే యీ నవల—"తిరస్కరించబడ్డ గృహవ్యవస్థలోవుంటూ, సమాజం యొక్క మొట్టమొదటి వాగ్దానానికి సంతక ప్రాయంగా ప్రవేశ పెట్టబడిన అనేకానేకమైన అనామక స్త్రీలలో ఒకరి గాధను" తెలియజేస్తుంది.

చిన్నతనంనుంచీ ఆవిడ యీ నవల కోసం మానసికంగా తయారవుతూవచ్చిందనవచ్చును. "మొగాళ్ళే ఏకఛత్రాదిపత్యంగా ఏలుతున్న యీ సమాజంలో స్త్రీ ఎందుకు తన హక్కుస్థానాన్ని తాను చేజిక్కించుకోలేక పోతోంది?" ఆవిడ రచనల్లో యిదే ప్రశ్నను పదేపదే వేస్తూ వచ్చింది. తన మొత్తం జీవితానుభవాన్ని ఈ రచనలో గుమ్మరించింది అనవచ్చును.

తన అనుభవాన్ని తనచుట్టూ జరిగే వాటిమీదే కేంద్రీకరించింది — ముఖ్యంగా తనకు తెలిసిన కుటుంబాలవరకే పరిమితం చేసుకుంది. కుటుంబ వ్యాపకంలో తీరిక చిక్కినపుడల్లా రచనలు చేసేది—తను రోజూచూసే యధార్థాన్నే రాసేది—తన చుట్టూ రోజూ జరిగే వాస్తవాన్నే ప్రతిబింబించేది తన రచనలలో. సమాజంలోని స్త్రీల దురవస్థ ఆవిణ్ని యెప్పుడూ నొప్పించేది.

ఇప్పటిదాకా ఆవిడ 162 రచనలు చేశారు. తన భర్త తనకు చాలా సహాయకారిగా వుంటారు అంటారావిడ.

మొదటి మహిళగా జ్ఞానపీఠ్ బహుమతిని గ్రహించటం తనకు మిక్కిలి సంతో[illegible]న్నారు. □

విషాదయోగం

ఇంకేం మిగిలిందని!

- అందరికీ దేశంలో ఇంత తిండి పెట్టిన
అన్నపూర్ణ ఆంధ్రసీమ కడుపుకొట్టి ఉప్పెన
సాటిమనిషి ఆపదలో జగజ్జనులు చూపిన
ఔదార్యం కాదనలేం. అయితే నా వేదన
పెనుతుపాను మించిన నయవంచన గమనించిన
ఒళ్ళు మండిపోతూంటే ఒక్క దులుపు దులపనా।

పెద్దలు, తమరూ అక్కడేనా!

- వస్తుంది ఓ పూట ఖైదీలు కొందరు
వసూళ్ళు తుపాను విధికి పంపిస్తే
అధికార్లు అందులో కొంత కొట్టేస్తే
పట్టుపడి ప్రస్తుతం అక్కడే చేరేరు।

'వరద' బాధితులు!

- రెండొందలమందిని రక్షించేయిగా దేవుళ్ళ లోగిళ్ళు
ఏదో ఓ ఇరవై వేలపైగా ఎగిరిపోతేనేం మనవాళ్ళు?
అందుకే కట్టించి పారేస్తున్నాం అసంఖ్యాకంగా గుళ్ళు
బతికి చావకపోతారా అదేలెక్కని ఆయుష్షున్నవాళ్ళు

పదివేల కంపుసెట్లు!

- సైకలోను సర్కసులో మేకవన్నె పులుల నటన
సమయానికి ధరలుపెంచి వ్యాపారుల సంపాదన
కేంద్రరాష్ట్ర రాబందులు ఒకరినొకరు ఆరోపణ
పనిమాలిన పర్యాటన ఊకదంపు ఉద్ఘటన
రారాజుల భిక్షాటన మంత్రివరుల ఉద్వాసన
కుళ్ళుతున్న శవంకన్న కొడుతున్నయ్ దుర్వాసన।

సీరియల్



భూమి గుండ్రంగా వుంది

బీనాదేవి సీరియల్

జరిగిన కథ :

జగన్నాధం ఇంట్లోవుండి 'ఇల్లు' కాపాడుతున్న ప్రకాశరావు, జగన్నాధం రాకవిని మరో ఊరు చెక్కేశాడు 'అతనెళ్ళాక నాక్కబురు పెట్టమని' పెళ్ళాంతో చెప్పి. 'అతను లేడుగా ఏం చేస్తాం' అన్న జగన్నాధాన్ని కోప్పడి అతని ఇంటి వైపు బయల్దేర తీశాడు రాజేశ్వరరావు. గోడలపై మొక్కలు మొలిచీ, కిటికీలు దర్వాజాలూ చెదలు తినీ జీర్ణమైవున్న ఇంటిని చూపి కృంగిపోయారు దంపతులు ప్రకాశరావుని ఇంట్లోంచి పంపించేందుకూ, ఇల్లు బాగుచేయించేందుకూ ప్రయత్నం మొదలైంది.

"అయ్యబాబో. అలాగంటారేటండీ తఁవఁరు? నానిలాగున్నానంటే ఆ నారాయణ మూర్తి బాబు సలవేకదు బాబూ. పొద్దుట నెగ్గానే ఆ సూన్నారాయణమూర్తికైనా దండం ఎట్టడం మర్చిపోతానేమోగాని మన నారాయణమూర్తికి మాత్తరం దండం ఎట్టుకుంటానండీ. మనిసన్నాక కృతజ్ఞత ఉండాలి. ఆ బాబే నా ఎడాప్సను దావా గెలిపించకపోతే నా సినీమా హాలుకాడే గేటుకీపరు చేస్తూవుండేవోడ్ని. అమ్మా జానకమ్మా కూతుర్లాంటి దానివి. పన్చెప్పేననుకోకుండా కుపిన్ని మంచి నీళ్ళట్రా అమ్మా...." అని ఆగేడు.

జానకి తెచ్చిన మంచినీళ్ళు తాగేక "నా గొడవకేటిగాని. రాజేస్సర్రావు బాబూ నీకు ఆసుపత్తిరికి టయామైపోద్దో ఏటో, యిందాక మీ కాంపౌండరు బాబొచ్చి నువ్వు సిమెంటు బస్తాలు కావాలన్నావన్నాడు. అప్పుడు నానేటన్నానో ఎరికా "కొత్తిల్లుకట్టి మూడేళ్ళు కాలేదు. ఆ బాబుకి సిమెంటెందుకూ? పిల్లకి పెళ్ళి తలపెట్టినాడు కామోసు. బియ్యం బస్తాలు కావాలనుంటాడు. సరిగ్గా కనుక్కోనిరా" అన్నాను

మరంతే. ఎల్లినోడు మల్లీ తిరిగిరానేదు." అని ఆగేడు.

"బియ్యం బస్తాలు కావు. పిమెంటు బస్తాలే. నాక్కాదు. జగన్నాధానికి" అన్నాడు రాజేశ్వర్రావు.

అంతే! పీడకలలోంచి లేచిన మనిషిలా దిగ్గునలేచి నిల్చున్నాడు. నిల్చుని నమస్కారం చేస్తున్నాడో, చేతుల్తో మొహం కప్పుకుంటున్నాడో తెలీకుండా మొహం దగ్గర చేతులు పెట్టేడు.

"మరి నాకు శెలవిప్పించండి. వద్దనకండి. బాబూ. సెలవిప్పించండి. అంతే కాదు. మరి నన్నెప్పుడూ పిలవనంపకండి. నా మొహం సూపించలేను ..." అంటున్న సుబ్బయ్యని ఆశ్చర్యంగా చూశేడు జగన్నాధం.

"డ్రెమటైజ్ చేస్తున్నాడోయ్ గాడిదకొడుకు" అనుకున్నాడు రాజేశ్వర్రావు.

"ఏమైందోయ్? సంగతి చెప్పు." అడిగేడు జగన్నాధం.

సుబ్బయ్య మొహం అప్పుడే పెళ్ళాన్ని తగలపెట్టి వచ్చినవాడిలా దీనంగ అయిపోయింది. గొంతుకలో కూడా జీరవచ్చింది.

"అయ్యో. ఏమైందని మెల్లిగా అడుగుతారా బాబూ. ఇంకేటి అవాలి? నా ఇంటి దీపాన్ని ఎలిగించిందెవరు? తమరుకాదా? మరలాంటి దేఁవుఁడికి పిడికెడు పిమెంటు యివ్వలేకపోతన్నాను. ఇంక ఈ యాపారం, డబ్బు, మేడలు, ఇయ్యన్నీ ఎందుకు బాబూ. అప్పుడెప్పుడో రాములోరు బ్రిడిజి కడతావుంటే సిన్న ఉడతపిల్ల కూడా సాయంసేసింది. నేనా ఉడతపిల్లంత సాయం కూడా సెయ్యనేకపోతే ఎందుకు? తమలాటోరికి తెలవదు బాబూ యీ ఎదవ యాపారం లొసుగులు. సెప్పినా తమ కరదం కావు. కాని ఓ మాట నమ్మండి బాబూ. యీపాలి కోటా రాగానే లారీ ముందుగా మీకాడికే ఒట్టుకొస్తాను. తమక్కావల్సినన్ని బస్తాలు దించుకోండి సత్తెపెమాణికంగా సెప్తున్నాను...." అని అతి దీనంగా మొరపెట్టుకున్నాడు.

".. తమకబద్దం. నాకు నిజం. రాబోయే మూడు కోటాలకి మూణ్నెల్ల కిందటే పెరిమిట్లు బక్కూరి పారేసినాడా తాసిల్దారుబాబు. నాలుగో కోటా వరకూ నేను సస్తే నా సమాధి కట్టడానిక్కూడా నా దగ్గర పిమెంటునేదు. అయినా మీకెందుకు? యీపాలి కోటాకి మీ అవుసరం గడిపే పూసీనాది...." అంటూ లేచాడు.

జగన్నాధం ఆ ఊర్నించి వెళిపోయీలోగా భార్యా సమేతంగావచ్చి తనింట్లో భోజనం చేస్తానన్న వాగ్దానం తీసుకొని మరీ వెళ్ళేడు.

"అహా. అబ్బీ. బెస్ట్ యాక్టర్ ఎవార్డు నీకురా యివ్వాలి" అభినందించేడు రాజేశ్వర్రావు.

"పోనీ మరోడి దగ్గర ట్రైచేస్తే?"


"ఏ పుట్టలో ఏ పాముందో?" జానకి అమాయకత్వం.

"ఇక్కడ అన్ని పుట్టల్లోను నల్లతాచులే. అడిగి లేదనిపించుకోవడం తప్ప

నో యూజ్" రాజేశ్వర్రావు విశదపర్చేడు.

"జానకీ. సామాను సర్దు. సాయంత్రం పోదాం. ఇల్లూలేదు. వల్లకాడూ లేదు. అసలు నాకా ఇల్లే అక్కర్లేదు. వాళ్ళనే కట్టుకు ఊరేగనీ. ఊఁ. రెడీ అవు. అలా చూస్తావేఁవిఁటి చెడుపు పెట్టేదానిలా. నేను తెలుగులోనే చెప్తున్నాను. మళయాళ మంత్రాలు చదవడంలేదు. అర్థం ఔతున్నాయా? నిక్షేపంలా ఉన్నవాడ్ని నా ప్రాణం తోడేసేవు ఇల్లో, ఇల్లో అని. అయిందిగా ఇంద్రభవన భోగం. ఇంక రెష్టు తీసుకోండి రాణీగారు. అసలు ఆడదాని సలహా వినడం తప్పు. విని పాటించడం మహాపరాధం. ఒరే రాజా, ఇంక మమ్మల్ని ఆపకురా నాయనా. చచ్చి యీ జన్మలోనే నీ కడుపున పుడతాను." వెర్రెత్తిపోతోంది జగన్నాధానికి.

"నీలాంటిదే వెనకటి కొకావిడ అత్తగారిమీద కోపంవచ్చి కూతుర్ని కుంపట్లో కూర్చోపెట్టిందిట. నువ్వు యిప్పుడుగాని ఒదిలీపిపోయేవంటే యింకా యింటికి చెమ్చాడు నువ్వులు జాగ్రత్త చెయ్యడం మంచిది" తీర్పు చెప్పేడు రాజేశ్వర్రావు.



"మరెలా చావడం? డబ్బుపెట్టి కొంటానంటే వస్తువు దొరక్కపోతే ఎలా పోనీ పిమెంటులేకుండా గడుపుకోలేవుటే అమ్మడూ?"

"మీ యిష్టం. పూర్తిగా ఇసకతోనే పనిచెయ్యడానికి మేస్త్రీ ఒప్పుకుంటే నాకేం అభ్యంతరంలేదు. కాకపోతే ఆ ఇసకైనా ఏటికెళ్ళి ఏరుకు తెచ్చుకోవడం అనుకుంటున్నారేమో! బండి యిసక పదిరూపాయలు. బండి అంటె మూడు బుట్టలు వుంటుంది. ఇందాక అక్కడెవరో వేయించుకుంటె అడిగేను. పైగా బండికి రూపాయి "ఆశీలు"ట. "ఆశీలు" కట్టకపోతే బండిని రోడ్డుమీంచి రానివ్వరుట వివరించింది జానకి.

"బండి రోడ్డుమీంచి కాకపోతే హెలికాప్టర్లాగ ఎగిరొస్తుందనుకున్నారేఁవిఁటి? ఇవేఁవీఁ జగన్నాథానికి కర్థంకావు.

"నామీదెగుర్తారేఁవిఁటి? చేతనైతే నాలుగు లారీలు ఇసక తెప్పించకూడదూ? దెప్పింది జానకి.

"వీడికి తెలీదు. కాని లారీలో యిసక ఖరీదు పదిరూపాయలు, లారీ అద్దె ముప్ఫైరూపాయలు. అన్నంకంటె ఆవకాయ ఎక్కువని. ఎందుకీ రాద్ధాంతం. నువ్వు కాస్సేపు బ్లాకులో కొనను అన్న ప్రిన్సిపల్ తీసి గట్టుమీద పెడితే, నేను అరగంటలో అరవై బస్తాల పిమెంటు తెప్పిస్తాను" ఉపాయం చెప్పేడు రాజారావు.

కూర్చున్న జగన్నాథం తక్కునలేచి నిల్చొని "నెవర్. నేను ఛస్తే ఒప్పుకోను. మనలాంటి వాళ్ళుకూడా యిలాంటి దోపిడీని ఎంకరేజ్‌చేస్తే యింక మన చదువులెందుకు? అసలిలాంటి వాళ్ళని ఫిలక పట్టుకొని పోలీసులకెందుకు అప్పచెప్ప కూడదూ?" అన్నాడు ఆవేశంగా.

జగన్నాథం ఆవేశానికి రాజేశ్వర్రావుకి నవ్వొచ్చింది.

"ఎందుక్కూడదూ. తప్పకుండా కూడును. నీకు మెడికల్ నాలెడ్జే గాని జనరల్ నాలెడ్జి దేఁవుఁడు యివ్వలేదు. మనం ఇన్‌స్పెక్టరు దగ్గరకెళ్ళి "ఏవండేవండీ ఫలానావాడు పిమెంటో లేక మరోటో బ్లాక్ చేస్తున్నాడు, పట్టుకోండి" అంటే వాడ్ని పట్టుకున్నా, పట్టుకోకపోయినా ముందు మనల్ని పట్టుకుంటాడు. ఆ పోలీసు కొంచెం మంచివాడైతే—యిది అసంభవం అనుకో—"ఏం నాయనా? రాత్రి కలగని వచ్చిందా? నీకెలా తెలుసు?" అనడుగుతాడు. మరంచేత...."

"మనం ఎంతకొన్నామో చెప్తాం" రాజేశ్వర్రావు మాటకి అడ్డొచ్చేడు జగన్నాథం.

"మన మాట ఎందుకు నమ్మాలి? యిలాంటివాటికి ఎకౌంట్లు, రశీదులు ఉండవు. ఇంకా దేవుఁడు మేలుచేస్తే, మొన్న మా పేషెంటొకడు ఎవడిచేతికో డబ్బిచ్చి పిమెంటు బస్తా తెమ్మన్నాడు. బస్తాతోపాటే కబురొచ్చింది డబ్బిమ్మని నేను ముందే డబ్బు పంపేనంటాడు వాడు. ఇవ్వలేదంటాడు షావుకారు."

"ఒకవేళ ఆ మధ్యవాడు జేబులో వేసుకున్నాడేమో।"

"బానిస ఎప్పుడూ బుగతనే నమ్ముతాడు. నువ్వుకూడా ఆ షావుకార్నే నమ్ముతున్నావు. అఫ్‌కోర్స్. నువ్వన్నదీ అవొచ్చు. కాని యీ సందర్భంలో మాత్రంకాదు. వాడు నాకు తెలుసు. రెండుసార్లు డబ్బిచ్చి ఒక బస్తానే కొన్న వాడి కంటె మనం నయంకాదూ. నువ్వీ కంఠశోష మానేసి యింకేవైనా చూసుకో. పిమెంటు సంగతి నేను చూస్తాను." అన్నాడు లేస్తూ.

ఆ సాయంత్రానికి రెట్టింపుధరకి బ్లాక్‌మార్కెట్లో పది బస్తాల పిమెంటు తెప్పించేడు రాజేశ్వరరావు.

"ఆడీకీ మాకూ మామూలండి. నాక్కాబట్టి యీ రేటు కిచ్చినాడండి. నా ఎదటే మరో రూపాయెక్కువిచ్చి అట్టుకుపోతున్నారండి జనం. మనకవుసరం నేకపోతే యీ ధరకి ఎవుడుపడితే ఆడే కొనుక్కుపోతాడండి కళ్ళకద్దుకొని మరీ" అని భరోసా యిచ్చేడు బస్తాలు తెచ్చిన బండీవాడు జగన్నాధానికి.

13

మర్నాడు పొద్దుటే ముగ్గురు మేస్త్రీలు, ఆరుగురు మొగ, డజను ఆడ కూలీలు పన్లోకొచ్చేరు. పొద్దుట పదిగంటలకొచ్చి, సాయంత్రం ఆరువరకు పనిచేస్తారనుకు-ది జాన్ ఆఫీస్ టైము అలవాటైపోయి


కేశ సంపదకు
రీటా
RITA
RITA
GROWS LOVELY HAIR
స్త్రీలూ పురుషులూ వాడవచ్చును
సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది

కాని కాదుట.

"ఓలమ్మ. యీ ఎండకి పిట్టల్నాగ రాలిపోవాఁ తల్లీ. యీ ఏసంకాలం అన్నాళ్ళు బేగి లెగిసొచ్చి, పొద్దు నడినెత్తికొచ్చేవరకు సేపిపోతావండి. మద్దెలో గెం ఁకో సుట్టు పనాపుతాం. మరింక మద్దినేల రావండి" అని క్లారిఫైచేశేరు వాళ్ళు.

ఏదో మాట సాయవేఁగాని తను దగ్గరుండి ఛస్తే పనిచేయించనని, కూలీల పోర్టుఫోలియో జానక్కిచ్చేశేడు జగన్నాధం.

ఏనాడూ ఏడుగంటలక్కానిలేవ్వని జానకి చచ్చినట్టు తెల్లారుజాము అయిదు గంటలకేలేచి ఆరో గంటకల్లా స్వంత యింటికెళ్ళింది. జానకి వెళ్లేసరికి మేస్త్రీలు, కూలీలు వీధి గుమ్మంలో కూర్చుని చుట్టలు కాల్చుకుంటూ ఊసులాడుకుంటున్నారు.

"మావొఁచ్చి జాం పొద్దయింది తల్లీ. గెంజినీళ్ళన్నా గొంతులో ఏసుకోనేదు. ఎర్రి బేపిల్నాగ ఎంతరిపినా ఎవుడూ తలుపులు తీయకపోతే మాకు, పన్లెలాగౌతాయి? ఇదిగో యీ కూలీ జట్టుని ఎట్టుకుంటే పన్లవ్వవని మీరే అంటారు మల్లా. బేగి తలుపులు తీయించమ్మా" మెత్తగా చీవాట్లు పెట్టేడు సీనియరు మేస్త్రీ.

అరవగా, అరవగా ఎలాగయితేనేం అరగంట తర్వాత మాయామహల్ తలుపులు తెరుచుకున్నాయి.

నిన్నటి పళ్ళపిల్ల తల్లిలా ఉన్నావిడ—ఈవిడకి నోటినిండా నూటముప్పై పళ్ళు అడ్డదిడ్డంగా కూరేసినట్టున్నాయి—"పొద్దున్నే ఏఁవిఁటీగోల" అన్న మొహం పెట్టి నిల్చింది.

"ఈ సామాన్లు కొంచెం పక్కగదిల్లో సర్దుకుంటే గోడలు రిపేరు చేస్తారు." ధీమాగా అడుగుదామనుకున్న జానకి ఎపోలజెటిగ్గా అడిగింది, గదిలోవున్న సామాను వేపు చూపిస్తూ.

ఆ గదిలోవున్న సామాన్లు పాతపేకేజీ పెట్టెలు, విరిగిపోయిన కుంపట్లు, తుప్పట్టిన రేకుడబ్బాలు, చిత్తుకాయితాలు, కోళ్ళు విరిగిపోయిన మంచం వగైరాలు. అసలా సామాను ఏగదిలోను పెట్టనవసరంలేదు. వాటికావాల్సింది పురిషెడు పెట్రోలు, ఒక అగ్గిపుల్ల. గదిలో సామాన్లులేనిచోట అడ్డదిడ్డంగా పిల్లలు నిద్ర పోతున్నారు. కొంతమందికే చాపలున్నాయి. అంతమందికీ మాసిన దుప్పట్లముసుగు లున్నాయి. కొంతమంది ఒకర్నొకరు కౌగలించుకుని పడుక్కున్నారు. మిగతావాళ్ళు ఒకరి గుండెలమీద ఒకరు తన్నుకుంటున్నారు. వాళ్ళలో ఒకడు బహుశా జ్యేష్ఠుడు కాబోలు కాళ్ళుముడుచుకుని ఉండకపోతే కాళ్ళదగ్గర తిన్నె మీదున్న దేవుఁళ్ళ నడుములు విరిగిపోయుండేవి.

ఈ ముసుగులు కప్పిన శవాల్లావున్న పిల్లల్నిచూస్తే జానక్కి అసహ్యం వేసింది.

"ఇంట్లో ఎవ్వరూలేరు సామానంతా తియ్యడానికి. మీ కూలీలచేత తీయించు

కొండి" మూతి ముప్పై వంకలు తిప్పుతూ చెప్పే — ఋష్మై ల్లి

ఎవరూలేరా!

అయితే ఈ శవాలు నిజం శవాలు కావుకదా భగవాన్!

ఆ తరువాత ఆ శవాలకి ప్రాణప్రతిష్టచేసి. లేపి. గదిలో సామానంతా మరో గదిలోచేర్చి మనిషి నిల్చోడానికి వాసయోగ్యంగా చెయ్యడానికి సుమారుగంట పట్టింది జానక్కి.

ఈగంటసేపు మేస్త్రీల చుట్టలు ఆరలేదు.

కబుర్లు ఆగలేదు.

మధ్యలో మాత్రం "ఆఁ, ఆఁ, బేగితెవఁలాల. ఏటా పెళ్ళోరి నడకలు? ఓ ఇద్దరెళ్ళి నీళ్ళట్రండి" అని పురమాయించేడు ఒకడు తనేవీఁ చెయ్యకపోవడం తన తప్పు కాదన్న మొహంపెట్టి.

"మరండి. పిమెంటులోకి నీళ్ళు ఏడనుండి తేవాల?" ఒక కూలిదానికి డౌట్ వచ్చింది.

"నేనేం అర్జునుడి ననుకున్నావేఁవిఁటే. నీ అమ్మకడుపు కాలా. బాణం వేసి నీళ్ళు పుట్టించడానికి?" మనసులో తిట్టుకున్న జానకి "గుమ్మంలో కొళాయి పెట్టుకొని నన్ను నీళ్ళు అడుగుతావేఁవిఁటమ్మా? లేకపోతే అల్లదిగో నుయ్యి. అందు లోంచి తోడండి" అని నుయ్యి చూపించింది.

"పంపుకాడ మాఁవెలా తేగలం తల్లీ! ఎన్ని నీళ్ళు ఆ యమ్మల తానాలకే సాలవు. బిందెమీద బిందెట్టేడవూఁ, తానవాఁడీడవూఁను. మావెఁత్తే మైలడిపోనా వంటారు. మూడుకుండలు తెచ్చేసరికి మాపిటేలవుద్ది. నూతికాడే తోడతాం గాని ఓ సేదవుంటే బడీ" అంటూ చీరమోకాళ్ళమీదికి ఎగ్గట్టింది ఓకూలిది.

అవును అన్నట్టు నీళ్ళు తోడ్డానికి బకెట్ కావాలి. అవి పొయ్యడానికి డ్రమ్ము కావాలి. ఇవన్నీ ఎవరిస్తారు? అసలు నిన్ననే వీటి గురించి ఆలోచించాల్సింది. కొత్త పూజారత్వం.

మానసం చంపుకొని యింట్లోవున్న వాళ్ళనడిగితే!

తప్పేం వుంది? ఉంటే యిస్తారు?

లేకపోతే లేదంటారు. కాని కొట్టరు.

ఉంది లేదనొచ్చని జానక్కి తట్టలేదు.

"ఆ ఇంట్లో కెళ్ళి ఆ అమ్మనడిగి తెచ్చుకో"మని ప్రకాశరావు వాటావేపు చూపించింది జానకి.

"ఓయమ్మా! ఓ సుట్టు రెండు బాల్చీలు యియ్యి. పనై పోగానే యిచ్చేస్తాం" గావుకేక పెట్టింది ఆ కూలిమనిషి ఆ వాటావేపు తిరిగి.

"మేవేం బకెట్ల దుకాణం పెట్టుక్కూర్చోలేదు. లేవు" వాటా వాణి పలికింది.

"ఏటోలమ్మ. మావేం కొరుక్కుతినేస్తావాఁ? కరిగించేసుకొని తాగేస్తావా?

అలాగై పోతన్నావ్ సేదిమ్మంచేను? ఆ యమ్మదేటి యీ వూరా? యీ దేశవా(? పొరుగూరి మడిపికి సామానెక్కడొస్తాది? మావైనా కుండలు తెచ్చినావు(గావి. నూతిలోకి గెంతగలవే(టి నీళ్ళు తోడ్డానికి? ఇల్లో నారాయణమ్మ నీ యిల్లెక్కడంటే, నా యిల్లు అడివిలోనని యింత " దండకం ఎత్తుకుంది కూలీ.

ఇవన్నీ తనే అనిపిస్తోందనుకుంటారేమోనన్న భయం వేసింది జానక్క.

"ఏయ్ అమ్మీ. నీ నీళ్ళకో నమస్కారంగాని రభస చెయ్యకు. బావుండదు. యీ పూటకి పంపు దగ్గరే తెండి. ఎంత పనైతే అంతే ఔతుంది. కావాల్సినవి సాయంత్రం కొనుక్కుందాం. యీలోగా ఓ మనిషి డాక్టరు రాజేశ్వర్రావింటి కెళ్ళి ఆ అమ్మగార్నడిగి రెండు బకెట్లు తీసుకురండి...." అని దానికి పని పురమాయించి "ఏ(వి(టోయ్ అలా నిల్చున్నారు. మీ పని మీరుగానీండి" అంది మేస్త్రీలతో. ఏదో ఒకటి అనాలి కాబట్టి.

"మా(వే(టి సెయ్యవండి. పిమెంటు వాయి కట్టండిరా అంటే యిదిగో యీల్లింకా నీళ్ళకెల్తున్నారు. ఒలేయ్! గుంటా, బొమ్మన్లాగ అలా నిల్సుంది పోనారేటి? నాలుగు తట్టలు యిసకెత్తుకొచ్చి జల్లించండి'' అర్డరేసేడు పెద్దమేస్త్రీ. ఏ పనీ చెయ్యకుండా అలా నిల్చోడం తన కెంతమాత్రం యిష్టంలేనట్టు.

"సీరెట్టి జల్లిచ్చమంటావా? సేతులెట్టి జల్లిచ్చమంటావా? సెప్పు" తన తప్పు లేదంది ఆ గుంట.

అవునన్నట్టు జల్లెడకూడా ఉండాలి. పోనీ యీ పూటకి జల్లించకుండానే చెయ్యండి అంతే వాళ్ళు నవ్వుతారేమో! ఆఖరికి యీ కూలీలక్కూడా లోకువై పోవడం దేనికి?

"ఆ బకెట్లకి వెళ్ళే మనిషిని డాక్టరుగారింటినుంచి జల్లెడ కూడా తెమ్మను" హెడ్ మేస్త్రీతో అంది జానకి "ఆల్వేజ్ డీల్ విత్ ది టాప్‌మేన్" అన్న జగన్నాథం సూక్తి గుర్తుకు తెచ్చుకుంటూ.

"అదెల్లి అరగంటైనాది. యీపాటి కొచ్చేస్తూంటాది" అన్నాడు టాప్‌మేన్

"అయితే మరో మనిషిని పంపించు" అంది జానకి. రెండో కూలీని కూడా పంపించేస్తున్నందుకు విచారంకంటె, యీ సంగతి తెలిస్తే జగన్నాథం యిచ్చే లెక్చరు ఊహించుకొని భయపడుతూ.

"నువ్వెళ్ళే నచ్మీ" పురమాయించేడు.

తొందరగా పని అవుతుందని లక్ష్మిని రిక్షాలో వెళ్ళమందా మనుకొని, రిక్షా కోసం మళ్ళీ మూడో కూలీని పంపించ మంటారేమోనని మానేసింది జానకి.

అసలు లక్ష్మి చంచల లక్ష్మిట.

కూలీ లక్ష్మి అచంచల లక్ష్మి.

గజగమన.

ఆవిడ అరక్షణం ఆగకుండా నడుస్తూనే ఉంది.

అరగంటైనా వీధి చివర చేరలేదు.

దూరమౌతున్న ఆ గజగమనవి చూస్తూ, నుదుటి చెమట చీరతో వత్తుకుంటూ, వాకట్లో నారింజచెట్టు నానుకొని నిల్చుంది జానకి.


ఉదయం ఏడుగంటలే అయినా ఎండ నెత్తి పేలగొట్టేస్తోంది. కూర్చోడాని కైనా చోటులేదు. యీప్రకారం మధ్యాన్నం ఒంటిగంటవరకు పేలాల్లా మాడిపోతే యింక ఇంటి కెళ్ళక్కర్లేదు. భగవాన్! విలవ నీడలేకపోవడం అంటే యిదేనేమో!

నీడ చూపించడానికే అన్నట్టు "ఎప్పుడొచ్చేవ్ జానకీ? మీ ఆయన కూడా వచ్చేట్ట ఏదీ? యిలాంటి పని అడదానివి నువ్వేం చేయిస్తావు? అరె? అదేఁవిఁటి? అలా ఎండలో మాడిపోతున్నావు? వరండాలోనన్నా కూర్చోలేకపోయేవా?.. " అప్పుడే వచ్చిన కామేశం అడిగేస్తున్నాడు.

కామేశం, జానకి ఒక ఊరివాళ్ళు. కలిపి ఆడుకున్నారు. కామేశం కుటుంబం, జానకి కుటుంబం ఒకే కుటుంబంలా వుండేవారు. జగన్నాథం గవర్నమెంటు సర్వీసులోకి వెళిపోయేక, ఆమధ్యనే కామేశం ఆ ఊరు ట్రాన్స్ఫరయ్యేట్ట.

ఎక్కడ కూర్చోను?" అన్నట్టు చూపింది జానకి నీరసంగా.


"పొద్దున్న కాఫీ తాగేవాఁ? టిఫిన్ తిని రాలేకపోయేవా? . . అలవాటులేదూ? మంచిదాఁవే. ఇదంతా అలవాటుందనే చేయిస్తున్నావా? అయినా మీ ఆయనేం



కలియుగ బుద్ధుడ ననుకుంటున్నాడేఁవిఁటి? ...విన్నాన్లే కథంతా. డర్టీ పెలోస్ని· చెంబూ, తపేలా బైటికి విసిరేద్దును నేనైతే. చూసేవా! ఖర్మ అంటే యిదే కాబోలు. యిదివరకు నమ్మకపోయినా, యిప్పుడు నమ్మవల్సివస్తోంది ఖర్మ సిద్ధాంతం! లేకపోతే నీ ఇంట్లో నీకు నిలబడ్డానికి చోటులేకపోవడవేఁవిఁటి? డోన్ట్ ఫీల్ హర్ట్‌గాని జానకీ ఇదేఁవిఁల్లు! అతని మాటెలావున్నా నీ బుద్ధేమైంది? థేంక్ గాడ్! యిప్పటికైనా మీకు జ్ఞానోదయం అయింది కాని లేకపోతే పునాదులే మిగిలేవి. ....అవును గాని సిమెంటెక్కడిది నీకు? కొంపతీసి బ్లాక్‌లో కొన్లేదుకదా? ... ఎదుటి వాడిని నోరెత్తనివ్వకుండా గచ్చపొదలా గలగలా మాట్లాడ్డం కావేఁశం ప్రత్యేకత.

సిమెంటు కథంతా చెప్పింది జానకి.

"అరెరె! ఎంత పనిచేశేవు! నేనిక్కడ ఇంజనీర్నని తెలుసుకదా....పోనీ నా చెవినోసారి వెయ్యకూడదూ? ఛ! ఛ! అంత మొహమాటం నాకు నచ్చదుసుమీ. నేను గారంటీ యివ్వలేను గాని ఐ విల్ ట్రై. నా దగ్గర కొందరు కాంట్రాక్టర్లు ఉంటారు. వాళ్ళదగ్గర సిమెంటు బోలెడుంటుంది. నొక్కాల్సిన చోట నొక్కితే ఓ పాతిక బస్తాలు రాల్తాయేమో చూస్తాను ...ఏఁవి-టీ? పది బస్తాలు చాలన్నారా? ఆ పూట కూలీ అంటే రెండుచేతా, మేస్త్రీ అంటే నాలుగుచేతా గుణించు. ఆ పది బస్తాల్నీ యీ ఇల్లు నంచుకుంటుంది——పర్సుతీస్తున్నావు డబ్బుకా? తరవాత చూసుకో వచ్చులే....యివ్వకుండా వెళిపోతేనో అంటావా? నీమీద ఆమాత్రం పెట్టుబడి పెడితే


billyboy
SUITINGS
AARBEELON
SILK MILLS
BOMBAY 400 068
Distributors
K LALSAREEWALA
Ghadial Galley
BOMBAY-400 002

నష్టంలేదులే. నొ. నొ. అలా యిబ్బందిగా పెట్టకు మొహం. నువ్వేం మారలేదు సుమా. నాకు టైమైపోతోంది. పదినిమషాలు ఆలశ్యం అయితే పిప్పరమెంటు బిళ్ళలా చప్పరించేస్తాడు మా ఇ. ఇ. వస్తాను....మళ్ళీ కలుస్తాన్లే. విష్ యూ స్పీడీ ప్రోగ్రెస్ ." అంటూ గాలివానలా వెళ్ళిపోయేడు. వెళ్ళినవాడు తిన్నగా ఆఫీసుకి వెళ్ళలేదు. ఇంటికెళ్ళి ఫ్లాస్కునిండా కాఫీ, ఓ కప్పు సాసరూ, ఓ కుర్చీ పంపించేడు, ఆ ఒక్కరోజేకాదు. జానకి అక్కడున్నన్నాళ్ళూ రోజూ కాఫీ కావేశం యింటి నుంచి వచ్చేది.

ఫరవాలేదు. ప్రపంచంలో యింకా ఒకటీ, అరా మంచివాళ్ళున్నారన్నమాట.

"కావేశం! దేవుడు గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు కాని, యీక్షణాన మాత్రం దేవుడే నీ రూపంలో వచ్చేడు" అనుకుంది జానకి కాఫీ తాగుతూ.

పదిగంటలు అవ్వొస్తోంది.

"నీళ్ళెక్కడ ఒయ్యమంటారండి? అంది నెత్తిమీద నిండుకుండతో ఒక కూలిది.

"నా నెత్తిమీద" అందామనుకుంది జానకి విసుగువల్ల. "నిజంగా అలా పోయించుకుంటే ఎంతహాయిగా వుంటుంది ఈ ఎండలో" అనుకుంది మరుక్షణంలో.

పైకిమాత్రం "పిమెంటు కలుపు" అంది.

"పిమెంటు ఇంకొద్దనీసినాడండి మేస్త్రీ. సల్లులకి దిగాలకదండి మరి."

అప్పుడే పదయిందా? ,

సూర్యుడయినా గతి తప్పుతాడేమోగాని వీళ్ళ టైముతప్పరు.

"ఔనుగానీ ఎంతసేపూ మీరు నలుగురే కనిపిస్తున్నారు. మిగతా వాళ్ళేరీ?"

"అదిగో యిద్దరేమో పంపుకాడ కూకున్నారండి. (అవును చక్కగా బాల్చీలు బోర్లించి వాటిమీద కూర్చుని చుట్టలు కాల్చుకుంటున్నారు. నూతిలో ఉప్పునీళ్ళని పంపునీళ్ళే తెమ్మన్నాట్ట మేస్త్రీ)....మరండి. యిద్దరేమో యిసిక మోస్తున్నారండి. అల్లదిగో మేస్త్రీలకాడ పిమెంటు అందిస్తున్నారండి యిద్దరు. (ఒకత్తి మేస్త్రీ నోట్లో చుట్టకి అగ్గిపుల్ల కొడ్తోంది. వాడి జోక్‌కి రెండోది నవ్వుతోంది. మీ అమ్మకడుపులు చల్లగా వుండాలికాని మీకివాళ చుట్టలు కాలుస్తున్నందుకే నేను డబ్బు యిస్తున్నాన్రా) మరి నీళ్ళెక్కడ పొయ్యమంటారండీ?" ఆగుంట వదల్లేదు.

"తీసుకెళ్ళి నూతిలో పోసే నన్ను చంపక" లోపల అనుకోబోయి పైకి అనేసింది.

"ఓత్తల్లీ. పంపు నీళ్ళట్టకెళ్ళి ఉప్పునీళ్ళ నూతిలో ఒయ్యమంటావేటి? ఈడ దింపేస్తాను. సల్లులకేనా సాల్తాయి." అంటూ కుండ దింపేసింది ఆగుంట.

మరో పావుగంటలో బిలబిల్లాడుతూ చల్లులకంటూ అందరూ పని ఆపేశారు. నూతిదగ్గర కాళ్లూ, చేతులూ కడిగేరు. జానక్కి చల్దితినాలన్న బాధలేదు. అంచేత

కావేశం పంపిన కాఫీ కప్పులో పోసుకుని వరండాలో కుర్చీలో కూర్చుని కూలీలనే చూస్తోంది.

వాళ్ళంతా జానక్కి కొత్తగానూ, తమాషాగానూ ఉన్నారు. తాళ్ళతో నారింజ కొమ్మలకి కట్టుకొన్న చిన్నచిన్న గిన్నెలు విప్పుకున్నారు. వాళ్ళకి పాపం ఆ వరండా తప్ప కూర్చోడానికి చోటులేదు. వరండాలో జానకివుంది. ఏం చెయ్యాలో తోచక ఎండలో నిల్చున్నవాళ్ళని చూసిన జానక్కి ఒక్కసారి ఎవరో కడుపులో ఇనుపపళ్ళ చక్రం తిప్పినట్లైంది.

"అదేవిటర్రా? అలా నిల్చున్నారు? ఇక్కడకొచ్చి తినండి. నేనేం దిష్టి పెట్టనులెండి" అంది.

వాళ్ళంతా వరండాలో చతికిలబడ్డారు. అమ్మగారి ఎదురుగా అలా తినవలసి వచ్చినందుకు కొందరు సిగ్గుపడుతున్నారు. గిన్నెలమీది మూతలమీద ఒకఉల్లిపాయో రెండుకాల్చిన ఎండుమిరపకాయలో, ఒక పచ్చిమిరపకాయో ఉన్నాయి. ఒకో గిన్నెలో పిడికెడు అన్నం. గిన్నెడు గంజి.

వాళ్ళు చక్కగా మూతలుతీసి సరసాలాడుకుంటూ. నవ్వుకుంటూ, ప్రపంచంలో స్వర్గం అంటే ఇదే అన్నంతహాయిగా తినేస్తున్నారు. నంచుకోవడానికి ఏవీ తెచ్చుకోనిదానికి, రెండు మిరపకాయలున్నవాడు ఒక మిరపకాయిచ్చాడు. "ఉం ఊఁ, వద్దులేరా మావాఁ. నాను నంచుకునేక పోయినా తినీగల్ను. నువ్వు తినీ. అని మొహమాట పడుతోంది అది.

"తీసుకోయే ఎర్రినంజా. మిరపకాయ నంచుకిచ్చి నిన్ను మనువాడన్లే. బయం నేదు. నాకాడ రెండు మిరపకాయలున్నాయికదా? నీకోటిస్తే ఏటిపోద్ది? ఎదవ కడుపు ఎంతతింటే వద్దంటాది? తిను తిను" అని బలవంతాన దానికో మిరపకాయయిచ్చి "ఏటే గుంటా, అలాగేరుతున్నావ్? ఎర్రసీవఁలట్టేసినాయేటి? పాపం! ఆటికి మాత్తరం యెవరెడతారు? ఎర్రసీవఁలు కంటికి మంచిదంటారు. తినేపి బేగినెగు. అంటూ యింకో పిల్లతో హాస్యమాడేడు.

వాళ్ళనలా చూస్తున్న జానక్కి ఎండబాధ తెలియలేదు. వాళ్ళలా బతకడం నేర్చుకుంటే!

తనదగ్గర రెండుండి, ఎదుటివాడికి లేనప్పుడు తనదొకటి తీసి యివ్వడం నేర్చుకుంటే!!

తానే గంజయినా నవ్వుతూ తాగడం నేర్చుకుంటే!

వీళ్ళదగ్గర నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి.

దేశంలో యింత దరిద్రం వుందా?

నేనిచ్చే ముష్టి మూడ్రూపాయలకి వాళ్ళకి ఎండలో శ్రమపోను మిగిలేదిఇదా?

జానక్కి కాఫీ సహించలేదు.

కాఫీకప్పు కిందపెట్టి వరండాలో రెండోవేపు చూసింది.

అక్కడ కూర్చున్న ఆడవాళ్ళలో ఒకామెకు పాతికేళ్ళుంటాయి.

చందనం బొమ్మలా చక్కగావుంది.

చారెడుకళ్ళు. చెంపలమీద జుత్తువున్న చంద్రబింబంలా వుంది.

జానకి ఆవిడ్ని పొద్దుటినుంచి కనిపెడుతూనే వుంది.

ఆమె మాటల్లో ఒక్కపొల్లులేదు.

చేతలో క్షణం వేస్టులేదు.

ఆవిడనెవరూ పలకరించలేదు.

ఆవిడ మాత్రం అప్పుడప్పుడు ఒక ముప్పైఏళ్ళ మరో ఆడకూలీతో మాత్రం మాట్లాడుకోంది.

మనిషి ఆరోగ్యంగానే ఉన్నా, కళ్ళలో నీరసం ఉంది.

ఆవిడ పెదవిమీది చిరునవ్వు కడుపు కన్నీళ్ళనుంచి తేలి మీదికి వచ్చినట్టు బరువుగా జాలిగా ఉంది.

ఆవిడ మిగతా ఆడ, మొగ అందరు కూలీలకు కొంచెం దూరంగా తన అల్యూమినియం గిన్నె ముందు పెట్టుకొని కూర్చుంది. గిన్నె మూతమీద ఉల్లిపాయే కాకుండా మిరపకాయలు కూడా ఉన్నాయి.

గిన్నె మూత తాపీగానే తీసింది. కాని తియ్యగానే దెయ్యాన్ని చూసిన దానిలా అరిచిలేచి నిల్చుంది.

ఏమైంది?" అని ఎవరూ అడగలేదు కొంతసేపు.

ఏమైంది?" కళ్ళతోనే అడిగింది ముప్పై ఏళ్ళది.

గెంజిలో బల్లి పడినాది" అంటూ ఆ మనిషి లేచివెళ్ళి గిన్నెలో గంజి అన్నం కాలవలో పారబోసి, గిన్నె కడుక్కొనివచ్చి గోడకి చేరబడి కూర్చుంది.

ఈలోగా అంతా అన్నం తింటున్నారు ముప్పైఏళ్ళది తప్ప.

'రాయే. నాది సగం ఏస్తాను" అంది.

'ఏస్తావ్! ఏస్తావ్!! ఎయ్యి. నువ్వు నచ్చిన్నాడు నీకెవరు ఏస్తారో చూస్తాను" ఉరిమింది ఒక ముసిల్ది.

పాతికేళ్ళదీ, ముప్పైఏళ్ళదీ ఎక్కడ ఉన్నవాళ్ళు అక్కడే విగ్రహాల్లా ఉండి పోయేరు ఆ తరవాత ముప్పైఏళ్ళది గోడవేపు తిరిగి అన్నం తినడం ప్రారంభించింది ఆవిడ గిన్నెలో గంజితోపాటు, కారిన కన్నీటిని కూడా తాగిందన్న సంగతి ఎవరూ చూడలేదు.

జానక్కి ఏఁవీఁ అర్థం కాలేదు. అంత కలిసి మెలిసి ఉ తున్నవాళ్ళలో. ఒక్కరూ ఆమెకు గుక్కెడు గంజి పొయ్యలేదు. ఎంచేత?

ఏఁవిఁటా రహస్యం?

(సశేషం)

చీకటి కిరణాలు

కథలు చదవటం, పెథిడిన్ ఇంజక్షన్లు తీసుకోవటం ఒకే బాపతుకు చెందిన వేసని వెంకటరత్నం మాస్టారి నిశ్చితాభి ప్రాయం.

పెథిడిన్ ఇంజక్షను మనిషి చేయిపట్టు కొని లాలిస్తూ తీయని ఊహాలోకంలోకి లాక్కుపోతుంది. ఆ పట్టుసడలి 'రప్' మని నిజజీవితంలో పడ్డమనిషి చుట్టూ ఆ పులుముకున్న చేదును భరింపలేక తీయని ఊహాలోకంలోకి మళ్ళీ చేరాలను కుంటాడు. అందుకే మళ్ళీ మళ్ళీ పెథిడిన్ ఇంజక్షన్లు పుచ్చుకోవటం. కథలు కూడా పాఠకుల్ని మధురభావాల్లో ముంచు తుంటాయి. తమ బ్రతుకుల్లోలేని ఆ మాధుర్యాన్ని జుర్రుకుంటూ ఆ తన్మయత్వంనుండి బయటపడాలని లేక, పడలేక అదేపనిగా కథలు చదువుతుంటారు పాఠకులు-ఇదీ వెంకటరత్నం మాస్టారు తన అభిప్రాయానికిచ్చే వివరణ. ఎన్ని వందల కథలో చదివి, అవి నిస్సారమైనవని తెలుసుకున్న అనంతరం ఈ అభిప్రాయానికి రాలేదు మాస్టారు. ఆయన కలా అనిపిస్తుంది. అంతే. అలా అని పించటానికి కారణమేమిలేదు.


అంతేసి ఖరీదుపెట్టి వారపత్రికలు కొనేవారిని చూసి వెంకటరత్నం మాస్టారు మహాబాధగా జాలిపడిపోతారు. వారపత్రికల వెల మరీ పెరిగిపోయాక ఆయన జాలిపడటం మొదలెట్టలేదు. వారపత్రికల ధర పావలా వున్నపుడూ ఆయన అలానే జాలిపడేవారు. వెంకటరత్నం మాస్టారుకు కథలు చదివే అలవాటులేదు. కొనే అలవాటు అసలేలేదు. అయితే ఆయనకో తమాషా అయిన అలవాటుంది. తెలిసినవారి చేతిలో వారపత్రిక కనుపిస్తే అడక్కుండానే దాన్ని అందుకుంటారు. అందులోని వారఫలాల పేజీ తిప్పి 'తుల' చదువుతారు. చదివి 'ప్చ్' అని తేలిగ్గా తేల్చిపడేసి పత్రికను గొట్టంలా గుండ్రంగా చుట్టి తిరిగిస్తూ "ఏడ్చారు వెధవలు. లక్షలాది మనుషుల జీవిత గమనాన్ని నాలుగుమాటల్లో చెప్పటమంటే మాటలటోయ్" అని అంటారు. శ్రోత సమాధానాన్ని ఆయన పట్టించుకోరు. అలాగని మాస్టారుకు గ్రహబలాలమీద, వారఫలాలమీద నమ్మకంలేదనుకోవటం పొరపాటు. ప్రతివారం తన రాశిలో ఏం వ్రాశారో చూసుకోవాలన్న కుతూహలం వుంది ఆయనకు. శుభప్రదమని వ్రాసినపుడు అలా జరిగితే బావుండన్న ఆశా వుంది. అశుభం పలికితే అలానే జరుగుతుందేమో నన్న భయమూవుంది.

వెంకటరత్నం మాస్టారు ఇరవై వూళ్ళకు బదిలీఅయి, ముప్పయి సంవత్సరాలు పాఠాలుచెప్పి ఈమధ్యనే 'రిటైర్' అయారు. ఆయన తండ్రి మాస్టారుకు ఒక్క పెంకుటిల్లు మాత్రం అప్పగించాడు. ఆయన హయాంలోనూ వెంకటరత్నం మాస్టారు ఏమీ వెనకేయలేక

నాగభైరవ ఆంజనేయులు

పోయారు. రిటైర్ అయేనాటికి మాస్టారుకు పోస్టాఫీసు సేవింగ్సు బాంక్‌లో ఆరువందల నలభై రెండు రూపాయల బాలన్సుంది. రక్తపోటుతో కాలం వెళ్ళబుచ్చుతున్న అర్ధాంగివుంది. అంతే గాకుండా నాలుగేళ్ళక్రితం బి.ఏ అనిపించుకొని పనేమీ దొరక్క దొరికిన స్నేహితులతో జులాయిగా తిరిగే పుత్రరత్నమున్నాడు.

ఇల్లు అంతపెద్దది కాకపోయినా, మధ్యలో మేదర తడిక అడ్డంకట్టించి ఒక భాగం ఆ వూరి హైస్కూల్లోని



సైన్సు మాస్టారుకు అద్దెకిచ్చాడు. రిటైరయ్యాక వెంకటరత్నం మాస్టారు వీలయినంతమంది పిల్లలను ప్రైవేటుకు రాబట్టుకొని, ఆ రాబడితోనూ, అద్దెతోనూ బ్రతుకు బండిని లాగుతున్నాడు.

సైన్సు మాస్టారుకు ప్రతివారం పత్రికలు కొనే అలవాటుంది. వెంకటరత్నం మాస్టారు ఆ పత్రికల్లోనే వారఫలాలు చదువుకుంటుంటాడు ఈ మధ్య.

వరండాలో వేసున్న నులకమంచం మీద వెల్లికలా పడుకొని ఆ వారపు పత్రికలో 'ఫల' చూస్తున్న వెంకటరత్నం మాస్టారి చూపును ప్రక్కపేజీ ఆకర్షించింది. ఆర్టిస్టు 'బండిపంతులు' అన్న అక్షరాలను అతి రమణీయంగా తీర్చాడు. బడిపంతుళ్లు ఎంత దరిద్రంగా వుంటారో, వారి బ్రతుకు లెంత భయంకరంగా వుంటాయో తెలియకపోవటం వల్లనే ఆర్టిస్టు ఆ అక్షరాలను అంత అందంగా వ్రాశాడనిపించింది వెంకటరత్నం మాస్టారుకు.

చాక్‌లెట్ చూపిన చిన్నపిల్లాడిలా అయిపోయారు మాస్టారు. బడిపంతులు గురించి ఏం వ్రాశారో చదవాలన్న కుతూహలం మొదలయింది. తానూ బడిపంతులాయె మరి! చక చకా కథ చదవసాగాడు మాస్టారు. రచయిత తన నైపుణ్యంతో బడిపంతులు జీవితాన్ని అతి విషాదంగా తీర్చిదిద్ది పాఠకుల కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగేలా చేశాడు.

సాంతం కథ చదివి "ఫర్లేదు. కథలు ఆకాశంలో విహరించటంలేదు. నేలమీద

నడుస్తున్నాయి. కథలూ జీవితాలే. ఎంత సహజంగావుందీ కథ" అని అనుకున్నారు పొడి పొడిగా తడికళ్ళను మునివేళ్ళతో అద్దుకుంటూ. అద్దుకొని ఎవరో చెయ్యి పట్టి లాగినట్లు రక్కునలేచి కూర్చొని, కూర్చునే కుదురులేనట్టుగా తిరిగి మంచం మీదికి ఒరిగి "ఏమేవ్? ఇలా తగలడు" అని గట్టిగా కేకేశాడు. వెంకాయమ్మ "ఏవిటా గావుకేకలు" అంటూ వరం డాలోకొచ్చింది.

"కథ లెలా వుంటాయో తెలుసా?" తెలుగులోనే ప్రశ్నించారు వెంకటరత్నం మాస్టారు. వెంకాయమ్మకు ప్రశ్న అర్థం కాలేదు. జవాబు ఏం చెప్పాలో తెలియ లేదు. విచిత్రంగా తనవైపు చూస్తూ నిల బడిన అర్థాంగిని చూసేటప్పటికి వెంకట రత్నం మాస్టారుకు తానుచేసిన పొరపాటు తెలిసొచ్చింది. వంకాయ కూర ఎలా వండాలో, ఆవకాయలో నూనె ఎంత పోయాలో అడిగితే తడుముకోకుండా చెప్పగలదేగాని కథలగురించి ఆమేం చెబుతుంది-అ ఆలు ఎలా వుంటాయో కూడా తెలియని అమాయకురాలు.

"నా ముఖం .. కథలుగురించి నిన్న డగట మేమిటి?" అన్నారు మాస్టారు లేచి కూర్చుంటూ.

"బాగానేవుంది సంబడం" అంటూ లోనికిపోయింది వెంకాయమ్మ.

సరిగ్గా అదేసమయంలో వెంకట రత్నం మాస్టారుకు కథలమీదున్న దురభి ప్రాయం తొలిగిపోయింది.

* * *


బడిపంతులు కథ వెంకటరత్నం మాస్టారులో వూహించని మార్పు తెచ్చింది. కథలంటే మాస్టారుకు ఆసక్తి మొదలయింది. ఆయన మనసులో తెలుగు కథలన్నా, అవి వ్రాసే కథకు లన్నా, వాటినివేసే పత్రికలన్నా గౌరవం పెరిగిపోయింది. అప్పట్నించి వారం వారం సైన్సు మాస్టారి వారపత్రికల్లో 'తుల'తో బాటు కథలూ చదవసాగారు వెంకటరత్నం మాస్టారు. వారానికి ఒక కథయినా బడిపంతులు జీవితం చుట్టూ పరిభ్రమిస్తూ వుండటంతో-వెంకటరత్నం మాస్టారు పెరుగులోవేసిన వేడిగారెలా ఉబ్బిపోసాగారు.

వెంకటరత్నం మాస్టారు చాలా కథలు చదివారు కథల్లోని మాస్టారుల్లా గర్వ పడేవారు. తృప్తిగా నిట్టూర్పు లొదిలే వారు. వారికన్నీటిని పంచుకునేవారు.

అమెరికానుండి తిరిగొచ్చి కావాలని కానీకట్నం లేకుండా, తనను అక్షరా భ్యాసం చేసిన అధ్యాపకుడి మూడో కూతుర్ని తన అర్థాంగిగా చేసుకున్న అప్పారావు కథను ఉత్సాహంగా చదివారు వెంకటరత్నం మాస్టారు.

వీధి బడిలో తనచేత గుంజిళ్ళు తీయించిన గుర్నాధం టీచర్ భార్య పక్ష వాతంతో మంచాన పడిందని తెలిసి, కల వర పడిపోయి, స్వయంగా కారులో వచ్చి తన నర్సింగ్‌హోంకు తీసుకెళ్ళి పైసా తీసుకోకుండా గురుపత్నికి వైద్యంచేసిన డాక్టరు భుజంగరావు కథను ఒకటికి రెండుసార్లు చదివాడు వెంకట రత్నం మాస్టారు.

మిట్ట మధ్యాహ్నం చెప్పల్లేకుండా తార్రోడ్డుమీద నడచిపోతున్న రంగనాధం మాస్టారును హడలగొడుతూ ప్లీమత్



కారును ప్రక్కనే ఆపేసి, ఆనను తాను పరిచయం చేసుకొని ఆయన్ని ఆ కారులోనే తనింటికి తీసుకెళ్ళి ఘనంగా ఆతిధ్యమిచ్చి వారం తిరక్కుండానే, అడక్కుండానే మాష్టారి రెండో కొడుక్కి తన ఆఫీసులోనే వుద్యోగ మిచ్చిన శేఖర్‌బాబు కధను మళ్ళీమళ్ళీ చదివారు వెంకటరత్నం మాష్టారు. తాను చదవటమే కాకుండా మహదానందంతో తన భార్యకూ చదివి వినిపించాడు.

అవుట్‌డోర్ షూటింగుకు వచ్చి, ప్రొడ్యూసర్ కారులో తనచేత 'అఆలు' దిద్దించిన పంతులుగారింటికెళ్ళి ఆయన పడుతున్న అవస్థలను కళ్ళారాచూసి కరిగిపోయి పంతులుగారి ఇద్దరమ్మాలకు మంచి సంబంధాలు చూసి తనే కట్నాలిచ్చి పెళ్ళి జరిపించిన హీరో గిరిబాబు కధను ఆనంద బాష్పాలతో తడిపేశారు వెంకటరత్నం మాష్టారు.

తను చదివిన కధలను సమయం దొరికినపుడు గుర్తుకు తెచ్చుకోవటం అలవాటయి పోయింది వెంకటరత్నం మాష్టారుకు. తన శిష్యులు ఎందరో డాక్టర్లు, కలెక్టర్లు, లాయర్లు, ఆఫీసర్లు .ఓహ్! . వారంతా తన శిష్యులు. జీవితంలో వారు ఎక్కి కూర్చున్న అంతస్థుకు పునాదులు వేసింది తాను. అలా అనిపించటంతో మాష్టారుకు సగం ఆకలి తీరినట్లనిపించింది చంద్రమండలం చేరినట్లనిపించింది. తన నరాల్లో అమృతం పారినట్లనిపించింది. ఆ పూట భోజనం చేయకుండానే ఆరుబయట నులక మంచంమీద పడుకొని మబ్బుల్లో తేలుతున్న జాబిల్లిని చూస్తూ వూహల్లో తేలిపోయారు. ఆ వూహలలో సోలిపోతూ

నెమ్మదిగా నిద్రలోకి వాలిపోయారు.

* * *

నారాయణ వచ్చాడు వెంకటరత్నం మాష్టారిని చూట్టానికి. తెల్లపాడులో పని చేసేటప్పుడు మాష్టారు నారాయణకు అక్షరాలు నేర్పారు. నారాయణ ప్రస్తుతం బ్యాంక్‌లో కాషియర్. వెంకటరత్నం మాష్టారి స్వగ్రామం నారాయణ అత్తగారి వూరు కావటంతో - సెలవులకు అత్తగారింటికి వచ్చినపుడు మాష్టారిని పలకరించి పోతూంటాడు నారాయణ.

మాటల మధ్యలో నారాయణ మాష్టారితో అన్నాడు—

"అబ్బాయి బి. ఏ. కాకుండా బి. కాం. అయివున్నట్టయితే బాంక్‌లో ఏదో వుద్యోగంలో ఇరికించేవాడిని" అని.

ఆ మాటకు వెంకటరత్నం మాష్టారు పొంగిపోయారు. నిజంగా తన కొడుక్కి- ఉద్యోగం వచ్చినట్లే సంబరపడిపోయారు. నారాయణకు తనమీదున్న అభిమానానికి, అతడు కనపరుస్తున్న ఆప్యాయతకు మాష్టారి మనసు సరిగమలు పలికింది.

నారాయణ శలవు తీసుకొని వెళ్లాడు - మాష్టారిని ఏకాంతంలో వుంచే కాదు.... ఆశలోనూ ఆలోచనల్లోనూ ముంచి.

* * *

ఆనాటి స్థానిక వార్తాపత్రిక చూస్తున్న వెంకటరత్నం మాష్టారి చూపు మొదట పేజీలోని మూడో కాలంలో ఆగిపోయింది! క్రొత్తగా వచ్చిన జిల్లాకలెక్టరు ఫొటో వివరాలతోబాటు ప్రచురించారు.

"పాకాలలో పుట్టి ఆ వూరి వీధిబడిలో చదువుకున్న ప్రభాకరం...." పరిచయ వాక్యాలను మధ్యలోనే ఆపి ఫొటోవంక

తదేకంగా చూశారు మాష్టారు. ఆ ఫొటోలో చిన్ననాటి ఆనవాలు ఏమీ లేకపోయినా వెంకటరత్నం మాష్టారుకు అనిపించింది-ఆ ఫొటోలో వుంది తన శిష్యుడు ప్రభాకరమేనని. పాకాల .. మెల్లిగా గొణుక్కున్నాడు. అవును ...సందేహం లేదు . .ప్రభాకరం తన శిష్యుడు. కలెక్టరు ప్రభాకరానికి 'కా' గుణితం నేర్పింది తనే. ఎక్కాలు చెప్పిందీ తనే. వెధవ ... అప్పుడు...చిన్నప్పుడు చదువుమీద ధ్యాస లేకుండా జులాయిగా తిరిగేవాడు. రోజూ గోడకుర్చీ వేయించి, చెవులు మెలేస్తూ మరీ దగ్గరుండి ప్రత్యేక శ్రద్ధతో చదివించి చదువుమీద శ్రద్ధ ఏర్పరిచిందీ తనే.

'జిల్లాకలెక్టరు తన శిష్యుడు' అనుకోవటంతో రాకెట్ ఎక్కినట్లనిపించింది వెంకటరత్నం మాస్టారుకు. పెరిగిన గడ్డాన్ని, గుబురు మీసాలను కుడిచేత్తో తడుముకున్నారు హుందాగా. ఏదో తెలియని తృప్తి మాస్టారిలో సరికొత్త ఓపికను తెచ్చిపెట్టింది.

వెంకటరత్నం మాస్టారు చదివిన 'బడిపంతుళ్ళు' కథలు ఆయన మనసులో నాట్యం చేశాయి. 'వుసి'గొల్పాయి. 'ఆశ'ను తట్టిలేపాయి. ముందుకి తరిమాయి. మాస్టారుకి ధైర్యం చెప్పాయి. 'అవును. అలా చేస్తే ' మనసులోనే అనుకున్నారు మాస్టారు. నారాయణ చెప్పిన మాట చెవుల్లో మారుమ్రోగింది. తర్కించుకున్నాడు. మంచీ చెడులను బేరీజు వేసుకున్నాడు. అటువైపు మొగ్గు చూపింది మనసు. అదీ యిదీ కాదు.... జిల్లాకలెక్టరు. కలెక్టరు తలచుకుంటే కానిదేముంది. ప్రభాకరం చేతిలో పని. నిముషాల్లో జరుగుతుంది. తన కొడుకు ఏదో ఒక ఉద్యోగంలో చేరితే తన కష్టాలు తీరిపోతాయి. ఖర్చుపెట్టే ప్రతి పైసాను పదిసార్లు బేరీజు వేసుకోవాల్సిన పనుండదు. కాస్త విశ్రాంతి తీసుకోవచ్చు.

పోస్టాఫీసుకి చేరాడు మాస్టారు ఆలోచనలను పేనుకుంటూ, చిక్కు విడదీసుకుంటూ. ఉన్న కొద్దిలో పాతిక రూపాయలు తీసుకున్నాడు.

* * *

బస్సు దిగి వెంకటరత్నం మాస్టారు కాలినడకనే కలెక్టరు బంగళాకు బయలుదేరాడు. నడిచి వెడుతున్న మాస్టారి చూపు రోడ్డు ప్రక్కనున్న పళ్ళదుకాణాల మీద తారట్లాడింది. అందమైన ఆపిల్ పళ్ళను జాజిచెక్క పెట్టెలమీద అందంగా అమర్చారు. అటూ యిటూ అరటిగెలను వేలాడదీశారు.

పళ్ళదుకాణం దగ్గరకు చేరాయి మాస్టారి కాళ్ళు. పళ్ళమీద నిలిచాయి హారి కళ్ళు.

పసిపిల్లల దగ్గరకు, పెద్ద పొజిషన్‌లో వున్న వారిదగ్గరకు ఒట్టి చేతులతో పోగూడదు. ఇచ్చేవాడికి తలకుమించే పనయినా పుచ్చుకునేవాడి తాహతుకు తగ్గవే యివ్వాలి-ఏవో కథల్లోని మాటలు మాస్టారికి గుర్తొచ్చాయి.

ఎప్పుడో చిన్నప్పుడు తన శిష్యుడు గాని ఇప్పుడు కలెక్టరు.

బిల్లు కలెక్టరు కాదు-జిల్లా కలెక్టరు.

కలెక్టరుకు అరటిపళ్ళు....ఛా ఛా.

కుచేలుడు శ్రీకృష్ణుడికి అటుకులు తీసుకెళ్ళలేదూ!

'వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులు. అదీ గాక అది కలికాలం కాదు.

పదినిముషాలు బేరమాడి ఐదు రూపాయలకు అరడజను ఆపిల్ పళ్ళు తీసుకున్నారు వెంకటరత్నం మాస్టారు.

ఆపిల్ పళ్ళు వున్న చేతిసంచిని అమృతభాండంలా అతిజాగ్రత్తగా పట్టుకొని ముందుకు నడిచారు.

* * *

గేటులో గూర్ఖాలేకపోవటంతో నేరుగా హాల్లోకి వెళ్ళారు వెంకటరత్నంమాస్టారు. గోడలకు తగిలించిన ఫోటోలు మాస్టారిని ఆకర్షించాయి. వాటిని చూడాలన్న కుతూహలంతో గోడదగ్గరకి చేరారు.

కలెక్టరు ప్రభాకరం ఐ. ఏ. ఎస్. కి సెలక్టయిన ఫోటో.

ఎన్. సి. సి. డ్రెస్‌లో కాలేజీలో చదివేటప్పటి ఫోటో.

హైస్కూలులో చదివేనాటి ఫోటో.

వీధి బడిలో చదువుకునే వయసు తన తలిదండ్రులతో ...ఇంకా....ఇంకా చాలా ఫొటోలున్నాయిగాని, వాటిని మాస్టారు చూడలేదు.

"హారి! వీడు ప్రభాకరమే" అని తనలో అనుకోలేదు మాస్టారు. పెద్దగా పైకే అనేశారు. అని చుట్టూచూశారు ఎవరయినా విన్నారేమోనని, ఆ హాల్లో మాస్టారు తప్ప మరెవరూలేరు.

మాస్టారి అరుపువిని లోనినుండి పనికుర్రాడువచ్చి ఏం కావాలి అని అడిగాడు. మాస్టారు చెప్పిందివిని ఎగాదిగా చూసి 'అలాకూర్చోండి' అనిచెప్పి మళ్లా లోనికి వెళ్ళాడు.

ఖరీదయిన సోఫాలు, ఫ్రేం కుర్చీలు, గాడ్రెజ్ ఛెయిర్స్, అంతేగాకుండాకొయ్యకుర్చీలు కొన్ని.


మాస్టారు సోఫాలో కూర్చోలేదు. ఫ్రేం కుర్చీల జోలికిపోలేదు. గాడ్రెజ్ కుర్చీలో కూర్చొని ఏమనుకున్నారో ఏమో మరుక్షణమే లేచివెళ్ళి కొయ్యకుర్చీఅంచున కూర్చున్నారు.

మాస్టారునుచూసి ఉప్పొంగి పొర్లుతున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ పరుగుపరుగునావచ్చి, ఆయన్ని కావిలించుకున్నంత పనిచేసి—

"ఎవరో పరాయివాడిలా హాల్లో పడిగాపులు కాయటమేమిటండీ మాస్టారూ! నేను పరాయివాడినా. రండి లోనికిపోదాం" అంటూ మాస్టారును లోనికి తీసుకవెళ్లాడు ప్రభాకరం. ఆరోజు శెలవుపెట్టి మాస్టారుకు ఘనమైన ఆతిథ్యమిచ్చాడు. అడిగి తెలుసుకొని మాస్టారు కొడుక్కి అక్కడికక్కడే వుద్యోగం యిచ్చేశాడు.

మెట్లమీద చప్పుడవటంతో ఊహల్లో నుండి బయట పడ్డారు మాస్టారు. వెంకటరత్నం మాస్టారు కుర్చీలోంచిలేస్తూ తలెత్తి చూశారు. ఫుల్‌సూట్‌లో దొరబాబులా దర్జాగా మెట్లుదిగుతున్నాడు కలెక్టర్ ప్రభాకరం కలెక్టరు చివరిమెట్టుమీదికి రావటంతో 'నమస్కారం'అంటూ రెండుచేతులూ జోడించారు మాస్టారు. ఆ క్షణంలో కలెక్టరు తన శిష్యుడనిగాని, తనకంటె వయసులో చిన్నవాడనిగాని మాస్టారుకి గుర్తుకురాలేదు.

కలెక్టరు ప్రభాకరానికి మాస్టారిమాట వినపడేవుంటుంది. కలెక్టర్ ప్రభాకరంకు మాస్టారు కనబడేవుంటారు. వినబడకుండా వుండటానికి ప్రభాకరానికి చెవుడు కన



బడకుండా వుండటానికి ఆయనకి చూపు మందగించలేదే। హోదాకు తగ్గట్టు ప్రవర్తించాలి. అందుకే చూడనట్టు అసలు ఆ హాల్లో తానుతప్ప మరోజీవి లేనట్లు నడిచి వెడుతున్నాడు కలెక్టరు ప్రభాకరం.

కలెక్టరుగారు తనని గుర్తుపట్టలేదని గ్రహించారు మాస్టారు. ఎప్పుడో ఇరవై ఏళ్ళక్రితం చూశాడు. ఏటేటా తన రూపంలోఎన్నోమార్పులు. ఎలాగుర్తు పట్టగలడు. ఆమాటకొస్తే తను మాత్రం. పరిచయ వాక్యాలు లేకుండా ఫోటోవేస్తే గుర్తు పట్టగలిగేవాడా?

తనని గుర్తుపట్టక పోవటంలో ప్రభాకరం తప్పేమీ లేదనుకున్నారు వెంకటరత్నంమాస్టారు.

చల్లకొచ్చి ముంతదాచడం అవివేకమే అవుతుంది. పనిమీదవచ్చి పట్టుదలకు పోవటం పిచ్చితనమే అవుతుంది.

తనని తాను పరిచయం చేసుకోటంలో తప్పేముంది.

గొంతు పెగల్చుకొని "నేను వెంకటరత్నం మాస్టారును, పాకాల వీధిబడిలో" మాస్టారు వాక్యాన్ని పూర్తిచేయలేదు. కలెక్టరు ప్రభాకరం ఒక్కక్షణం కనురెప్పలెత్తి మాస్టారి ముఖంలోకి సూటిగా చూశాడు. గురువును గుర్తుపట్టటానికి శిష్యుడుకి విన్న ఆ ఒక్కమాట చాలు. చూచిన ఆచూపుచాలు. ఆ ఒక్కక్షణం సరిపోతుంది ఎన్నేళ్ళ గతాన్నయినా గుర్తు తెచ్చేందుకు.

కలెక్టరు ప్రభాకరం ముఖంలో యే మార్పులేదు. మరుక్షణంలో కనురెప్పల్ని దించుకొని 'ఫైల్'పిన్నులు సవరించుకుంటూ

"వెంకటరత్నంగానీ, కోటిరత్నంగాని... మీతో మాట్లాడే అవసరంగాని తీరికగాని నాకులేదు. మినిష్టరు వస్తున్నాడు ఐనా ఆఫీసుపనులు ఆఫీసులోనే ఆ గూర్ఖా. ఎక్కడ చచ్చార్రా" మాస్టారుతో చెప్పి పని కుర్రాడిని కోపంగా కేకేశారు.

మాస్టారిమనసు చివుక్కుమంది. ఒక్కక్షణం తెల్లబోయి అదే క్షణంలో తేరుకున్నారు.

"తానుమాత్రం స్కూలుకు ఇన్స్పెక్టర్ వస్తూంటే ఎంత హడావిడి చేసేవాడు. ఎంత కలెక్టరయినా మినిష్టరంటే హడావిడికదూ" అని అనుకొని సమాధాన పడలేకపోయారు మాస్టారు.

తనగురించి చెప్పినా ప్రభాకరంగుర్తు పట్టలేదు.

"నేను మీ గురువుని. అక్షరాలు దిద్దించాను. జులాయిగా తిరిగే మీకు చదువు మీద శ్రద్ధ ఏర్పడేలా చేసింది నేను" అంటూ తనను తాను పరిచయం చేసుకోలేదు

"మా వాడికి ఉద్యోగం యిప్పించండి" అనివేడుకోలేదు.

"ప్రేమగా తెచ్చాను. తీసుకోండి." అని ఆపిల్స్ అందించలేదు

కలెక్టరు ప్రభాకరం వడివడిగాపోర్టికోలోకి వెళ్ళటం కారు బయలుదేరటం ఒకే నిముషంలో జరిగాయి.

వెంకటరత్నం మాస్టారు చేతిసంచిని తీసుకుని బంగళానుండి రోడ్డుమీదకి చేరాడు.

నడుస్తూగర్వంగా తృప్తిగా హుందాగా నవ్వుకున్నారు మాస్టారు. తాను వెలిగించిన చిరుదీపం .... ఇంతై ఇంతింతై ఎంతో పెరిగి పెరిగి ఈనాటికి ఇంత పెద్దదయింది. ఇప్పుడు ఆ దీపాన్ని తాను తాకలేడు. ఆ దీపకాంతిని తాను చూడలేడు.

పాపం ...మాస్టారుకు తాను వెలిగించిన దీపాలు వెలుగుకిరణాలునే ఇస్తాయని తెలుసుగాని...దీపాలనుండి చీకటికిరణాలు వస్తాయని తెలియదు. ఆ చీకటికిరణాలను గురించి ఆలోచించే శక్తి, ఆలోచించి తట్టుకునే మనోనిబ్బరం మాస్టారుకులేదు.

* * *

పొరుగూరు వెళ్ళేప్పుడు వెంకటరత్నం మాస్టారు భుజంమీద కండువా. చేతిలో సంచీ తప్పనిసరిగా వుంటాయి. కండువావల్ల వుపయోగం వుంటుందిగాని, సంచివల్ల ప్రయోజనమేమీ వుండదు. సామాన్యంగా తీసుకువెళ్ళిన సంచిని తీసుకవెళ్ళినట్టే తిరిగి తెచ్చేవారు. ఏతావాతా ఏడాదికోమారు ఆ సంచిలో ఏదైనా తెస్తే అది చింతపండో కందిపప్పో అయి వుంటుంది. ఇంటికి పళ్ళు తెచ్చే అలవాటు మాస్టారుకు లేదు. అని ఆరోపించేకంటే ఆ అలవాటు చేసుకునేందుకు వారి ఆర్థిక స్తోమత ఆయనకు సహకరించలేదంటే సముచితంగా వుంటుంది. ఏ రోజయినా ఓ అరడజను పళ్ళు కొందామనిపించినా ఆ పావలా వుంటే పోపు గింజలకొస్తుంది అనిపించేది. పావలా ఖర్చుపెట్టే ముందు మాస్టారు పదిసార్లు

జెబుతోషా యీ తడుముకుంటారు అది స్వతహాగా ఆయనకు అబ్బింది కాదు. పరిస్థితులు బలవంతంగా ఆయన తలమీద రుద్దిన అలవాటే.

వెంకటరత్నం మాస్టారు అందించిన సంచి అందుకొంది వెంకాయమ్మ. బరువుగా వుంది సంచి. తెరిచి చూసింది. నవనవలాడుతున్నాయి ఆపిల్స్. కళ్ళు మరీ పెద్దవి చేసుకుని వాటికేసి చూస్తుండి పోయింది.

ఐదు రూపాయలతో వెంకటరత్నం మాస్టారు కొన్న పళ్ళవి. ఆ నిజం చెప్పటానికి ధైర్యం చాల్లేదు మాస్టారుకు. అంతేగాకుండా జరిగింది జరిగినట్లు వివరించటానికి మనస్కరించలేదు.

"ఐదు రూపాయలు పెట్టి ఆపిల్ పళ్ళు తెచ్చాను" అని మాస్టారంటే "ఐదు రూపాయలా! అంత తెలివి తక్కువపని ఎందుకు చేశారు. మీరు ఏదిచేసినా ఇంతే" అని ఠక్కున అంటుంది వెంకాయమ్మ. ఆవిడముందు తెలివితక్కువ వాడిగా నిలబడటం. ఆమాట అనిపించుకోవడం మాస్టారుకు సుతరామూ ఇష్టంలేదు.

"అలా వెర్రిమొహం పెసుకొని చూస్తావేమే జెర్రిమొహమా! అవి ఆపిల్ పళ్ళు. అంటే మనలాంటివారు తినేవికాదు. ఆఫీసర్లు తినేవి. చాలా ఖరీదు. అలాంటిది ఒకటీ అరా కాకుండా అరడజను ఎలా తెచ్చాననీ చూస్తున్నావ్ కదూ? అవి నేను కొన్నవి కాదు విడ్డూరంగా చెప్పారు మాస్టారు.

"ప్రభాకరమని...వెధవ...చిన్నప్పుడు రోజూ గోడకుర్చీ వేయించి చదివించే వాడిని. వాడిప్పుడు జిల్లా కలెక్టరు. నేను రోడ్డుమీద నడిచిపోతుంటే కారాపి కాదంటున్నా బంగళాకి తీసుకెళ్ళాడు. బలవంతం చేసి భోజనానికి అట్టేపెట్టాడు. పిండి వంటలు, కూరలు.... పేర్లూ తెలియవు. ఎన్నని. రెండు రోజులుండమని బలవంతంచేసి కన్నీరెట్టుకున్నాడని....నీవు గాభరా పడతావని తిరిగొచ్చా. వస్తుంటే ఇవిచ్చారు." లేని ఆనందాన్ని-రాని ఉత్సాహాన్ని బలవంతంగా ముఖంమీద అద్దుకుంటూ, గొంతులో రుద్దుకుంటూ నమ్మేట్టు చెప్పారు వెంకటరత్నం మాస్టారు.

"బడిపంతులంటే ఏమోననుకున్నా" విస్తుబోయింది వెంకాయమ్మ.

వెంకటరత్నం మాస్టారు బడిపంతుళ్ళ విలువను, సమాజంలో వారికున్న గౌరవాన్ని, శిష్యుల అభిమానాన్ని పదింతలు చేసి దాన్ని ఇరవై చేత గుణించి చెప్పారు.

అప్పైన వెంకటరత్నం మాస్టారు తేలిగ్గా గాలి పీల్చుకున్నారు-తన కొడుకు వుద్యోగ విషయం మాట్లాడేందుకు బస్తీకి పోతున్నట్లు ముందుగా ఎవరితోనూ చెప్పనందుకూ, తన భార్య కొడుకు వుద్యోగం గురించి కలెక్టరుతో

చెప్పమని అననందుకూ.

"చూడు.. ఈ పూట నాకు అన్నం వండకు. భుక్తాయాసంగా వుంది. ఏమీ తినాలనిపించటంలేదు" త్రేన్చుతూ అన్నాడు....లోన ప్రేగులు కర కరలాడు తున్నా. నిజంగానే ఆ పూట మాస్టారుకు ఏదీ తినాలనిలేదు. వెంకాయమ్మ మాస్టారి మాటల్ని పూర్తిగా నమ్మింది. ఆయన ముఖంలోని బడలిక. కళ్ళలోని నీరసం ఆమె చూపుకు అనలేదు.

* * *

ఆరుబయట వేసుకున్న మంచంలో ఒకపక్కకు వత్తిగిలి ముడుచుకొని పడు కొని వున్నారు వెంకటరత్నం మాస్టారు. చల్లనిగాలి సుతారంగా వీస్తుంది. మెత్తని వెన్నెల విలాసంగా జారుతుంది.

వెంకటరత్నం మాస్టారు ప్రభాకరం ప్రవర్తనను సమర్థించటానికి. సమాధాన పడటానికి ప్రయత్నించి విఫలుడవు తున్నాడు.

పిల్లలకు చదువు చెప్పటం పంతులుగా తన ధర్మం. తన దగ్గర చదువు కున్న వాళ్ళందరూ తనకు కృతజ్ఞత చూపాలని. ఏదో సహాయం చేయాలని ఆశించటం అత్యాశే అవుతుంది. అవి వేకం కూడా.

"మావాడికి ఉద్యోగమివ్వ"మని దేబిరించటం ...ఛా....ఛా.

ప్రభాకరాన్ని ... చి అడగక పోవటమే మంచి...

మాస్టారు సమాధాన పడలేకపోతు న్నారు. ఆయన మనసులోని ఒక భాగం మెడతెగిన కోడిలా గిల గిల లాడిపో తుందని ఆయనకు తెలియదు.

"కథలు వ్రాసే రచయితలనందరినీ నడిబజార్లో వరుసగా నిలబెట్టి పారకుండా అందుకోలేని ఆశల్ని రేపటందేనికీ" అని గట్టిగా అడిగేయాలనుకుంటుంది ఆ భాగం అనికూడా మాస్టారికి తెలియదు.

మాస్టారు వెన్నెల్లో తడిసిపోతు న్నారు ఆయన మనసు బాధతో తడిసి పోతుంది. తడిచి ముద్దయి పొడయి పోతుంది.


మాస్టారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

ఆయన ఆలోచిస్తుందీ—

పత్రికల్లో పడిన కథలగురించీ కాదు. ఆ కథలు తనలో రేపిన ఆశలగురించీ కాదు.

ఉద్యోగంలేని కొడుకు గురించీకాదు. వాడికి ఉద్యోగం ఎలా వస్తుందనీకాదు. తన శిష్యులగురించి అసలేకాదు.

ఆ నెల్లో అదనంగా ఖర్చయిన పది రూపాయలను గురించే మాస్టారు ఆలో చిస్తున్నారు అంత తీవ్రంగా. □



"వచ్చేర్రా యమధర్మరాజు. జీతాలింకా యివ్వనేలేదు. వీడు ప్రత్యక్షం. ఆ క్యాషియర్ రావటమైనా ఆలస్యమవుతుంది కాని వీడుమాత్రం రంచనుగా వచ్చేస్తాడు"

"బాబోయ్. వచ్చేశాడూ? ఈనెలబోల్డు కటింగ్స్ ఉన్నాయి. ఇంకా వీడి వడ్డీ వకటా?"

"నువ్వు లక్షకథలు చెప్పినా సరే నయాన్నో భయాన్నో బెదిరించో బులిపించో వడ్డీ వసూలుచేయకమానడు ఎందుకు వచ్చినగోల? మనకొచ్చిన దెలాగూ చాలదుకాని, వాడికియ్యవలసింది వాడికిచ్చెయ్."

"ఇదిగో అరియర్స్ వచ్చేస్తున్నాయ్. అదిగో డబ్బులిచ్చేస్తారు అంటూ ఆర్నెల్లు నుండీ కాచుకునే కూర్చున్నాము. అవేవో వస్తే వీడి అప్పయినా తీర్చేద్దామను కున్నాను."

"అబ్బే అసలుదేముంది సార్ ప్రతినెలా వడ్డీమాత్రం అణాపైసలతో

నాకిచ్చెయ్యండి. అంతేచాలు. అదియ్యక పోతే మాత్రం ఊరుకునేదిలేదు"అంటాడు పైగా.

"అవును. అసలుకంటే వడ్డీముద్దు. నెలకి కొన్నివందలు వడ్డీల రూపంలో వసూలౌతూవుంటే వాడికి అసలెందుకు?

"అంత మనిషి ఉన్నాడా? పిడికెడు అన్నం పట్టే చిన్నడబ్బీ తెచ్చుకుంటాడు. అదీ చద్దన్నం. నంచుకోవటానికో ఉల్లిపాయ. యింక పిల్లలు, వాళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు. తలకో నూనెచుక్క ఎరుగరు. చిరుగని బట్టలెరుగరు "

"అందుకేనయ్యా బాబూ! అతను అప్పిచ్చేవాడు, మనం పుచ్చుకునేవాళ్ళ మయ్యాం ..."

మధ్యతరగతి జీవితానికి తగుళ్ళేకాని మిగుళ్ళుండవు. అందుకే తొంభై శాతం మనుషులు నెలముందు నుంచీనో చివర నుంచీనో అప్పులకు బయలుదేరడ మౌతుంది.

అప్పులిచ్చినవాళ్ళు అసలో వడ్డీయో వసూలు చేసుకోడానికి కఠినంగా ఉండటం తీర్చవలసిన వాళ్ళువాళ్ళని చూడగానే భయపడటం, తిట్టుకోటం, సాధారణంగా జరిగేవే. అప్పులు తీసుకొన్నప్పుడు ఎలాగయినా కావాలని, ఎంతో సౌమ్యంగా మాట్లాడి, కాళ్ళావేళ్ళాపడి (అవసరమైతే) వాళ్ళు చెప్పిన కండిషన్సు అన్నింటికీ తలవంచి తీసుకుంటారో, తిరిగి యిచ్చినప్పుడు అన్యాయంగా యింత డబ్బు పోతూందే అని బాధపడ్తారు. విసుక్కుంటారు. ఉసూరుమంటారు.

ఆ ఆఫీసులో వాళ్ళందరూ సాధారణంగా ఒకడి దగ్గరే అప్పు తీసుకుంటారు. తీసుకున్నప్పుడు రాముడిలాగ, దేముడిలాగే కన్పించినవాడే ఫస్టుతారీఖు వడ్డీ వసూళ్ళకై వచ్చేసరికి యమధర్మరాజై పోతాడు. వెనుక ఎన్ని మాటలనుకున్నా అతనిముందు మాత్రం కిక్కురుమనరు. జీతమందుకోగానే ముందు ముడుపుచెల్లించి తరువాతనే కాఫీలకు వెళ్తారు. లేదంటే ఏంగొడవ పెడ్తాడో అని భయం

* * *

"మన యమధర్మరాజు చచ్చిపోయేడుట. .."

"ఎంత చల్లనివార్త తెచ్చేవు గురూ ఇకనయినా మనకీ లప్పుల బెడద తప్పుతుందేమో...."

"వాడైతే హాయిగా పోయేడు గని మన కష్టాలు, అవసరాలు ఎక్కడికి పోయేయి?ఈనెల ఎవరప్పు యిస్తారా అని నేను ఆలోచిస్తున్నాను."


"ఇంతకీ . .ఎప్పుడు చచ్చిపోయాడు మేళతాళాలలో పంపించేశారా?"

"బ్రతికున్నప్పుడు తను శుభ్రంగా తినలేదు. శుభ్రమైన బట్టకట్టలేదు. అటువంటి వాడు ఛస్తే ఊరేగింపుకూడ ఎందుకు?

"ఏమైనా భార్యా పిల్లలు ఉన్నారుకదా పాపం వాళ్ళెంత ఏడుస్తున్నారో?"

"ఆ .. ఏడుస్తున్నారు—వాడు చచ్చినదానికంటే యింట్లో పైసాకూడా వుంచకుండా డబ్బంతా ఊరిపాలు చేశాడో అని ఏడుస్తున్నారు. ప్రస్తుతం ఆ వీధిలో వాళ్ళందరూ ఏదో చందాలెత్తి శవాన్ని లేవనెత్తారు."

"అయ్యో పాపం. ..ఊళ్ళోని అప్పులన్నీ వసూలౌతేగాని వాళ్ళ రోజులు గడపటం కష్టమే కాబోలు."



ఆ.. వాడు బ్రతికున్నన్నాళ్ళు ఎక్కడ డబ్బులు ఖర్చయిపోతాయో అని శుభ్రంగా తిని తిరగనిచ్చేవాడు కాదు. పోతూపోతూ డబ్బంతా ఊరాళ్ళమీద ఉంచేసి వెళ్ళిపోయాడు. బాకీలన్నీ వసూలవాలి. కాస్త వాళ్ళకాధారం దొరకాలి.''

* * *

"ఎవరా అబ్బాయి? ఈ వాచ్‌మాన్ ఏంచేస్తున్నాడో? ప్రతి ముష్టివెధవని లోనికి పంపించేస్తాడు."

"ముష్టివాడు కాదుగురూ. మన యమ ధర్మరాజు కొడుకు చిన్నయముడు."

"ఏమిటో? ఇకమీదట వీడు వస్తాడా వడ్డీల వసూళ్ళకి....?"


"వడ్డీలకి కాదుగురూ. అసలుకే. 'మా నాన్న వడ్డీవ్యాపారంచేసి మమ్మల్నిలా ముంచేసాడు. మాకు వడ్డీవద్దు. ఏంవద్దు. అసలు ఎంత అస్సుకున్నారో యిచ్చేయండి ఏదయినా వ్యాపారం పెట్టుకుంటాం అంటున్నాడు."

"ఏమిటో? అసలు డబ్బేకావాలా? అంతడబ్బు మనదగ్గరెక్కడుంది? అదే వుంటే ఇలా అప్పులెందుకు చేస్తాం."

"అవునవును. అసలెక్కడుంది మన దగ్గర? అసలు మనకి డబ్బెవ్వరిచ్చారు? లెక్కలూ పత్రాలూ వాడిదగ్గరేమైనా వున్నాయా?"


"అవునవును. మనం చేసిన అప్పు వాడి బాబుదగ్గర అది ఎప్పుడో చెల్లు వేసేశాము. లేదా కాలదోషం పట్టి పోయింది. వెళ్ళమనండి. ..అకుర్రవాణ్ణి. ప్యూన్‌తోచెప్పి బయటకు పంపించెయ్యమనండి." □

'మళ్ళీ' ఊరు మాటు మణిగింది



ఊరు మాటు మణిగింది. మరీ పొద్దు పోయింది. ద్రాక్షారామంలో నైట్ హాల్ట్ చేసే రాజానగరం బస్సు, కాలవ పక్క గంగరాయి చెట్లకిందాగితే, నీలిమా టీచర్ దిగింది. రోజూ ఆగే నాలుగు రిక్షాలు ఇవాళాగలేదు ఆంజనేయస్వామి గుడిముందు. రామచంద్రాపురం రా జ గోపాల్ టాకీసులోకి 'దక్షయజ్ఞం' వచ్చిందట. అందుకని వూళ్ళో జనాల్ని రెండో ఆట సిన్మాకి మోసుకుపోయాయి రిక్షాలు.

గుళ్ళోదీపం వెల్గుతోంది. దీపం వెలుగులో దేవుడు మెరుస్తున్నాడు. లాకుల దగ్గర వైర్ తాలూకు నిండు కాలువ హోరు. చింతచెట్లకింద పిడబ్ల్యూడి వాళ్ళ



సిమ్మెంటు తోరలమీద, రామచంద్రపురం కాలేజీలో చదివే అమ్మాయి-అబ్బాయిల జంట, వెన్నెల్లో అస్పష్టంగా....

నీలిమా టీచర్ సంచీ కిందపెట్టి జంటనే చూస్తోంది. వాళ్ళిద్దరూ కదుల్తున్నారు, ఏం మాట్లాడు కుంటున్నారో! లాకుల నీళ్ళ హోరులో వినిపించటంలేదు వాళ్ళ మాటలు వినిపించనందుకు తెగబాధపడి పోయింది.

ఈ ప్రపంచంలో ఎవరిచేతా ప్రేమించబడని వ్యక్తి మరో ప్రేమించుకునేజంటను చూస్తే ఈర్ష్యపడి తీరడం ఖాయం అని నేనే ఎక్కడో రాశాను కానీ—

నీలిమాటీచర్ కి ఆ రకం నైజంలేదనే సమదర్శిత్వాన్ని అలవాటు చేసుకున్న మనిషి నీలిమ అని ఖండితమైన అభిప్రాయంతో ఇప్పుడు రాయాల్సొస్తోంది.

మరి వాళ్ళ సంభాషణలు అస్పష్టంగానైనా వినిపించనందుకు బాధపడి పోవడందేనికి? వాళ్ళయినా ప్రేమించుకో గల్గుతున్నారనే ఆనందం. ఏం మాట్లాడు కుంటారు? అసలు ప్రేమజంటల సంభాషణలెలా వుంటాయి? ఎంతవరకూ సాగుతాయ్? ఎంతటితో తెగుతాయ్? అవి వినాలనే వుత్కంఠ. అయ్యో నేను ఎవరిచేతా ప్రేమించ బడటం లేదనే బాధ, చింత తప్ప—

జెలసీ పాలేమాత్రం లేదిందులో.

నందివర్ధనం పువ్వురంగు తెల్లటి చీరలుకట్టే నీలిమ నల్లగావుంటుంది, కేదారేశ్వరుడి ఆలయంముందు ఆకాశదీపంలా అందంగా వుంటుంది, పర్జన్యాల్ని పెళ్ళగించి ఉదయించే చంద్రదీపికలా నవ్వుతుంది. శివరామశాస్త్రిగారి దృష్టిలో

సీలిమ___

"అది మాలదోయ్. అందులో కీ వయసులోవున్న ఆడది కూడాను. అది పాఠాలుచెప్పే క్లాసులకి పంపించకండి మన పిల్లల్ని." ఎవరో కాలువ వేపొస్తున్నారని జ్ఞాపకాలకి జారుముళ్ళువేసి, శరీరాన్ని స్వాధీనంలోనికి తెచ్చుకుని, బరువైన సంచీతో వూళ్ళోకి నడిచింది సీలిమ.

శివరామశాస్త్రిగారెదురయ్యారుదగ్గుతూ. ఆ సమయం ఆయన చింతలగట్టుకెళ్ళే సమయం. సీలిమ ఎదురయిందని ఐదు అడుగులు దూరానికి తప్పుకుని మరీ వెళ్ళిపోయారు.

సీలిమా టీచర్ ముందుకి నడచింది మరి___

2

ఏ వూరునుంచీ వలసరాలేదు శివరామశాస్త్రిగారు. ఆయన్దావూరే. అనాదిగా ఏభై ఎకరాల పల్లపుమాగాణితో సుఖసంపన్నంగా వర్ధిల్లుతున్న వంశం ఆయనది. వాళ్ళ వంశానికిగానీ___ఆయనగ్గానీ విశేషించి చెప్పుకునే చరిత్రలేవీ లేవు. వుంటే నత్తగుల్ల కథలుండొచ్చు.

ఐనా___

శాస్త్రిగారి గురించి.. ....

వుదయం గాయత్రీ మంత్రం చదివి జపంగానిచ్చేప్పుడు ఇంట్లో, రాగిచెంబుతోమే శబ్దం విన్పిస్తేచాలు, తప్పు ఎవరిదయినా ముందు ఆడాళ్ళని తిడ్తాడు. ఇలాంటి సమస్యేదోవచ్చి రెండేళ్ళక్రితం ఇంటి పెద్దకోడల్ని గుండెలమీద గుద్దాడట.

ఆయన దృష్టిలో___

ఈ ప్రపంచంలో ఆడది ఒక సమస్యట. అందుకే తెల్లవారిలేచి, ఆడజాతిని అన్యకులస్థుల్ని అపనిందపాలు జేస్తేగాని మనసుకి తృప్తిగా వుండదాయనకి

సాయంత్రం___

రాములవారిగుడి అరుగుమీద కూర్చుంటాడు. నల్గురు పోగుపడేసరికి వుపన్యాసం.

" అసలీప్రపంచానికిఆడదోసమస్య. ఈ ఆడాళ్ళు వుద్యోగం చేసే కారణంగానే మా ఆఖరివాడు వుద్యోగం దొరక్క రామచంద్రాపురాన్ని గేస్ ఏజన్సీ తీసుకొని ఏడ్వవాల్సొచ్చింది. మగాణ్ని ఆడది ఉద్రేక పరుస్తున్నందుకే యీ జనాభా. బర్త్ కంట్రోలంటే మాత్రం "

ఇలా సాగదీస్తారాయన.

మరీ పొద్దుపోయాక సంతపేటలోంచి అలా కాల్వగట్టుకొచ్చి గోపాలరావు కాఫీ హోటల్లో నీళ్ళుతీస్కుని బయల్దేరతాడు చింతలగట్టుకి

ఆయన వూళ్ళోంచొస్తుంటే కోమటి సత్యం వీధిలో ఆడాళ్ళు చల్లగాలికి అరుగులమీద కూర్చుని ఏ సన్యాసమ్మ కథో లక్షమ్మకథో చెప్పుకుంటుంటే, శాస్త్రిగాడు వీధిమొగలో కన్పిస్తేచాలు లోనికిపోతారు.

వాళ్ళనిచూసి సణుగుతాడు శాస్త్రిగారు.


"మరీ లజ్జ మర్చిపోతున్నారు."

ఇలాంటి మనుషులున్న ఆ వూళ్ళో సీలిమ వుద్యోగం చేస్తోంది!!!

3

"మూన్లైట్ మీకళ్ళల్లో సెమిలర్లీగా కన్పిస్తున్నది మేడమ్ యీసాద్యశ్యంలో నన్ను ఇముడ్చుకోండి" అన్నాడతను

"మీ ఫాదర్కి లేడీస్ని సెడ్యూస్ చేసే గుణం అధికంగావుం. అందుకే



నాకు భయంగా వుంది."

"రీవిట్ మేడమ్ అలాంటి విషయాలు మనం పట్టించుకోగూడదు."

"సరే....నన్ను నిజంగా పెళ్ళి చేసుకుంటావు కదూ! ప్రేమించే మనిషి కోసమె నా హృదయం పడే సంక్షోభం."

"నిన్ను పెళ్ళి చేసుకుని, ప్రేమలో విలువునా ముంచి నీ మనసుని నిశాకృతం చేస్తాను సరా?"

"థాంక్యూ....థాంక్యూ"

"ఈ గట్టు నెందుకూ కాలువలో తెక్కువ రా అలా తూరల వేపెళ్దాం."

అలా పోయారు ఆమె-అతను.

ఆమె నీలిమా టీచర్. అతను శివమోహన్. శివరామశాస్త్రిగారబ్బాయి. రామచంద్రపురాన్ని రాజగోపాల్ పిక్చర్ పేలెస్ కెళ్ళే దార్లో ఇండేన్‌గ్యాస్ ఏజన్సీ రన్ చేస్తున్నాడు.

ప్రే.... మి ....ం... చు .... కుంటున్నారు వాళ్ళిద్దరూ. నెల రోజుల్నించి.

4

9 గంటల రాత్రి—

ఆ రోజు వుదయంనుంచీ వర్షం కురిసింది. చింతలగట్టంతా బంద బందగా చిత....చిత లాడ్తోంది.

దేహశంక పూర్తిగానిచ్చి కాళ్ళు కడుక్కునేందుకు కాలువలోకి దిగి బురదవల్ల జారి, వూబిలోనికి కూరుకు పోయారు శాస్త్రిగారు.

ఆ కాలవ ఎప్పుడూ నిండుగా ప్రవహిస్తుంది. ఆ కాలువలోనే ఎంతోమంది పిల్లలు స్నానాలకొచ్చి మునిగి చనిపోయారు. అదే కాలువలో అత్తమామల పోరు భరించలేక రిక్షతొక్కే 'యాకోబు'

చెల్లెలు మునిగి ఆత్మహత్య చేసుకుంది.

అలాంటి లోతైన కాలువలో ఇవాళ శాస్త్రిగారు దిగబడి మునిగిపోతున్నాడు. నీళ్ళు తాగేస్తున్నాడు. కాస్సేపట్లో ప్రాణాలు పోగొట్టుకుంటాడు.

ఆ సమయంలో కాలువ గట్టుమీదుగా-

ఓ మనిషి చేతి సంచీతో వస్తూ ఎవరో మనిషి మునిగిపోతున్నాడనిచూసి, సంచీ బురదలో వదలి నీట్లోకి దిగి శాస్త్రిగార్ని పైకి తీసుకొచ్చాడు. తన భుజంమీద తుండుగుడ్డతో ఆయన తలా, వళ్ళూ తుడిచాడు.

"సమయానికొచ్చావు బాబూ. నాకింకా భూమ్మీద నూకలున్నాయనే పంపాడా దేవుడు నిన్ను."

"మరీ మధ్యకెళ్ళలేదు గాబట్టి సరి పోయింది. లేకపోతే నేనూ ఏమీ చేయ లేక పోయేవాడ్ని బాబా."

"ఏ వూర్నుంచొస్తున్నట్టున్నావ్ బాబూ!"

"శివ్వవరంండి. కోటిపల్లి దగ్గర గంగ వారంవండి మాది. దెయ్యాల బండ్లో వచ్చానండి."

"ఎవరింటికి?"

"దూరపు బంధువుల పిల్ల వుద్యోగం సేస్తందండీ."

"ఏ వుద్యోగమబ్బా?"

"పంతులమ్ముద్యోగమండీ ... నీలమ్మ ఆ పిల్లపేరు."

"ఏవిటీ?" శాస్త్రిగారి వళ్ళంతా కంపరం పుట్టింది. వాడి వాసన తుండుతో తన తల తుడిచాడు. తన్ని నీట్లోంచి మోసుకొచ్చాడు వెధవ.

బాబూ తవరు నడ్లేరు నా భుజం మీద సెయ్యెయ్యండి."

"అక్కర్లేదు. వెళ్ళు నీదార్ని." అని కసురుకున్న శాస్త్రిగార్ని ఆ మనిషి వింతగ చూస్తూ పోయాడు ముందుకి ... వూళ్ళోకి

5

"ఫారిన్‌లో అనుకున్నది సక్సస్ కాక పోతే ఆత్మహత్యలు చేసుకుంటార్ట. మన దేశం వాళ్ళకాధైర్యం లేక సన్యాసం పుచ్చుకుంటారు. ఫన్నీ."

"నాకా ధైర్యం వుంది. మీరు నన్ను పెళ్ళి చేసుకోకపోతే నేనీ కాలువలో పడే చావాలి."

"వా .. ట్?? నో... నో మేడమ్ అంత వెర్రిసాహసం పనికిరాదు. రీసెంట్ రామచంద్రపురంలో వో టైప్ ఇన్‌స్టిట్యూట్ అతను మా ఫ్రెండే, అతని సిస్టరూ—మరో అబ్బాయీ అదే పని చేశారు. ఎందుకో ఆ సెమిరిటీ? నువ్వూ అదే చేస్తానంటే నా మనసేంగానూ?"

"నాకు మూడోమాసం."

"నాకు నవ్వొచ్చేస్తుంది మేడమ్. పాతి కేళ్ళు వయసు పెట్టుకుని మూడోమాసం అంటావేం?"

"నా గర్భానికి"

"నిజవా?"

"నిజం"


"లీవిట్ మేడమ్ అవి మనప్రేమకి అడ్డురాదుగా."

"కడుపులో బిడ్డ రాజుకున్న నిప్పులా పెరగుతుంది క్షణ క్షణానికి."

"పెరగనీ మేడమ్! పెరిగేదాన్ని తరిగే దాన్ని నిలుపకూడదు. పాపం.... పెరగనీ",

6

అన్య కులస్థుల్ని ఆడజాతినీ తిట్టి



తిట్టి అలిసి పోయేసరికి 10 గంటల రాత్ర యింది. పైమయిందని చింతల గట్టుకి బయల్దేరారు శాస్త్రిగారు.

గట్టున నత్తగుల్లలా నడుస్తుంటే పెద్దగా పొలికేక విన్పించింది శాస్త్రిగారికి. అదీ నీళ్ళలో ....ఆడకేక.

గబగబా వొడ్డుకెళ్ళారు.

"బాబూ వడ్డుకి తియ్యండి నన్ను... పుణ్యం గట్టుకోండి బాబూ!"

"ఎవరూ?" పరిశీలనగా చూస్తే తెల్సింది. ఆమె నీలిమ. అరె .. కాళ్ళు నీళ్ళల్లోకి కూరుకుపోతున్నాయే. అమ్మయ్యో నీళ్ళల్లోకి పూర్తిగా మునిగిపోతుందే. దీన్ని రక్షిస్తే రెండుచేతులూ నరుక్కోవాలి.

"బా ...బు... గారూ రక్షిం ...."

క్రమక్రమంగా నీలిమా టీచర్ నీళ్ళల్లోకి మునిగిపోయింది పూర్తిగా.. కాస్సేపటికి ఆమె తెల్లచీర నీటిపైన పరుచుకుపోయింది.

గుట్టుచప్పుడు గాకుండా యింటికెళ్ళిపోయారు శాస్త్రిగారు.

7

మరుసటిరోజు 'వెల్లి'లాకుల దగ్గర నీలిమ శవం తీసిన పోలీసులు, పోస్టుమార్టమ్ షెడ్‌కి తీస్కెళ్ళి, ఆత్మహత్యగా నిర్ణయించారు.

ఆరాత్రి శివమోహన్ త్వరగా ఇంటి కొచ్చి, భోంచేసి, వాకిట్లో మంచంవేసుకు పడుకున్నాడు.

నిన్నరాత్రి. 'నీలిమ' "నన్ను పెళ్ళాడకపోతే పోలీస్‌రిపోర్టు యిస్తానూ.వూళ్ళో మాదిగాడిచేత టముకు వేయిస్తా"నంటే భయపడి లాక్ వైర్‌లోకి తోశాడు.

తను నీలిమా టీచర్‌ని నీటిలోకి తోపినట్టు ఎవరికీ తెలీదు. తెల్సినా శివరామశాస్త్రిగారబ్బాయి యీపని చేశాడంటే ఎవరూ నమ్మరు. ఈ కేస్ సుప్రీమ్‌కోర్టు కెళ్ళినా నెగ్గదు. ఇది పచ్చినిజం. □

చిన్నసీరియల్

చెట్టూ-ఛాయా

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి



(గత సంచిక తరువాయి)

ఇంతకు పూర్వం మనసులో నిండుకొన్న వైరాగ్యానికి నేడు అపరిమితమైన ఏవగింపు తోడయింది.

ఛీఛీ. నావంటివాళ్ళు ఈ ప్రపంచంలో పుట్టకూడదు. పుట్టినా చాలా తక్కువ కాలం జీవించాలి! అనుకున్నాడు బాధగా.

14

"రమణా!"

పరధ్యానంగా వ్రాసుకుంటూన్న అతడు అదరిపాటుతో చూసాడు.

తననే నిశ్చలంగాచూస్తూ నిర్మలంగా నిలబడివుంది ఛాయ చేతిలో పసిబిడ్డనెత్తుకొని

"ఓ! దా. కూర్చో. ఏమిటిలా వచ్చావ్?"

"బాగుంది ప్రశ్న. నువ్వు రావడం మానేయగా. నన్ను 'ఎందుకొచ్చా'వని కూడా అడుగుతున్నావన్న మాట."

రమణ మాట్లాడలేదు. ధరణి కభిముఖమైంది అతడి వదనం.

"నిన్న మా పాప నామకరణం. వేడుకకు పిలిస్తే వచ్చావు కాదు. నాపై కోపమా?"

బాధగా నవ్వాడుకణతలు రుద్దుకుంటూ.

"ఆ ప్రశ్న నిజంగానే అడిగావా?నీపై నాకు కోపమా?"

"మరి? నీకోసం మేమిద్దరం యెంత యెదురు చూచామో తెలుసా?"

"ఛాయా, నేనువచ్చినా రాకున్నా నా మనఃపూర్వక ఆశీర్వాదాలు పాపకెప్పుడూ వుంటాయని నీకు తెలుసు." అంటూ ఆమె చేతులలోనుండి పాపను ఆప్యాయంగా అందుకున్నాడు.

"ఏంపేరు పెట్టుకున్నావమ్మా పాపా?" అని అడుగుతూ పాపతో ఆడుతూన్నట్లు నటిస్తూ అతడు తన కనులలోని నీటి పొరను దాచుకొంటున్నాడని గ్రహించింది ఛాయ.

జీవంలేని ఆ కంఠస్వరం ఆమె అంతరాంతరాలను కలచివేసింది.

ఆమె తననే పరిశీలనగా గమనించుతూన్నదని గ్రహించిన రమణ హఠాత్తుగా లేచి పుస్తకాల రాక్‌లో ఏదో వెదుకుతూ ముఖాన్ని మఱుగు పరుచుకున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత తనను తాను సంబాళించుకుని పుస్తకంలో దాచి వుంచిన డబ్బు యాభై రూపాయలు ఛాయకు అందించుతూ అన్నాడు:

"పాపకు దానితో మంచి గౌను కొను ఛాయా. ఇంతకంటె ఇవ్వలేని దౌర్భాగ్యుడిని."

ఛాయ ఆ డబ్బును అందుకోలేదు.

"నీ ఆశీర్వాదబలమే పాపకు పదిలక్షలతో సమానం. నేను ఈ బహుమానాలు అందుకోవటానికి రాలేదు. పాపను నీకు చూపుదామని వచ్చాను."

"మీ అమ్మ కోపంగావున్నది. పోనీ నువ్వు తీసుకోతల్లీ" అంటూ పాపచేతిలో వుంచాడు ఆ నోటు.

ఏదో అర్థమైనట్లే బోసిగా నవ్వులు కురిపించుతూ ఆ బహుమానాన్ని పిడికిలిలో బిగించి పట్టుకున్నది పాప.

"ప్రభాకరం కాలేజీకి వెళ్ళాడా?" అన్నాడు ప్రసంగాన్ని మార్చుతూ.

"ఆఁ నిన్న తానూ చాలా అనుకున్నారు నీగురించి."

కొంతతడవుఎవరినుండీ మాటలులేవు.

హఠాత్తుగా ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రమణ మాట్లాడాడు.

"నీవు వచ్చిన కారణం వేరేవుంది. నాకు తెలుసు. మఱలా నాకు నీతిబోధలూ హితోపదేశాలూ చేయాలని వచ్చావ్."

"కాదు." అవకాశం కోసమే చూస్తున్న ఛాయ కంఠం ఖంగుమన్నది. "నీసాటి వాళ్ళంతా ఎంత సుఖంగా ఎంత ఆనందంగా వున్నారో గ్రహించేట్లుచేసి నీకు అసూయ కలిగించాలని వచ్చాను."

గంభీరహాసం నిలిచింది రమణ పెదవులపై.

"అసూయాద్వేషాలూ, రాగ విరాగాలూ నన్ను ఏనాడో విసర్జించాయి ఛాయా. నీవు శ్రమపడి ప్రయోజనంలేదు"

బరువైన నిట్టూర్పు వెడలింది ఛాయ అంతరాళాలనుండి.

"నాకు తెలుసు రమణా, నీహృదయం నవనీతమని. కానీ అర్థంలేని త్యాగాలతో ఎందుకిలా నిమ్మ నీవు శిక్షించుకుంటున్నావ్? నీ త్యాగాలను అందుకొంటూన్న వారిలో ఎవరికయినా నీ విలువ తెలుసా? నీపై పీసమంత అనురాగం, మమతా ఉన్నాయా?"

"హుఁ" వైరాగ్యం కురిసింది అతడి చిరుహాసంలో. "ఆవేశపడి ప్రయోజనం లేదు ఛాయా. కొందరి జీవితాలు అలా

జనప్రియ పుస్తకమాలలు...



సత్యం-శివం-సుందరం	10.00
విద్య	6.00
శిలలు - శిల్పాలు	9.00
పూజారిణి	10.00
సూర్యముఖి	7.50
కల్పవృక్షం	6.00
దిక్చక్రం	6.00
నందనవనం	11.00
బృందావనం	7.50
దివ్యదీపావళి	7.50
శాంతి నికేతన్	10.00
చక్రనేమి	10.00
శంఖుతీర్థం	10.00
అనిర్వచనీయం	6.00
చక్రవాకం	7.00
భాగ్యచక్రం	9.00
ప్రేమనగర్	6.00
ధర్మచక్రం	8.00
కళ్యాణమందిర్	6.00
బదరిక	6.00
చక్రభ్రమణం	6.00
సంసారచక్రం	6.00
కల్పన	6.00
సుప్రభాతం	6.00
శోభకృతు	6.00
పెళ్ళి ఎవరికి?	6.00
తేయుని శాపం	6.00

ఏలూరురోడ్డు — నవజ్యోతి పబ్లికేషన్సు — విజయవాడ-2

అర్థరహితంగా సాగిపోవలసిందే."

"రమణా! నా హృదయంలో ఒక భాగం ఎల్లప్పుడూ నీకోసం శోకించు తోంది." దగ్గుత్తిక మాటలకు అడ్డు పడింది.

"నీ మంచి హృదయంలో నాకు ఆ మాత్రం స్థానం లభించడం నా అదృష్టం కానీ, నాగురించి అనవసరంగా నీ మనసు పాడుచేసుకోవలదని నా అభ్యర్ధన.''

మనసునందలి దుఃఖాన్ని దిగమ్రింగు కుంటూ కొద్దిసేపు మౌనం వహించిన ఛాయ, కూర్చున్న తావునుండి లేస్తూ ప్రకాశంగా అన్నది:

"వారికి ఇక్కడనుండి ట్రాన్స్ఫర్ అయ్యింది."

"విన్నాను."

"ఎల్లుండే ప్రయాణం. మళ్ళీ ఎప్ప టికి కలుసుకుంటామో యేమో?"

"ఊం." అనలేక అంటూన్న ఆ స్వరంలో అతడి మనసు మూలుగు ప్రతి ధ్వనించింది.

"ఎక్కడున్నా నా హృదయం నీ శ్రేయస్సు కొరకూ, నీ క్షేమం కొఱకూ తహతహ లాడ్తుంటుందని మరచిపోకు."

"..... .. .. .."

"హితైషిగా, స్నేహితురాలిగా ఒక్క ప్రార్థన. ఇప్పుడయినా మించిపోయింది లేదు. నీ బాధ్యతలన్నీ తీరాయి. ఇక తనకుమాలిన ధర్మం అనవసరం. నీకు తగిన సహచరిణిని ఎన్నుకొని జీవితంలో స్థిరపడినరోజు చూడాలని తపించుతున్నా నని గుర్తుంచుకో."

"క్రొత్త అడ్రస్ తెలియజేయి. ఎల్లుండి స్టేషన్కు రాలేను."

"అడ్రస్ వ్రాస్తాను. అప్పుడప్పుడూ వస్తుంటావ్గా?"

"అప్పుడప్పుడూ—ఎన్నోసార్లు వస్తా నని చెప్పలేను గాని ఒక్కసారి మాత్రం తప్పక వస్తాను మీ వూరు."

"వెళ్తున్నాను."

పరిగెత్తినట్లేవడివడిగానడచిపోయింది.

అతడికి తెలుసు—తన అశ్రుధారలు అతడికి కన్పించరాదనే అలా పారిపోయిం దని.

15

ఈరోజే ఛాయ వెళ్ళిపోతుంది. ఏమి చేయాలి? స్టేషన్కు వెళ్ళాలా, వద్దా?

వెళ్తే ఛాయ సంతోషిస్తుంది.

కానీ ఎందరో లెక్చరర్స్, విద్యార్థులూ కూడా వస్తారు స్టేషన్కు,సాగనంపటానికి.

అందులో కొందరు ఛాయకూ తనకూ గల స్నేహం తెలిసిన వారుంటారనేది సత్యం.

వారందరి ఎదుటా తాను తలెత్తుకో లేడు.

వారి విమర్శనా దృక్కులను ఎదుర్కో లేడు. కాని వెళ్ళకుంటే ఛాయ బాధ పడదూ?

మీమాంస ఎటూ తేలనేలేదు.

అంతలో "అబ్బాయ్" అంటూ తల్లి కేక విన్పించింది.

"ఏమిటమ్మా?"

"ఏముంది నాయనా?"

అతడి కుర్చీకి అల్లంత దూరంలో కాళ్ళు బార జాపుకొని తీరికగా మాటల కుపక్రమించింది.

"మా యిద్దరివీ ముసలి ప్రాణాలు. కొస్త మాటా మంతీ అడే వాళ్ళులేక,

బిక్కు బిక్కుమంటూ పడివుంటున్నాము. మతులు పోతున్నాయి. సీమటుకు నువ్వు నాలుగు కాగితాలు ముందు పడవేసుక్కూర్చుంటావ్."

"నేను వ్రాయకపోతే ఎలా గడుస్తుందమ్మా మరీ? అన్నట్టు సుగుణా సుగుణ పిల్లలూ వున్నారుగా? నీకు తోచక పోవడం ఏమిటీ?"

వింతగా విసుగ్గా చూచింది మహాలక్ష్మి.

"అయ్యో సంబడం." విరసంగా అన్నది. "వాళ్ళు వెళ్ళి అప్పుడే నాల్గు రోజులైంది. నీకింకా తెలియదన్నమాట? అంత గొప్పగా వున్నాయి ఈ యింటి ఆడపడచుల మీది ప్రేమలు!"

నిర్ఘాంతపోయిన రమణ మాటలకు తడుముకోవలసి వచ్చింది.

"సుగుణ . సుగుణ వెళ్ళి....నాలుగు రోజులైందా? నాతో మాట మాత్రంగానైనా చెప్పలేదే?" ఆశ్చర్యం బాధా పెనవేసుకు వచ్చాయి.

"ఎందుకు చెప్తుందీ? దానిమీద నీకు గల ప్రేమ అంత గొప్పగావుంటే, దానికేమవసరం మాట్లాడటానికి? పురుళ్లూ పుణ్యాలకు అందరి ఆడపిల్లలూ వచ్చినట్లే దాని పుట్టింటికి అది వచ్చిందిగానీ.. ఏమైనా గతిలేక వచ్చిందా?"

"నేనలా అన్నానా?" నీరసంగా అడిగాడు.

"అనక్కర్లేదు. 'మగపిల్లాడు పుట్టాడు. నాలుగైదు తులాల బంగారంతెచ్చి ఘనంగా వేడుక జరిపించ'మని పిచ్చితల్లి నోరుతెఱచి అడిగినందుకైనా కాస్త ఖాతరుచేశావా? ముష్టి యిచ్చినట్లు రెండు వేలు తెచ్చి అన్నీ అందులోనే జరుపుకొమ్మని ఖచ్చితంగా చెప్పాక. దాని మనసు బాధపడదూ మరి?"

"అమ్మా!!!"

"ఆడాళ్ళన్నాక అన్నదమ్ముల పెట్టుపోతలపై ఆ మాత్రం ఆశలుండవా? ఇంటి ఆడపడచులు తృప్తిగా సంతోషంగా పుట్టింటినుంచి వెళ్ళడం నీకే క్షేమం అది పుట్టింటికే మంచిది. తెల్సుకో."

తల తిరిగిపోసాగింది రమణకు.

'నీ త్యాగాలను అందుకొంటూన్న వారిలో ఎవరికైనా నీ విలువతెలుసా? నీపై పీసమంత అనురాగం, మమత వున్నాయా?'

ఛాయ మాటలు చెవులలో గింగురుమనసాగాయి.

మహాలక్ష్మి ధోరణి సాగిపోతోనే వుంది.

"ఆ పూరికొంపకు వచ్చి నేను వుండలేనని రాధ వ్రాసింది. ఇద్దరు కూతుళ్లూ అల్లుళ్ళూవస్తే నాల్గురోజులుండే జాగా లేదు ఈ బెత్తెడు కొంపలో. కాస్త పెద్ద యిల్లు చూడమంటే నువ్వు వినవు."

ఒక్కొక్కమాటా రమణ ఎదలో ఎన్నెన్ని తూట్లు చేస్తూన్నదో ఆమె కనవసరం.

"పాత అప్పులు తీరకండానే క్రొత్త అప్పులు చేశాను. అవి తీర్చటానికే రాత్రింబవళ్ళూ విరామం లేకుండా వ్రాస్తున్నాను. మంచి యిల్లు తీసుకోవాలని నాకూ వుంది. కాస్త ఈ అప్పులు తీరాక చూద్దాంలే."

"మాటకుముందు ఈ చాట భారతం వినలేక ఛస్తున్నాను నువ్వూ కట్నం

తీసుకుని పెళ్ళిచేసుకుంటే అన్ని కష్టాలూ తీరతాయని చెప్తున్నానా? ఈరోజు కూడా ఆ ఎదురింటావిడ ఎవరిదో సంబంధం గురించి చెప్పింది."

"ఈ ప్రస్తావన నావద్ద తేవద్దని చాలా సార్లు చెప్పానమ్మా. ఈరోజు ఆఖరు సారిగా చెప్తున్నాను. నేను సంపాదించి నంతలో మిమ్మల్ని లోటులేకుండా చూడ గలను. తృప్తిపడటమనేది మన మన సులలో వుండాలి." నిష్కర్షగా అన్నాడు.

ఎక్కుపెట్టిన బాణంలా రయ్యిన లేచి నిలబడింది మహాలక్ష్మి.

"అయితే నామాట కూడా విను. పిల్లాపాపా కళాకాంతీ లేని ఈ కొంపలో నేను పడుండలేను. రెండు నెలలకో సారైనా నా కూతుళ్ళనూ మనుమలనూ చూడకోకుండా నేను బ్రతకలేను. ఈ చాలీ చాలని కొంపకు వాళ్ళు రారు."

నివ్వెరపాటుతో చూడసాగాడు రమణ.

"నన్నేం చేయమంటావమ్మా"

"నువ్వేం చేయనక్కర్లేదురా" తండ్రి వచ్చాడు అపరిమితమైన ఆగ్రహం వ్యక్తంచేస్తూ. "మేమే పోతున్నాం. సుగుణది ఒంటరికాపురం. దాన్నీ దాని బిడ్డలనూ చూచుకుంటూ హాయిగా అక్కడే వుండిపోతాం. రాధ కూడా అక్కడకు దగ్గలోనేవుంది. ఇద్దరి దగ్గరా మాకు కాలక్షేపమైపోతుంది."

అది కేవలం బెదిరింపుకాదు.

ఆ నాలుగోనాడే మహాలక్ష్మి, దేవయ్యా వెళ్ళిపోయారు

"ఇంత బ్రతుకూ బ్రతికి అల్లుళ్ళ యింటపడి తిన్నామని అనిపించుకోలేం నెలనెలా అయిదారొందలు పంపిస్తూండు ఎదనపు ఖర్చులువుంటే రాస్తాను. అశ్రద్ధ చేయక పంపిస్తూండు." అని ఆజ్ఞ జారీ చేశాడు దేవయ్య వెళ్తూ వెళ్తూ.

"అనవసరంగా వెళ్తున్నారమ్మా. నేను చేసిన పొరపాటేమీలేదు" ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాడు రమణ.

"ఇక ఆ మాటలన్నీ ఎందుకులే." మూలిగింది మహాలక్ష్మి. "నీకేముంది, ఒంటిగాడివి. ఎలాగైనా జరిగిపోతుంది. ఓపికవుంటే నాలుగు గింజలు ఉడకేసుకో, లేకుంటే హోటేళ్లు వుండనే వున్నాయి గదా! డబ్బు పంపడం ఆలస్యం చేయకు నెల నెలా. అల్లుళ్ళ దగ్గర అప్రతిష్ఠ కాగలదు."

అంటూనే బండి ఎక్కింది.

నిర్జీవంగా నిలబడిపోయిన ఒంటరి ప్రాణి రమణ అంతరంగపు ఆవేదన వర్ణనాతీతం.

'వెఱ్ఱివాడా! ఇంకెవరికోసం నీశ్రమ ఇటువంటి వాళ్ళంతా నీవాళ్ళా? ఇక నీకు వేళా పాళా తిండి సదుపాయం చూసే దెవరు? ఖర్మజాలక మంచానపడితే మందునీళ్ళుకాదు సరికదా, గుక్కెడు మంచినీళ్ళైనా గొంతుకలో పోసే దిక్కున్నదా?'

ఉస్సురనుకుంటూ ఎదుటి చెట్టు చేమలపైకి దృష్టి మరలించాడు.

పచ్చని బాదం చెట్టునిండా పక్షులు కిలకిల మంటున్నాయి. క్రిందరాలిన కాయల్ని చిన్నపిల్లలు పోటాపోటీలుగా ఏరుకుంటున్నారు

ఇంటి ముంగిటవున్న పెద్ద మఱ్ఱిచెట్టు నీడన ఇద్దరు ముగ్గురు వ్యక్తులు విశ్రాం

తిగా పడుకొని వున్నారు

ఆ చెట్టునీడన అనుదినం అలా ఎందరో బాటసారులు సుఖంగా సేద దీరడం జరుగుతూనే వున్నది. ఆ తరు శాఖలలో నిత్యం పక్షుల కలకలా రావాలు విన్పిస్తూనే వుంటాయి.

మరికొంచం దూరంలో పెద్ద మామిడి చెట్టు ఇటీవలి గాలివానకు కూలిపోయింది. రెండ్రోజులుగా ఆ చెట్టును ముక్కలు కొట్టించి కలప అమ్ముతున్నాడు దాని యజమాని.

రోజూ చూచే ఈ సామాన్య దృశ్యాలు రమణ కంటికి నేడు ప్రత్యేకంగా కన్పించాయి.

మొన్నటివరకూ అనేకులకు ఫలదానం చేసి, తన ఛాయలో ఆశ్రయమిచ్చి ఆదుకొన్నది ఆ మామిడిచెట్టు. నేడు చనిపోయిన ఆ చెట్టువలన కూడా లబ్ధిపొందుతున్నారు దాని నీడన బ్రతికినవారే.

మరికొంతకాలానికి ఈ బాదంచెట్టూ, ఆ మఱ్ఱిచెట్టుల గతికూడా అంతే కావచ్చు!

తాను ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూడా నిశ్చలంగా నిలచి అనేక మందికి నీడనూ ఆశ్రయాన్నీ ఇచ్చే తరువుకు నీడనూ ఆశ్రయాన్నీ ప్రసాదించ గల వారెవరు? విషణ్ణమైన మనసు విరక్తిగా నవ్వుకొన్నది.

16

"అమ్మగారూ అమ్మగారూ."

కొంపలంటుకు పోతూన్నట్టే అరుస్తూ పరుగున వచ్చింది పనిమనిషి.

అప్పుడే తెలతెలవారుతోంది.

ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు.

"ఏమిటే గోలా?" విసుగ్గా అన్నది ఛాయ

గుమ్మం కడిగి ముగ్గువేయడానికి వెళ్ళిందేమో—

ఓ చేతిలో చీపురూ, మరో చేతిలో ముగ్గుగిన్నే అలానే వున్నాయి.

"మరేం అమ్మగోరూ—స్వాములా రటండీ..." మాటలు ఎక్కడా పూరించ నీయడంలేదు ఆవేశం.

"ఆc. తెల్లారిలేస్తే అనేకమంది సాములూ, సాధువులూ. పనేముంది? ఇంత ప్రొద్దున్నే ముష్టి ఏమిటి? వెళ్ళమను."

నిద్రలేచిన పాపను భుజాన వేసుకుంటూ అన్నది.

"ముష్టి కాదమ్మగారూ. ఆయన చాలా గొప్ప సాధుగారు. మొన్న మా పిల్లోడికి జొరంవస్తే ఆయనకాడికి తీసికెళ్ళానా, మద్దేనానికి చేత్తో తీసేసినట్టే తగ్గిపోయింది. మా పిల్లోడేటి-ఎందరి రోగాలు నయమైనా యనుకున్నారు? వారం రోజులుగా శివాలయం కాడ మఱ్ఱిచెట్టుకింద వుంటున్నాడు మహానుబావుడు."

"అయితే ఏమంటావే?"

"పాపగారికి పదిరోజుల్నుండీ జొరం తగ్గడంలేదు గదమ్మగారూ. ఆయన కాడికి తీసుకెళ్దాం పదండి."

"చాల్లే. ఇటువంటివి ఎన్ని వినలేదు? డాక్టరు మందు ఇస్తూనే వున్నాడుగా?"

"లేదమ్మగారూ. నామాట అబద్ధం గాదు. అయినా ఒక్కసారి ఎల్తే మీ సొమ్మేంపోయింది చెప్పండి?"

అంతలో పాప వాంతి చేసుకోవడంతో ఆ మాటలు కాస్త ఆగాయి. వాంతి చేసుకున్న పాప బిగ్గఱగా ఏడు

స్తోంది

నాల్గు నిముషాల తర్వాత అక్కడ కడుగుతూ పైడెమ్మ మళ్ళా ప్రారంభిం చింది.

"మీరు బాగా సదూకున్న అమ్మలే గావచ్చు. అయితేనేం ఈ ఒక్కపాలికీ నా మాట ఇనుకోండి. అందరు సాము లార్లకు మల్లే ఈయన పూజలయ్యా సెయ్యరు. పువ్వులూ, ఇబూతీ ఇవ్వరు. అసలు మనేపు సూడరు. మాట్లాడరు. ఆయన లోకం ఆయనది. ఒక్కసారి ఆయన ఎదుటికి ఎత్తేనే మన రోగాలు అలా అలా దిగమారిపోతాయి."

ఈసారి ఛాయకు కొద్ది ఆసక్తి కలిగింది.

"అలాగా?" అన్నది, కొంత ఆశ్చ ర్యంగా.

"ఔనమ్మా. పదండి. నేను సాయం ఒత్తాను. ఇప్పుడే ఆయన నదికి తానా నికి ఎళ్తుంటే సూశాను. లగెత్తు కొచ్చాను. ఊఁ. పదండి."

ప్రభాకరం గదిలోనుంచి అంతా వింటూనే వున్నాడు.

ఛాయ అతడి వద్దకు వచ్చింది.

"అంతా వింటున్నారుగా?" అన్నది.

"ఊఁ."

"పోనీ ఒక్కసారి వెత్తే ఏం పోయింది? చూద్దామా?"

"ఎంత చదువుకున్నా ఆడవాళ్ళు ఆడ ?"

"కాదులెద్దురూ. పదిరోజులుగా పాప అలా అస్వస్థతగావుంటే నాకు మతి పోతోంది. మనక్కావలసింది పాప ఆరోగ్యంగానీ తర్కం కాదుగా?"

"ఔననుకో"

కొంచం సాయంరండి ఎప్పుడూ అటువంటి చోట్లకు వెళ్ళలేదు నేను. బెరుగ్గా వుంటుంటుంది."

"నడు. తప్పేదేముందీ?"

అక్కడ పాతిక ముప్పైమంది వఱకూ జనం వున్నారు.

"పొద్దెక్కిన కొద్దీజనం ఎక్కువై పోతారు." పైడమ్మ కామెంటరీ సాగు తూనే వుంది.

"నదిలో తానమాడి వచ్చి ఈ సెట్టు కింద కూసుంటారు. ఎవ్వరితో మాట్ల డరు. ఆయన అన్నం తినగా వొవురు సూడలేదు. ఏయమ్మో తెచ్చిన ఓ గ్లాసు పాలో మజ్జిగో మాత్రం పుచ్చుకుం టారు...."

స్వామీజీ గుణగానం చేస్తోన్నారు పైడమ్మతోపాటు మరికొందరు ఆగంత కులు.

స్వామికి దగ్గఱగా ఎదురుగా పాపను పట్టుకు నిలబడింది ఛాయ, అతడినే భక్తిగా చూస్తూ.

ఏదో తప్పక వచ్చినట్టుగా వచ్చిన ప్రభాకరం అల్లంత దూరంలో నిల బడ్డాడు.

"అబ్బ. ఎవరైనా చూస్తే నవ్వుతారు ఛాయా మూఢ నమ్మకాలని. త్వరగ పోదాం పద."

"ఉండండీ. తీరా వచ్చాంగా?"

వచ్చిన అందరూ పండ్లూ పువ్వులూ అతడి చెంతవుంచి, పాదాలకి మొక్కి వెళ్తున్నారు.

అతడు వాటినిగానీ, వారినిగానీ కన్నెత్తి చూడటంలేదు.



"స్వామీజీ" వణకుతూన్న కంఠంతో సంబోధించింది ఛాయ.

ఆమె సాహసానికి కొందరు ఆశ్చర్యంగా అబ్బురంగా చూచారు. మరి కొందరు "తప్పు తప్పు. మాట్లాడకూడదు. ఆయనకు కోపం రావచ్చు." అని వారించారు.

అయినా ఛాయ వినలేదు.

మరొక్క అడుగు ముందుకువేసింది.

స్వా మీ జీ. ఒక్కసారి ఇటు చూడండి."

అంతవఱకూ అవనతంగా వున్న స్వామి కనురెప్పలు పైకిలేచాయి.

అతి నిర్మలమైన ఆ చూపులు ఛాయ వదనంపై అలా నిశ్చలంగా నిలచిపోయాయి కొన్ని నిముషాలు.

'స్వామికి కోపం వచ్చింది."

'రాదా మరి?"

జనంలో ఊహాగానాలు మొదలయ్యాయి

స్వామి దృష్టులు ఛాయపైనుండి మెల్లగా పాపపైకీ, కొద్ది ఎడంగా నిలబడిన ప్రభాకరం మీదికీ ప్రసరించాయి

'దగ్గరకు ర' మ్మన్నట్లుగా చేతితో ఛాయకు సూచించాడు.

బెదురుతూన్న చూపులతో, తడబడే అడుగులతో అతడి సమీపానికి చేరి నిలబడింది ఛాయ.

జనంలో కలకలం తారస్థాయి నందుకున్నది.

కారణం-అతడిన్ని రోజులుగా ఎవ్వరినీ చూచినదిగానీ, ఎవరితోనూ మాట్లాడినదిగానీ లేదు

స్వామి ఛాయను నిశ్చలదృష్టి పరికించి, శిశువును దయాపూరిత నేత్రలతో వీక్షించాడు.

అతడి ఫాల తలముపై ఏదో భావం

కదలిపోయింది. పిదప, శిశువు మస్తకంపై దక్షిణ హస్తముంచి ధీరగంభీరస్వరంతో "చిరంజీవినిగా వర్ధిల్లు. నీ జనని వలెనే విద్యావతివీ, విశాలహృదయినివీ, ఉత్తమ స్త్రీవి అగుదువుగాక!" అని ఆశీర్వదించాడు.

అతడికి మనఃపూర్వకంగా నమస్కరించి, కదలలేక కదలలేక కదలి, సాగిపోయింది ఛాయ స్వగృహానికి.

"అమ్మో అమ్మో, ఎవరితో మాటాడని సాములారు మా అమ్మగారితో మాట్లాడారు" అని గుండెలు బాదుకున్నది పైదమ్మ.

"ఆ పాపలో ఏమి దైవాంశమున్నదో! స్వామి మౌనంవదలి ఆశీర్వదించారు!" అని వింతగా చెప్పుకున్నారు జనం.

"ఆశ్చర్యంగానే వుందే ఎవరితో మాట్లాడని స్వామీజీ మనకు ఆశీర్వాదమీయడం!" అన్నాడు ప్రభాకరం తిరిగి వచ్చే దారిలో.

ఛాయ మాట్లాడలేదు.

"నీకు వింతగాలేదూ?" ప్రభాకరం రెట్టించాడు.

ఛాయ మెల్లగా అన్నది. "అతడు మన రమణ!"

"ఆ!!!"

"ఔను."

"ఎక్కడో చూచిన ముఖంలా అన్పించింది సుమా నాకు. అయితే గుర్తువచ్చింది కాదు. మరి అలా వదిలేశావేమిటి? ఛఛఛ. పాపం, మనయింటికి తీసుకువద్దాం."

ఆవేశంగా అంటూ వెనుదిరిగి వెళ్ళబోతూన్న అతడిని ఛాయ ఆపుచేసింది.

"ప్లీజ్, వద్దు, వదిలి వేయండి."

"ఛాయా! నువ్వేనా అలా మాట్లాడుతున్నావ్?"

"హుఁ. నేనే. కనీసం ఈ మార్గంలో నయినా ఆ దురదృష్ట జాతకుడికి మన శ్శాంతి లభించాలని కోరుకుందాం."

ఆ తరువాత ఆ స్వామీజీ ఆ వూరిలో గానీ, పరిసరాలలోగానీ ఎవ్వరికీ కన్పించ లేదు. అతడి విశేషాలుగానీ వివరాలుగానీ ఎవరికీ తెలియవు. (సమాప్తం)

[ఇందలి పాత్రలూ, సంఘటనలూ కేవలం కల్పితం. ఎవ్వరినీ ఉద్దేశించి వ్రాయబడలేదు.]

అంకితం
రమణీయ గుణసంపన్నుడు
శ్రీ కళ్యాణ చక్రవర్తి
చరణారవిందాలకు

—రచయిత్రి

దాహం

శివల జగన్నాథరావు



'ప్రపంచకం అంతా మండి పోతూందా? ఈ యిశాపట్నం వే ఇలా మండి పోతూందా?' అనుకున్నాడు బైరాగి. కుడిచేతిని కళ్ళకి ఎండదనరునించి అడ్డం పెట్టుకొని, రోడ్డుమీదికి వేళ్ళల్లోంచి చూస్తూ.

రోడ్డుమీద వాహనాలు ఎక్కువగా తిరగడంలేదు. మనుషులుకూడా అట్టే తిరగడంలేదు. ఆ మెయిన్ రోడ్డుకి ఇటూ అటూవున్న ఆడపిల్లలబళ్ళు సెలవ లిచ్చేసి మూసేసేరు. అంచేత అక్కడ బీటుకుర్రాళ్ళ నిలువుకొలువులుకూడా లేవిప్పుడు. సాయంత్రం బాగా చల్లబడ్డాక రోడ్డు కలకల్లాడాక వాళ్ళక్కడ చేరుతున్నారు, కొద్దిగా. ఆ జంక్షన్‌లో ఓవేపు కిళ్ళీబడ్డీ అప్పల్స్వామి బడ్డీలో కూచుని. అరకన్నుతో 'పుణ్యదినాలుగాని టైములో పూజారి గుళ్ళోంచి చూసేట్టు' ఎదురు చూస్తున్నాడు.

'అడికొట్లో సోడాకాయి లున్నాయి. రంగు నీళ్ళున్నాయి, మంచు ఏసినవి. ఆ దెంత అదృష్టవొంతుడూ! అనుకున్నాడు బైరాగి. అవి బాంకులో డబ్బులాగా బీరువాలో బట్టలాగా అనిపించి కావల్సినప్పుడు తీసుకు తాగుతాడు ఎంచక్కా'— అనుక్కున్నాడు.

బైరాగి నివాసం ఆ రోడ్డులో ఎత్తుసందు ఒకదాన్ని ఆనుకొనివున్న ఫ్రిజిడీరు షాపు పక్కన. అక్కడో చింత చెట్టుంది. అది కాయలు కాయకపోయినా, కొత్త పచ్చగా. దానికింద చేరినవాళ్ళకి

'నీడని - యివ్వటమే తనపని' అన్నట్టు, పిల్లల్ని తల్లిలా రక్షణ ఇస్తూంటుంది. బైరాగి చింతచెట్టుకింద చిరుగుల చాప ఒకటి వేస్కుని కూచుంటాడు. నడుముకి ముతకపంచె చుట్టుకుంటాడు. పక్కనే ఓ కఱ్ఱ. ఇంకా పింగాణీ ముంత, తప్పేలా, ఓ గుడ్డలమూటా, వుంటాయి. ఆ చుట్టుపక్కల మిషను కొట్లల్లో గుడ్డ పేలికల్ని అడుక్కుతెచ్చుకుని, అవన్నీ మూటగా కట్టి, తలకింద దిండుగా అమర్చుకుంటాడు పడుకున్నప్పుడు.

బైరాగి నెత్తిమీద పండు వెంట్రుకలు అతడి పరువం ఏనాడో పోయిందని చెబుతున్నాయి. అతనికి మునుపు పెళ్లాం, కూతురూ వుండేవారనే సంగతి అతడి కథని అడిగిన వాళ్ళకే తెలుస్తుందిగాని— అతనికో కాలు అవుడయిందన్న విషయం (రోడ్డుమీద బస్సు ప్రమాదంలో ...) అతన్నెవరూ అడగక్కర్లేకుండానే తెలిపి పోతుంది!

ఎండలోకి చూస్తూ నిట్టూర్చేడు బైరాగి. అప్పల్నాయిడి అతడికి ఎంతో ధనవంతుళ్ళా, అత్యవసరాల్ని అరనిముషంలో తీర్చగలిగే అమాత్యుడిలా కనిపిస్తున్నాడు! ఒక్కటంటే ఒక్క సోడా కాయి ఇస్తే బావుణ్నాడు!! గొంతుతడిపి, గుండె చల్లబడీ, తేటగా, సుకంగా వుంటాది!!

బైరాగి తనముందు నేలమీద పరిచిన గుడ్డలో 'దరమరాజులు' పడేసిన పైసాలు తీసి లెక్కపెట్టేడు. అవి మొత్తం ఆరే ఆరుపైసాలున్నాయి! ఎలా?? అప్పల్నాయిడి సోడాకాయిత్తాడా? ఎలా?

బైరాగి ఏదో ఆశతో నింపాదిగా లేచేడు, కఱ్ఱ పట్టుకుని. పైసాలు పిడికిట్లో పట్టుకున్నాడు! అప్పుడెవరో ఆ తన్న వెళుతూంటే పిలిచేడు జాలిగా, ఆర్ద్రతగా ...దరమం చేయమంటూ. ఆ ఆసామీ ఉలకలేదు. పలకలేదు. సరిగదా కాండ్రించి రోడ్డుమీద వూసి మరీ వెళ్ళిపోయేడు!! బైరాగి ఆ అవమానాన్ని పట్టించుకోలేదు. తన్లాంటివోల్లకలాంటియి అవమానాలుకావు! అవి లెక్కెట్టితే, నాటించుకుంటే బతకడం శానా కస్టం, మరి! అందుకని చూసీ చూణ్ణట్టుపోడ(వే! ఇంకా ఆశతో, కాంక్షతో ఇంకో ఆసామీని, మరో బాటసారిని అడిగాడు అర్థించేడు. వేడుకున్నాడు. ప్రార్థించేడు. ఉఁహూ. ఒక్కటంటే ఒక్కపైసా పుట్టలేదు, మరి!

బైరాగి ఈడ్చుకొంటూ కిళ్ళీబడ్డీ దగ్గరికి వెళ్ళాడు.

ఎండ ఎండ ఎండ!! ఎన్నికల్లో పార్టీవోళ్ళలా ఉధృతంగా వున్నది! పూర్వం రాక్షసరాజులు మునుల్ని, దరమాత్ముల్ని కాల్చుకుతిన్నట్టు కాల్చుకు తింటున్నది! తన్లాంటోళ్ళని దరిద్రంలా పట్టుకు పీడించుకుతింటున్నది!!

టకూ్కటకూ్క కఱ్ఱ కొట్టుకుంటూ బైరాగి అప్పల్నాయిడి కొట్టుని సమీపించేడు. ఆడు సోడాకాయివ్వడు అనితెల్సు. అయినా ఏదో ఆశ. దాహంతో గొంతు, నాళ్ళూ ఆర్చుకుపోతోన్న బాధలో. అప్పల్నాయిడిని దేబిరిస్తే ఏమో వాడు కనికరిస్తాడే(వోనని ఏమూలో కసింత కోరిక!! కోరిక ఎంత బలమైంది!! ఇదే గనక ఇంత పీడించుకు తినకపోతే మనిషి ఎవడిమట్టుకు వాడు మహారాజే!! ఎవణ్నీ

ఏదీ అడగడు! ప్రాధేయపడడు! అణిగి వుండడు! సేవలు చేయడు! వాడి పౌరుషాన్ని చంపుకోడు!!

ఎండ దాహంలావుంది! ఇదిపైనా, అది లోపలా ఆర్చుకుతింటున్నాయి! నెత్తిమాడిపోతోంది. అరికాళ్ళు కాలిపోతున్నాయి.

"బాబూ!"

పిలిచేడు అప్పల్స్వామిని. అప్పుడే చిన్న కునుకు తీయబోతున్న అప్పల్స్వామి త్రుళ్ళిపడ్డాడు. ఇటుచూసేడు. ఎవరో బేరగాడనుకున్నాడు. కాని .. పుట్టింటికి వెళ్ళిన అర్ధాంగి అవాళే వస్తుందని ఎదురుచూస్తోంటే అప్పులవారు తలుపు కొట్టి వచ్చినట్టు . అప్పల్స్వామికి ఆశాభంగమైంది. ఛర్రుమన్నాడు.

"ఏటీ? సరాసరిక్కడికే వొచ్చి పీక్కుతింటన్నావా? ఫో! ఫో!"

"గొంతారిపోతన్నాదయ్యా ..."

"అయితే నన్నేంటి సెయ్యమంటావ్?!"

"ఒక్క సోడాకాయ ."

"ఓహో!" వికటంగా నవ్వేడు అప్పల్స్వామి. "డబ్బులెత్తెచ్చేవేంది!"

బైరాగి అరచేతిలో పైసాలు చూపించేడు.

"ఎన్నవీ?"

"ఆరండి;"


అప్పల్స్వామి సింహం బల్లిని చూసినట్టు చూసేడు.

బైరాగి బ్రతిమాలేడు అప్పల్స్వామిని. సోడాకాయిచ్చి పుణ్యం కట్టుకోమన్నాడు. తర్వాత అడుక్కున్న డబ్బులు ఇచ్చేసి ఆ బాకీ తీర్చేస్తానన్నాడు. ఏమన్నా అప్పల్స్వామి వినిపించుకోలేదు.

"పోరా ఫోఫో! జాలిపడ్తే గోతిలో పడతాంరా మేం! వ్యాపారం అడుక్కుతిన్నట్టే ఇంకప్పుడు. ."

బైరాగి విస్పృహతో కర్ర కొట్టుకుంటూ, ఆ పక్కన కాస్త నీడవుంటే అక్కడికి వెళ్ళి నుంచున్నాడు. ఎండ.... దాహం! గొడ్డు... ఒగర్పు! తాపం ... శోష! దాహం దాహం! ఇదెంత శక్తి గలదీ?! దీనికెంత బలవుందీ?!

చిన్నతనం జ్ఞాపకం వచ్చింది బైరాగికి. తండ్రీ తల్లీ ఎలా వుండేవాళ్ళో తెలీకుండా, గాలికీ, ధూళికీ పెరిగి, అడుక్కున్న అన్నంతో వొళ్ళు పెంచుకొని తిరిగే బైరాగి! ఎవరో ఓ దర్మాత్ముడు తనింట్లో పన్లు చెయ్యమన్నాడు. తిండి, గుడ్డముక్క ఇస్తానన్నాడు. సంతోషంగా వొప్పుకున్నాడు బైరాగి. ఆ ఇంట్లో నీళ్ళు పట్టడం, ఇల్లు వూడ్చడం, సర్దడం, బట్టలు ఉతకడం, బజారుపని, అన్నీ చేసేవోడు. ఇంకో చింతా, చికాకూ లేకుండా రోజులు దొర్లిపోతూంటే ... ఓ మార్పు మబ్బులా వొచ్చిపడ్డది!! తన్నికమ్మేసింది! వారింట్లో పాచిపని చేసే రంగిమీద తన కళ్ళు పడినయ్యి! అప్పుడు తనకి వయసు వచ్చింది. మీసం వచ్చింది. కండలు గట్టిపడినాయి. ఒంట్లో నెత్తురు వేడి ఎక్కుతోంది. రంగి మాంచి యవ్వనంలో వున్నది. దాని అవయవాల్లో పొంకం, బింకం తన కళ్ళల్లో కామాన్ని. కుంపట్లో నిప్పుని విసినకర్ర రేపినట్టు రేపేయి!! ఓ మధ్యాన్నం ఆ ఇంటివారంతా సిన్మాకి వెళ్ళేరు. పనిదివొస్తే గిన్నెలు పడవేసి, తోమిన గిన్నెలు



లేసిపోతే అది....వయసులోవున్న గుంట పైగా దానికీ నీ పోలికే వొచ్చినాది. మగదాహం పట్టుకున్నాద్దానికి!! వొగలూ, వొయ్యారాలూ నావయినాయి! ఇంట్లో వుండేదికాదు! ఎటెటో తిరిగొచ్చేది! అలా తిరిగి తిరిగి ఆఖరికి ఎటో వుడాయించీపింది! మాంసెప్పే మాటలు దానిసెవుల్లో సద్దేగదా!!

సంసారం చిందరవందరయిపోడంతో, ఇంక సంపాదనమీద, బతుకుమీద, అన్నింటిమీదా కోరికలు వచ్చిపోయేయి!! రిక్షా వొదిలీసేడు. ఆ ఇల్లు వొదిలీసేడు. ఆ వూరే వొదిలీసేడు. అసలు చచ్చిపోదావనుకున్నాడు. రెండు మార్లు వురేసొక్కోబోయేడు! కాని ప్రాణం - దాని పిగదరగా! సెడ్డతీపిది!! సావనియ్యనేదు!! ప్రమాదం జరిగినప్పుడైనా ప్రాణం పోలేదు! దొరికినచోట.... ఎవరో ఇంత ముద్దపెట్టినప్పుడు తింటున్నాడు. క్రమంగా ఇలాగ....ఈ బతుక్కి అలవాటయిపోయేడు. ఇందులోకి ది దానికి గవురవం, అబిమానం అడ్డ రావడమన్న గొడబేనేదు తనకి వేదాంతం, వయిరాగ్యం ఈ తోవలో మళ్ళించీసేయి!....

* * *

బైరాగి బుర్ర ఆలోచనల్తో అలిసిపోయింది పూర్తిగా. కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. నేలేదో, నింగేదో ఆనటంలేదు! వొళ్లు తూలుతోంది. నోరు పూర్తిగా ఎండిపోయింది. దాహం దాహం....అప్పుడెప్పుడో వాంఛలా . బలంగా, శత్రువులా, శరీరంలో నవనాడుల్లోకు స్తీపట్టి, చిత్తుచేసేసింది.

ఆ మధ్యాహ్నం. ఆ ఎండలో నడిరోడ్డు పక్కన, ఓ బడుగుజీవి దాహంతో గిల గిల కొట్టుకుని, ఢబ్బుమని నేలన పడి. ప్రాణాన్ని గాల్లోకి వదిలేసింది. □

వారసత్వం

'వాణిశ్రీ'

గూళ్ళకు చేరుకుంటున్న పక్షుల కిల కిలా రవాలు, ఇళ్ళకు మళ్ళిన ఎద్దుల మెడల్లోని చిరుగంటల మోత, పాలేర్ల అదిలింపులూ వింటూ కూర్చుంది అన్నపూర్ణ.

"ఎన్నాళ్ళు సాగించుకుంటాడని చూస్తూ వూరుకుంటే నువ్వూ, నీ పిల్లలూ అడుక్కు తినాలి! ఇలా పెడదారిన పోయిన వాళ్ళెవరూ బాగుపడగా నేను వినలేదు" అన్నాడు సీతయ్య కోపంగా.

సీతయ్య మాటలు విని మట్టిబొమ్మలా మాటా పలుకూ లేకుండా కూర్చుండి పోయింది ఆమె.

"అనిల్ రేపు వస్తాడా?" సీతయ్యే అన్నాడు.

"వచ్చేస్తాడు. పరీక్షలు ఈ రోజు అయిపోతాయని జాబు రాశాడు" అం


"సరే అయితే. వాడొచ్చాక కబు పెట్టు. నే వెళ్తా. చీకటి పడుతోంది. అంటూ లేచాడు సీతయ్య.

"ఇంతలోకే వెళ్ళడం ఎం కన్నయ్యా! రేపు వాడు వస్తాడుగా. అంది.

"కాదులే, రేపు మిరపతోటకి మం కొట్టించాలి. దగ్గరుంటేగాని కుదర నా మాట విని ఇక వాడి చదు మాన్పించు."

క్షణంసేపు భయంగా సీతయ్య క లోకి చూసింది అన్నపూర్ణ.

"మధ్యలోనా?" అంది నెమ్మదిగా.



'ఏం అయితే ఈ ఏటితో అయ్యేదా? పెట్టేదా? ఇంకా మూడేళ్లు చదివితేగాని బి ఏ పూర్తిగాదు ఈలోపలే అంతా మునిగిపోవడం ఖాయం" పొగాకు కాడతో చుట్ట చుట్టుకుంటూ అన్నాడు సీతయ్య

ఇక్కడవుండి వాడేం చేస్తాడు?'

ఆమె మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా సీతయ్యతో నెమ్మదిగా అంది

'ఏంచేసినా వాడితోనే చేయించాలి లేకపోతే ఏమీ దక్కదు నువ్వు వూరుకో నేను చెప్పినట్లు విను అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాగా!


సీతయ్య మాటల్లోని నిగూఢార్థం ఆమెకు అర్థమైంది

కాని అందరూ ఏమనుకుంటారో బెరుకుగా అంది

"ఎవరమ్మా ఆ అందరూ? అనుకుంటే అనుకోనీ. నీ సంసారం నాశనమైపోతూ వుంటే ఎవరైనా ఆదుకుంటున్నారా? రేపెవరైనా ఒకపూట అన్నం పెడతారా? ఈ లోకంలో అందరూ స్వార్థపరులే. ఎవరైనా పాడైపోతూవుంటే లోలోపల సంతోషించి పైకి విచారం నటిస్తారు. ఒకళ్ళేమనుకుంటారో ననుకుంటే మనం ఏమీ చేయలేం" తీవ్రంగా అన్నాడు సీతయ్య.

గోదావరి వరదలా ఉప్పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి చేత్తో నోరు నొక్కుకుంది ఆమె.

కాళ్ళకేదో బంధం పడినవాడిలా ఆగి పోయాడు సీతయ్య. చెల్లెలి ఏడుపు అతన్ని కదలనివ్వలేదు



"ఊరుకో అమ్మా! ఏంచేస్తాం? వాడి జన్మ అలా రాసిపెట్టివుంది...." అన్నాడు. సీతయ్య కంఠంలో ఆత్మీయత వెల్లి విరిసింది.

"చివరకు నా బ్రతుకు వీధిలోపడింది అన్నయ్యా!..." ఏడుస్తూ అన్నది ఆమె.

చెల్లెలి మాటల్లోని ఆవేదన, ఆక్రోశం సీతయ్య గుండెల్ని కదిలించింది. భరించ లేని వాడిలా గబ, గబా అడుగులు వేసు కుంటూ వెళ్ళిపోయాడు.

కొంగుతో కళ్లు తుడుచుకుని వెళ్ళి పోతున్న సీతయ్యను చూస్తూ వీధి

గుమ్మంలో నిల్చుంది అతను కను చూపుకు అందనంతదూరం వెళ్ళిపోగానే ఆమె శూన్యంలోకి చూస్తూ శిలలా వుండి పోయింది.

'ఏంచేసినా వాడితోనే చేయించాలి' సీతయ్య మాటలు చెవులో మారు మ్రోగు తున్నాయి.

సీతయ్య మాటలు ఆమెలో ఒక ఆశా జ్యోతిని వెలిగించాయి. నిరాశ అనే అంధకారంలో అనిల్ మినుకు మినుకు మంటూ ఒక కాంతి కిరణంలా కన్పిం చాడు.

ఆమె దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడి చింది. సీతయ్య రాకముందు గుమ్మడి కాయలా కనిపించిన సమస్య క్షణంలో గురివింద గింజంత చిన్నదై పోయినట్లని పించింది.

* * *

అప్పుడే తలంటు స్నానంచేసి బట్టలు కట్టుకుంటున్న అనిల్ కి సీతయ్య మాటలు వినిపించాయి. సంతోషంతో అతని హృదయం పొంగిపోయింది. చిన్నప్పటి నుంచి మావయ్యంటే ఎంతో ఆపేక్ష వాడికి.

"మావయ్యా! ఎప్పుడొచ్చావ్?" అన్నాడు వస్తూనే.

పడక్కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చు కుంటున్న సీతయ్య మేనల్లుడిని చూసి చిరునవ్వు నవ్వి "ఇప్పుడే" అన్నాడు.

వేడి, వేడిగా వున్న గారెలు పళ్ళెం నిండా తెచ్చి సీతయ్య చేతికిచ్చింది అన్నపూర్ణ.

"అత్తయ్య బాగుందా? సుబ్బులు బడికి వెళ్తోందా? సీనుగాడు బాగా అల్లరి చేస్తున్నాడా? అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు అనిల్

"అంతా బాగానే వున్నారు. నిన్నోక సారి తీసుకురమ్మందిరా మీ అత్తయ్య. పద. నాలుగురోజులు వుండి వద్దువు గాని " అన్నాడు సీతయ్య.

అన్నపూర్ణ వంట గదిలోనుంచి వచ్చి కొడుకు చేతికి గారెల పళ్ళెం ఇచ్చింది.

"ఈ రోజు గూడా బావ రాలేదా?" అన్నాడు సీతయ్య చెల్లెల్ని వుద్దేశించి.

అన్నపూర్ణ ముఖంలో కారు మబ్బులు తొంగిచూశాయి. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూ వుంటే చెంగుతో కళ్ళు తుడుచుకుని సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది.

"చూశావురా అనిల్. సంక్రాంతి పండగ గదా. ఈ రోజుగూడా మీ నాన్న ఇంటికి రాలేదు. అది రానివ్వలేదేమో?" అన్నాడు సీతయ్య.

అనిల్ మావయ్య ముఖంలోకి ఒక్క సారి చూసి తల దించుకున్నాడు. ఏం మాట్లాడాలో అతనికి అర్థంకాలేదు.

"పరిస్థితుల్ని అర్థంచేసుకునే శక్తి మీ నాన్నకు లేదిప్పుడు. వాడి మెదడులో బంకమన్ను పేరుకుపోయిందిరా. చూశా వుగా మీ అమ్మ కుమిలి, కుమిలి కృశించి పోతూవుంది. నువ్వే ఏదో మార్గం చూడాలి." అన్నాడు సీతయ్య.

"నేనేం చెయ్యను మావయ్యా?" విచారంగా అన్నాడు అనిల్.

"నేను చెప్పినట్లు చేస్తే చాలు."

"చెప్పు."

"ముందు చదువు మానెయ్యాలి నువ్వు. కావాలంటే తర్వాత మళ్ళీ ఎప్పు డైనా చదువుకోవచ్చు."

"ఆఁ ." అన్నాడు అనిల్.

ఆశ్చర్యం వాడి కళ్ళల్లో ప్రతిఫలించింది.

"ఎందుకూ?" అన్నాడు తర్వాత.

"పరిస్థితులు బాగా లేవురా. ఇప్పటికే పూళ్ళో పాతికవేల దాకా అప్పులు చేశాడు మీ నాన్న. దానిమీద వడ్డీ పాపంలా పెరిగిపోతోంది రైస్మిల్లు బాగానే నడుస్తున్నా, దానిమీద వచ్చే ఆదాయం చాలటంలేదు మీ నాన్నకు. నలుగుర్నీ పోగేసుకుని తాగి, తందనాలాడుతున్నాడు. ఆ మీనాక్షి నగలకనీ, చీరలకనీ దోచిపెడుతున్నాడు. ఇరవై నాలుగు గంటలూ దాని కొంపలోనే మకాం. రైస్‌మిల్లు మేనేజర్ రామాచారి అద్దూ, అపూ లేకుండా దిగమింగుతూ బాగుపడిపోతున్నాడు. మొన్నీ మధ్య ఇంటికివచ్చి మీ అమ్మ పేరుతోవున్న పొలం అమ్మేసెయ్యమనీ, నగలు ఇవ్వమనీ గొడవ చేశాడట. మీ అమ్మ నాకు కబురుచేసింది. నేను వచ్చి నాలుగు జాడించి పోయాను. అదుగో! అప్పటి నుంచి ఇంటి మొగం చూడటం లేదు."

సీతయ్య మాట్లాడే ఒక్కొక్క మాటా ఒక్కొక్క తుపాకీ గుండులా గుండెలకి తగిలింది.

విలాసంగా పడవలో షికారు చేస్తున్న వాడిని ఎవరో నదిలోకి నెట్టగా సుడి గుండంలో పడి గిర గిరా తిరుగుతున్నట్లు వుక్కిరి, బిక్కిరై పోయాడు.

"ఇక నువ్వే ఈ ఇంటికి దిక్కు. మీ నాన్న అట కట్టించకపోతే చిల్లిగవ్వ దక్కనివ్వడు. దిగులులో మీ అమ్మ ఎక్కువ రోజులు బ్రతకదు."



"సార్! ఒక్కసారి ఫోను కావాలి? ఇస్తారా?" పక్కింటతను సారధిని అడిగిన ప్రశ్న ఇది.

"విత్ ప్లెజర్!" జవాబిచ్చాడు సారధి.

మర్నాడు—

"సార్ - ఒక్కసారి ఫోను అవసరముంది!"

"ష్యూర్." సారధి జవాబు.

ఆ మర్నాడు—

"సార్ ఫోన్ చేయాలి ..."

"తీసుకోండి."

రెండ్రోజుల తర్వాత—

"ఏమండీ ఫోను తీసుకుంటా!"

"సరే ...తీసుకోండి."

ఆ మర్నాడు—

"ఏమండీ ఫోన్ చేయాలి."

"విత్ ప్లెజర్!" సారధి జవాబు.

"తాళం వేసుందండీ!"

"అయ్యో-ఆవిడ బజారుకు వెళుతూ వెంటబెట్టుకొని వెళ్ళిపోయిందే."

—పినిశెట్టి శ్రీనివాస్

సీతయ్య తలెత్తి వ్యధిత కంఠంతో అంటూవుంటే అనిల్ గుండెల్ని పిండినట్లు బాధ పడ్డాడు.

'చెప్పు మావయ్యా! ఏం చేయాలి నేను అమ్మకోసం ఏమైనా చేస్తాను' బాధతో, ఆవేశంగా అన్నాడు అనిల్.

* * *

ఆరాత్రి—

అన్నపూర్ణ పడుకుందేగాని ఆమెకు అవ్యక్తమైన ఆందోళనతో, ఆవేదనతో నిద్రపట్టడంలేదు.

ఇంతలో తలుపు కొట్టినచప్పుడయింది.

ఆమె గడియ తీసింది.

అతను శివరావు.

కందగడ్డలా ఎర్రబడివున్నాయి కళ్ళు. తాగినమత్తులో తూలుతున్నాడు. కోపంతో అతని ముఖం మండిపోతోంది.

ఆమె ఏ రాక్షసుడో తరుముకుని వస్తున్నదానిలా లోపలికి వెళ్ళిపోయింది.

శివరావు ఆమెను అనుసరిస్తూ "నీ కొడుకు ఏం చేశాడో తెలుసా?" కోపంతో ఒక్కొక్కమాటే అన్నాడు.

"తెలుసు!" బాణంలా సూటిగావచ్చింది సమాధానం.

"ఇదంతా నీ అన్నచేసిన కుట్ర. వాడే దగ్గరుండి చేయించాడు."

"అవును."

"అయితే నీకూ తెలుసన్నమాట. నువ్వూ నామీద కత్తిగట్టావన్నమాట. మొగుడినన్న గౌరవం లేదేనీకు. పసివాడిని నామీదకు వుసిగొల్పుతావా. నా మిల్లు, నాడబ్బు. నా ఇష్టం .." తడబడుతూ మత్తులో అంటున్నాడు.

అవమానం, ఆవేశం, కోపంతో వుక్కిరిబిక్కిరై పోయాడు శివరావు.

అతన్ని చూస్తుంటే ఆమెకు భయం కలగటంలేదు. జుగుప్స కలిగింది.

'ఇంకెంతకాలం చూస్తూ వూరుకుంటారు ఎవరైనా? ఇప్పటికే అంతా నాశనమైపోయింది."

క్షణంసేపు ఆమె చూపుల్లోని మంటల్ని చూసి తడబడ్డాడు.

తర్వాత విజృంభించాడు.

"ఏమిటీ నేను నాశనం చేసింది? నా సుఖం కోసం కొంచెం తాగుతున్నాను. నా ఆనందంకోసం ఒక ఆడమనిషిని పోషిస్తున్నాను. అది తప్పా? ఈ లోకంలో ఎందరు ఆ పని చెయ్యడం లేదు. అదొక నేరంకింద జమకట్టి నా పరువు బజారు పాలుచేస్తారా? నువ్వూ నీ అన్న కలిసి నా కొడుకునే నా మీదకు పంపిస్తారా? ...ఛీ..." ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"హూఁ-పరువు. అది ఇన్నాళ్ళూ నిలిచివుందా. ఎప్పుడో మంటగలిపింది ఇప్పటివరకూ జరిగింది చాలు." మిల్లు వ్యవహారాలు, పొలం పనులు మాత్రం రేపటినుంచి అబ్బాయే చూసుకుంటాడు ఆమె విసురుగా అతని చేతిని తీసి విసిరికొట్టింది.

"అన్నపూర్ణా! " తుపాకీ గుండు దెబ్బతిన్న మనిషిలా అన్నాడు.

"అవును. అన్నపూర్ణనే."

ఆత్మవిశ్వాసంతో వుట్టిపడుతున్న అన్నపూర్ణ ముందు అల్పత్వంతో క్రుంగిపోయాడు శివరావు.

గతించిన జీవితం కళ్ళముందు మసకమసకగా కదిలిపోతోంది.

శివరావుకి అంతా అయోమయంగా వుంది.ఎందుకో తనమీద తనకే అసహ్యం కలిగింది. 'తన భార్య తనని ఎదిరించి

మాట్లాడుతోంది. తన కొడుకు తనను లెక్క చెయ్యకుండా మిల్లు స్వాధీనం చేసుకున్నాడు. తన బావమర్ది తనను నీచంగా చూస్తున్నాడు. ఛీ.. ఛీ... వీళ్ళంతా తనపాలిట శత్రువులు. తన సుఖాన్ని, తన ఆనందాన్ని చూసి ఏడ్చి ఛస్తున్నారు.'

దెయ్యం పట్టిన వాడిలా వూగిపోతూ శివరావు ఆమె జుట్టు పట్టుకుని వంగదీసి నాలుగు గుద్దులు గుద్దాడు.

అన్నపూర్ణ ఏడుస్తూ ఒక మూలకుపడి పోయింది. కాలిలో బలంకొద్దీ తన్నాడు.

ఆమె చేతి గాజులు గల గలా శబ్దం చేస్తూ రాలిపోయాయి. కుంకుమ చెదిరి పోయి ముఖమంతా ఎర్రగా అలుముకు పోయింది.

"నాన్నా! " అంటూ వచ్చి అనిల్ తండ్రికి అడ్డం వెళ్ళాడు.

సీతయ్య గుమ్మంలో నిల్చున్నాడు. అతని కళ్ళల్లోనుంచి మంటలు కురిశాయి.

శివరావు గూడా సీతయ్యని కోపంగా చూశాడు.

చూపులతోనే మాడ్చి, మసి చేసుకు నేంత తీవ్రంగా ఒకరి నొకరు చూసు కున్నారు.

"ఛీ... నీ బతుకు బండలుగాను. ఆడ దానిమీద చెయ్యి చేసుకుంటున్నావా? దాని మొఖం చూసి వూరుకుంటున్నాను గాని లేకపోతే నీ నెత్తురు కళ్ళజూచి వుండే వాడిని." పట, పట పళ్ళు కొరుకుతూ అన్నాడు సీతయ్య.

ఏడిశావ్‌లే నోర్ముయ్ ఇక్కడెవరూ గాజులు తొడిగించుకుని లేరు అసలు నీ అలుసు చూసుకుని గదూ ఇది ఇంతకు



సారధి ఇంట్లోకి అడుగు పెడుతూ

"డార్లింగ్ రాధా! కమాన్ - ఏమేం కాయగూరలు తెచ్చానో చూడు."

పదేళ్ళ తర్వాత!

"రాధా! ఈ కాయగూరలు సంచి అందుకుంటావూ!"

మరో పదేళ్ళ తర్వాత!!

"ఒసేవ్-ఈ కూరల సంచి తీస్కో."

మరో పదేళ్ళు గడిచిన తర్వాత!!!

"ఒసేవ్ - వంటగదిలో ఎక్కడ తగ లడ్డావే-ఈ కూరల సంచి కాస్త తీసుకొని ఏడువ్!''

—పినిశెట్టి శ్రీనివాస్

తెగించింది. సిగ్గులేకపోతేసరి. నా సంసారంలో నువ్వెందుకు తలదూర్చడం." అన్నాడు శివరావు, సీతయ్యమీద మండి పడుతూ.

శివరావు, సీతయ్య ప్రత్యర్థుల్లాగా ఎదురెదురుగా నిలబడి వురిమి, వురిమి చూసుకుంటున్నారు ఇద్దరిమధ్యా అనిల్ వున్నాడు వాడికి భయం వేసింది ఇద్దరూ కొట్టుకుంటారేమోనని

"నువ్వా రుకో మావయ్యా! ...."
అంటూ సీతయ్య చేతిని పట్టుకుని లోప లకు తీసుకెళ్ళాడు అనిల్.

శివరావు కోపంతో బుసలు కొడుతూ పడక గదిలోకి వెళ్ళి పందిరి మంచం ఎక్కి పడుకున్నాడు.

అన్నపూర్ణ ఏడుపూ, వెక్కిళ్ళూ విని ఎస్తున్నాయి.

*　*　*

అర్ధరాత్రి శివరావుకి మెలకువ వచ్చింది.

చుట్టూ చీకటిగా వుంది.

మధళి హాలులో కిరసనాయిలు బుడ్డి మినుకు, మినుకుమంటూ వెలుగుతోంది.

అందరూ గాఢ నిద్రలో వున్నారు.

శివరావుకి దాహం వేసింది. వంట గదిలోకి వెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చి పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు కాని నిద్ర పట్టడంలేదు.

ఆలోచనలు ముసురుకున్నాయి.

ఎంత పని జరిగిందీ? ఇలా జరుగు తుందని తను కలలోగూడా వూహించ లేదు.

తన పరువు మంట గలిపిపోయింది గదా! రేపటినుంచి తనను ఎవరు లెక్క చేస్తారు! వూరినిండా అప్పులు. పొలం అన్నపూర్ణ పేరవుంద. మిల్లు కొడుకు స్వయంగా చూసుకుంటాడు. ఈ విషయం వూరంతా తెలిసిపోయింది. అప్పులవాళ్లు ఇక ఒత్తిడిచేస్తారు. అప్పులు తీర్చే దెలా? అసలు రోజులు గడిచేది ఎలా? మీనాక్షిని పోషించేది ఎలా? ఛీ....పాడు జన్మ వున్నట్లుండి ఇలా జరిగిందేమిటి ఇదంతా ఆ సీతయ్యగాడి పన్నాగం దొంగముండాకొడుకు. తనపాలిట శనిలా దాపురించాడు. ఇప్పుడేం చెయ్యాలి?

శివరావు తీవ్రంగా ఆలోచిస్తూ పడు కున్నాడు.

*　*　*

సీతయ్య, అనిల్ ఇంకా నిద్ర లేవనే లేదు.

అన్నపూర్ణ లేచి కసువు వూడ్చి కళ్ళాపిజల్లి గదిలోకి వెళ్ళింది. ముగ్గుబుట్ట తెస్తూ పడక గదిలోకి తొంగిచూస్తే శివరావు లేడు. —

ఏ అర్ధరాత్రి లేచి వెళ్ళిపోయాడో అనుకుని దీర్ఘంగా నిట్టూర్చింది.

ఆమెకు ఏదో అనుమానం వచ్చి చూసుకుంటే బొడ్లో దోపుకున్న తాళాల గుత్తి లేదు.

బీరువాకి వ్రేలాడుతూ కన్పించాయి

తెరిచి చూసేసరికి ఇంకేముంది, నగలు మాయమైపోయాయి. వడ్డాణం, కసుం పేరు, రెండు పేటల చంద్రహారం నాగరం, నాలుగు జతల గాజులు ...

అన్నపూర్ణ పెద్దగా రోదిస్తూ అక్కడే కూలబడిపోయింది.

ఆమె ఏడుపువిని సీతయ్య, అనిల్ నిద్రలేచి కంగారుగా వచ్చారు.

నగలుపోయిన సంగతి తెలుసుకుని సీతయ్య నిద్ర కళ్ళతోనే వురుకులు పరు గులతో మీనాక్షి ఇంటికి వెళ్ళాడు.

కాని ఆ ఇంటికి తాళం పెట్టివుంది

*　*　*

కాల గర్భంలో పదిహేను సంవత్స రాలు లీనమైపోయాయి___

ఆ రోజు___

శివరావు రైలు దిగాడు



ఊరు స్టేషన్‌కి రెండుమైళ్ళ దూరంలో వుంది.

చంద్రుడు లేని ఆకాశం వెండి జరీ చీరలా తళ, తళ లాడుతోంది.

మెల్లగా, మృదువుగా పైరుగాలి తాకింది.

శివరావు నెమ్మదిగా అడుగులువేశాడు.

రోడ్డు ప్రక్కన చెట్లగుబురులు మనుషుల గుంపుల్లా నిలబడి అతన్ని పరిహసిస్తున్నట్లుగా తోచింది.

ఆకాశంలోని నక్షత్రాలు శివరావుకేసి వురిమి, వురిమి చూస్తున్నట్లుగా అనిపించింది.

అతన్ని దాటుకుని కొందరు ముందుకు వెళ్ళిపోయారు.

కొందరు అతనికి తెలిసినవారే. శివరావు వాళ్ళని పలకరించలేదు. వాళ్ళు శివరావుని చూసి గుర్తించలేదు.

శివరావు ఇప్పుడు గుర్తించలేనంతగా మారిపోయాడు చిక్కి శల్యమయ్యాడు కనుగుడ్లు లోపలిక పీక్కుపోయి కళ్ళ క్రింద ఎముకలు ముందుకు తోసుకొచ్చాయి. మొఖంలో ఏమాత్రం కళా కాంతులు లేవు.

స్టేషన్ దూరమైంది.

ఇప్పుడు జీవితం చివరిదశలో వున్నాడు శివరావు.

పాత కోరికలన్నీ చచ్చిపోయాయి.

కొత్త కోరిక ఒకటి మొలకెత్తింది.

చివరిరోజుల్లో కొడుకు దగ్గిర గడిపి, వాడి చేతిలో ప్రాణాలు వదలాలి. అని అతని కోరిక.

నడి సముద్రంలో వదిలి వెళ్ళిపోయినందుకు కొడుకు తనను ఆదరిస్తాడా లేదా? అనే అనుమానం అతనికిలేదు. తప్పకుండా చేరదీస్తాడనే నమ్మకంవుంది. వాడు బుద్ధిమంతుడు, గుణవంతుడు.

అన్నపూర్ణ ఎలావుందో? దానికేం? తను లేడనే బాధతప్ప కొదవేముంది? ధర్మరాజులాంటి కొడుకు. అన్నకూతురే

కోడలు పిల్లా పాపలతో కాలక్షేపం చేస్తూ సుఖంగానే కాలం గడుపుతూ వుంటుంది

ఇన్నేళ్ళ తర్వాత వచ్చిన తనను చూసి ఎంత ఆశ్చర్యపోతుందో? భార్య మీద ఎప్పుడో చచ్చిపోయిన ప్రేమాభిమానాలు ఒక్కసారిగా జీవం పోసుకున్నాయి.

ఎక్కడో నక్కవూళ వేస్తోంది.

కీచురాళ్ళు రొదపెడుతున్నాయి.

ఊరు దగ్గిర పడింది.

నెమ్మదిగా ఇల్లు చేరాడు.

ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి.

శివరావు ఆగిపోయాడు.

"ఇంత రాత్రిపూట రాకపోతేనేం! ఇప్పటికి కదలనిచ్చింది కాబోలు ఆ మహాతల్లి." మొగుడిమీద కేకలు వేస్తోంది సుబ్బలక్ష్మి.

"నోర్ముయ్యవే. వస్తే వచ్చాననిఏడుస్తావ్. రాకపోతే రాలేదని ఏడుస్తావ్. నీ కోసం రాలేదులే. పిల్లలకోసం వచ్చాను." తడబడుతున్న మాటలతో మత్తుగా అంటున్నాడు అనిల్.

"ఆఁ పిల్లలమీద ప్రేమ కారిపోతోంది. పిల్లలట. పిల్లలు ఎవరైనా వింటే మొఖాన వుమ్మివేస్తారు." సుబ్బలక్ష్మి రెచ్చిపోయింది.

వూరికే పేలకు, చంపేస్తాను."

"చంపేసెయ్ నన్నూ పిల్లల్నీ గూడా పీకపిసికి చంపు పీడ విరగడైపోతుంది అయ్య దేశాలు పట్టిపోయాడు ఇక కొడుకేమో పెళ్ళాం పిల్లల్నిచంపి జైలుకు పోతాడు. అసలు మీ వంశమే ముద నష్టపువంశం. మానాన్న పిచ్చివాడై నన్నిచ్చి పెళ్ళిచేసి నా గొంతుకోసి చచ్చాడు." సుబ్బలక్ష్మి గట్టిగా కేకలు వేసింది.

"ఏమిటే లం ...! కూస్తున్నావ్!"

అనిల్ ఆమె జుట్టుపట్టుకుని వంగదీసి గుద్దుతున్నాడు.

సుబ్బలక్ష్మి పెద్దగా ఏడుస్తోంది.

అన్నపూర్ణవచ్చి "ఎందుకురా దాన్నలా చంపుతున్నావ్ ఛీ .. ఛీ . .ఇది కొంప కాదు. నరకమైపోయింది. లోకంలో ఇంతమంది చస్తున్నారుగాని నాకు చావు రావడంలేదు. ఆపోయినవాడు నా నగవు తీసుకుపొయ్యాడు. గాని పీకపిసికిగూడా పోతే బాగుండేది...."అని విసుక్కుంటూ కోడల్ని లోపలికి తీసుకెళ్ళింది.

శివరావు కాళ్ళు ముందుకు పడలేదు.

శరీరం బరువెక్కిపోయింది.

ఒక్కొక్క అడుగే వేసుకుంటూ రైలు స్టేషన్ వైపుకు దారితీశాడు.

అతని చుట్టూ నల్లటి చీకటి.

ఆ చీకట్లో అతను మునిగిపోయి నట్లుగా కన్పించకుండా కరిగిపోయాడు.□

ఉమను చూశాడు. మెరుపును చూసి నట్లు శంకర్ కళ్ళు జిగేల్‌మన్నాయి. గుండె దడదడలాడింది. ఆమె అందానికి పరవశించిపోతూ ఆమెవెంట నడిచాడు.

ఉమ వెనకాలే శంకర్ ఆ యింట ప్రవేశించాడు.

అది రెండుగదుల ఇల్లు. పొగచూరిన గోడలు విరిగిపోయిన కుర్చీ బిల్ల ఆ యింటి పేదతనాన్ని చాటుతున్నాయి. సంపాదనకు మించిన కుటుంబ సభ్యులు ఇంటి నిండుగా వున్నారు. అపురూప సౌందర్యవతి శాపవశాన ఆ ఇంట పుట్టింది. ఆ పేదరికంనుంచి ఆమెను విముక్తిచేయా లన్న తపన కలిగింది.

మాసిపోయిన పాతకాలం కుర్చీలో పడుకున్న ఆ ఇంటి యజమానితో ఏమీ సంకోచము లేకుండా 'ఉమను నేను చేసు కుంటాను' అని చెప్పాడు. తన చదువు, చేస్తున్న వ్యాపారం, తండ్రి గురించి అన్నీ చెప్పాడు.

ఉమ నాన్న ఆలోచించను భయ పడ్డాడు. ఏమి కానున్నదో అది కాక మానదు మొదటిసారిగ వచ్చిన అవకా శాన్ని వదలదలచుకోలేదు. కూతురిపెళ్ళి ఎలా చేయాలా? అన్న బాధకుతోడు అంద మైన కూతుర్ని ఎలా కాపాడుకోవాలో తెలిసేదికాదు. వెకిలివాళ్ళు, రౌడీలు ఇంటి ముందు తిరిగేవారు. అది మరీ బాధగా పరిణమించింది.

శంకర్ అడిగిందే చాలన్నట్లుగా గుట్టుగ గుళ్ళో పెళ్ళిచేసి ఉమను అతనితో పంపించి తేలిగ్గా నిట్టూర్చాడు ఉమ నాన్న గారు.

సమాప్తం

మనం కోరుకొనే మంచి సమాజం
కోసం
ఛాందసభావాలు వదిలి మార్పును
ఆహ్వానించాలి
పరిష్కారంకాని సమస్యకు పూర్తి
పరిష్కారం లభించేవరకూ
మళ్ళీ మళ్ళీ ఆ సమస్యలు గుర్తు
చేసుకొంటూనే ఉండాలి
ఆ సమస్యా పరిష్కారానికి ప్రయత్నం
జరుపుతూనే ఉండాలి

చిట్టారెడ్డి
సూర్యకుమారి

పరువు-ప్రతిష్టలను పట్టుకు వ్రేలాడే తలితండ్రులకు పెద్దకొడుకు శంకర్. తాను అనుకున్నది చేసి చూపించేవాడు. అలాగే తనకు నచ్చిన అమ్మాయిని చేసుకోటానికి వెనుకాడలేదు. ధైర్యంగా భార్యను వెంటబెట్టుకుని నేరుగ ఇంటికివచ్చి 'ఉమ'ను తల్లికి తండ్రికి పరిచయం చేశాడు.

వ్యాపారానికి వెళ్ళిన కొడుకు, అమ్మా! పెళ్ళిచేసుకొని వచ్చాను. ఇదిగో నాభార్య. అని చెపుతుంటే ఆశ్చర్యంగ నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తూండిపోయారు.

తల్లితండ్రులకునమస్కారం చేయించి భార్య భుజంపై చెయ్యివేసి అతని గది లోకి నడిపించుకుపోయి, తలుపులు మూసుకున్నాడు.

వారు ఇక చేయగలిగింది ఏమీలేదని తెలుసుకున్నారు. వారి తాహతుకు తగినట్టుగా పార్టీయిచ్చి, బంధు మిత్రులకు కోడలును చూపించారు. ఉమ తన అందంతో అందరినీ ఆకట్టుకొంది. గర్వంగా తన స్నేహితులకు పరిచయం చేశాడు శంకర్. వారందరికంటే తాను పై ఎత్తులో వున్నట్లు అతనికి భావన కలిగింది.

* * *

ఉమలో. లేమిలోవున్న కరకుదనం మొరటుదనం కలిమిలో కరగిపోయాయి. కడిగిన ముత్యంలా, సానబట్టిన వజ్రంలా మెరవసాగింది. చక్కగా అలంకరించుకోవటం, వెళ్ళేచోటునుబట్టి కేశాలంకరణ, కాటుక, పెదాలకురంగు దిద్దుకోటం నేర్చుకొంది. అలా చక్కగా అలంకరించుకున్న భార్యను వెంటబెట్టుకొని క్లబ్‌కి డిన్నర్‌లకి వెళ్ళేవాడు. ఉమను చూసినవాళ్ళు ఆమె చదివింది ఎనిమిదో తరగతి అని అనుకోరు.

అద్దంముందు కూర్చున్న ఉమకు తన ప్రతిబింబం అందులో కన్పించింది. కాని మనస్సుకి ఆనందంకలిగించలేకపోయింది. తన అందానికి మురుస్తూ వెంటబెట్టుకొని తిరిగే భర్తవున్నా తృప్తి కలుగలేదు. గొప్పింటి కోడలు తనకేమి లోటులేదు. మామగారు వ్యాపారపుగొడవలోవుంటారు అనుకున్నంతగ అత్తపోరులేదు. ఆడ బిడ్డలు మాధవి. మాలతి, బి.ఎల్.బి.కాం, చదువుతున్నారు. ఎవరిపనులు వారు చేసుకుని పోతుంటారు. శంకర్‌కి ఓతమ్ముడు వున్నాడు. ఉదయ్. గుల్బర్గాలో మెడిసిన్ చదువుతున్నాడు. కోర్సు పూర్తిచేసుకొని వస్తాడు. వాడూ ఓపిల్లను వెంటబెట్టుకు రాకముందే పెళ్ళిచేయాలని ఆప్రయత్నాల్లో వున్నారు.

ఉమ ముఖానికి పౌడరు అద్దుకుంటూ 'తన అందమే తనకుఅదృష్టాన్నితెచ్చింది. తనకి అన్నీ దొరికాయా' అని ప్రశ్నించుకుంది. శంకర్ తన అందాన్ని ఆరాధిస్తున్నాడు. ఇష్టంగ అతను సుఖిస్తున్నాడు. కాని తను తృప్తిపొందలేక పోతుంది. తనకు కావలసింది ఆరాధనకాదు అనురాగం. శంకర్ గొప్పవాడు. తన అంతస్తుకు హోదాకు తగిన భార్యను యెన్నుకున్నాడు. తన గొప్పతనానికి మెరుగు దిద్దుకున్నాడు. అతని అదృష్టానికి యితరులు ఈర్ష్య పడుతుంటే అతను సంతోషిస్తాడు.

భార్యాభర్తల సంబంధం కేవలం శారీరకమే కాదు. ఆత్మలకి సంబంధించింది.

తనకి ఆ భావన ఎన్నడూ కలుగలేదు. అతని దృష్టిలో తనొక అపురూపవస్తువు. భర్తనించి తనకింకేదో కావాలన్న తపన కలుగసాగింది.

ఉమ అద్దంలోకి చూస్తూ 'ఓ మనిషీ నీకు తృప్తిలేదు. పుట్టింట్లో కడుపునిండి వంటినిండా బట్టవుంటే చాలనుకున్నావు. దానికోసం ప్రాకులాడావు. అనుకున్న దానికంటె ఎక్కువగానే దొరికాయి. ఇప్పుడు మరేదో కావాలంటుంది మనస్సు. మరేదో ఊహిస్తుంది.' అని అనుకుంటూ నవ్వుకుంది.

బుగ్గమీద సొట్టపడింది. 'ఈ అందం లేకుంటే తన భర్త తనను ప్రేమించడే! భార్య అని మక్కువగ చూపించుకోడే! దూరం చేస్తాడా! మక్కువగ దగ్గరకు తీసుకోడా! అసలు ఈ అందం శాశ్వతమా!' అని అనుకుంటే గుండె గుబ గుబ లాడింది. తన అందం తనకు సంతోషాన్ని కలిగించటంలేదు. తన అందం చూసుకొని గర్వించటానికి బదులు ఏదో తెలియని బెంగ కలుగుతూంది.

తల దువ్వుకోవాలని పించలేదు. కాని శంకర్ వూరెళ్ళి రెండ్రోజులయింది. సాయంకాలానికల్లా వచ్చేస్తానన్నారు.ఏదో ప్రోగ్రాం పెట్టుకొనే వస్తారు. తయ్యారు కావాలి. దువ్వెన అందుకొంది. హాల్లో ఫోన్ మ్రోగింది. ఆలోచనలోవున్న ఉమ ఆ శబ్దానికే వులిక్కిపడింది.

ఫోన్ ఎవ్వరూ ఎత్తలేదు. ఆగకుండా మోగుతూనేవుంది. ఉమలేచి గదినుండి బయటకు వచ్చింది. ఎవ్వరో ఒకరు ఎత్తుతారులే అన్నట్లు ఎవ్వరికి వారు వూరుకుంటారు. అప్పుడే లోపలికి వచ్చిన మాలతి విసుగ్గా ఫోను ఎత్తింది. మాలతి చెయ్యి గుండెలమీదికి పోవటం—మెట్లు దిగుతున్న ఉమచూసి అక్కడే ఆగి పోయింది. భయంకరమైన వార్త వింటున్నట్లు కళ్ళు పెద్దవిచేసి వింటున్న మాలతి మెట్లమీద నిల్చొన్న ఉమవైపు పిచ్చిగా చూసింది. 'అమ్మా' అంటూ గావుకేక పెట్టింది. "పెద్దన్నయ్య కారు ఏక్సిడెంట్ అయిందట ..."

తరువాత మాటలు ఉమచెవిలో దూర లేదు.

* * *

ఉమ ఇప్పుడు విధవ. పెళ్ళయి సంవత్సరమైనా పూర్తికాలేదు.

ఇప్పుడు తన అందానికి విలువలేదు అందం, సువాసనవున్న తోటలో పూవు కాదు. తను చూస్తుండగానే కాయితం పూవుగా మారిపోయింది. ఇలా అవుతుందని ఎన్నడూ వూహించలేదు. శంకర్ ఆరాధించే ఈ అందం పోతుందేమో-అతనికి దూరం అవుతుందేమోనని భయపడిందేకాని అతనే శాశ్వతంగ ఈలోకం నుంచి వెళ్ళిపోతాడని అనుకోలేదు. ఎంతలో తన బ్రతుక్కి విలువలేకుండ పోయిందీ! ఇదేనా జీవితం-అనుకుంటూ కుమిలిపోయింది.

అంత దుఃఖంవున్నా ఉమ కంటిలో కన్నీరు కనపడలేదు.

భర్త చనిపోతే ఏడ్వని భార్యను వింతగ చూశారు.

* * *

ఆ ఇంటికి పెద్దకోడలు, రాణిలా వెలిగిన ఉమ ఇప్పుడు వంట మనిషి. ఎంతకాలం ఒంటరిగ గదిలో కూర్చుం

టుంది! తనకై తానువచ్చి వంటగదిలో స్థానమేర్పరచుకుంది.

శంకర్ పోయిన రోజునవచ్చి తల్లి తండ్రి ఖర్మకాండలు ముగిశాక ఏడుస్తూ వెళ్ళిపోయారు. కూతుర్ని ఇంటికి తీసుకు పోలేదు. తనను పోషించి, భరించేశక్తి వారికిలేదని ఉమకి తెలుసు.

అత్తగారి ఏడుపులు సాధింపులు ఉమను ఏమి చేయలేకపోయాయి. మొండి వాడు అందరికంటే బలవంతుడు. విధి వ్రాసిన రాత ఇది తనకర్మ అనుకుంది. తనకూ ఓ మనస్సు అంటూ వుందని మరచి పోయేదే కాని . శంకర్‌లా వుండే ఉదయ్‌ను చూసి మరువలేకపోయింది.

మొదటిసారి ఉదయ్ స్వరం విని వులిక్కిపడింది. మెడమీది వెంట్రుకలు నిక్క పొడుచుకున్నాయి ఊరునుంచి వచ్చిన శంకర్ 'అమ్మా!' అని పిలిచి నట్లుగానే వుంది.

అతని నవ్వు బాధాకరమైన సంతో షాన్ని కలిగించేది. ఉదయ్ నవ్వుకొరకు కాచుకుని వుండేది. అతను నిలుచునే తీరు-నడక కళ్ళెత్తి చూసే విధం శంకర్‌ని గుర్తుకుతెస్తాయి.

శంకర్ దృఢంగ గంభీరంగ ఆటోతువంటి వాడైతే ఉదయ్ కోడెద్దు లాంటివాడు. అతన్ని చూడకూడదను కుంటూనే తలుపు సందుల్లోనుంచో, తెరచాటునుంచో చూస్తుంది అలా చూడడంలో ఏ దురుద్దేశం తనకు లేదని సరిపెట్టుకునేది.

ఉదయ్ ఎదుటకు ఎప్పుడూ పోలేదు. తనను అతడు చూశాడో లేదో కూడ తెలియదు

కొండంత పెద్దకొడుకు పోయాక, చిన్నకొడుకుని వదలి వుండలేకపోయింది తల్లి. ఆ వూళ్ళోనే ప్రాక్టీసు పెట్టు కున్నాడు. మరోవైపు నాన్నకి వ్యాపా రంలో సాయం చేస్తూనే వున్నాడు.

శంకర్ లేకపోవటంతో ఆ ఇంటికి కళ పోయినట్లుంది.

భర్త పిల్లలువున్న అత్తగారే అంతగ కృంగిపోయారు. తనకున్న ఒక్క ఆధారం శంకర్ పోతే తనెలావుంటుందో? తన బాధ ఏమిటో? తన భవిష్యత్తు ఏమిటోనని ఒక్కరూ ఆ ఇంట్లో ఆలో చించేవారులేరు. ఇంతేనా జీవితం! తన భవిష్యత్తు శూన్యమేనా? ఇరవై సంవత్స రాలకే తన బ్రతుకు సమాప్తమైపోయిందా! కలవరపడుతూ ఉమ ఆలోచిస్తూ పశ్చిమా కాశాన్న ఇంకిపోతున్న సూర్యుని చూస్తూ పెరడు బావిదగ్గర నిలుచుంది. ఏ ఆశలేని తన హృదయం రోజు రోజుకు అలాగే కృంగిపోతుందని తలచింది.

ఇంటిలో ఎవ్వరూలేరు. మాధవి, మాలతి కాలేజీనుంచి ఆలశ్యంగా వస్తా మని ఫోన్‌చేశారు. అత్తమామగార్లు ఆ వూరిలోనే ఏదో సంబంధం వుందని మాధవి కొరకు చూడ్డానికి వెళ్లారు.

ఉదయ్ ఊరిలో లేనట్లుంది, రెండ్రోజులుగా కనపడలేదు.

ఉమ తలస్నానం చేసింది. తలార పెట్టుకుంటూ పెరడులోకి వచ్చింది. తనెప్పుడు ధైర్యంచేసి ముందు వరండా లోకి పోలేదు. తనస్వరం వంటగది దాటిపోదు. ఒంటరితనం బాధగవుంది. ఎక్కడికైనా వెళ్తాం అనుకుంటుంది. ధైర్యంచేసి అడుగు బయటపెట్టలేదు

అత్తగారు వూరుకుంటుందా! తన నీడ ఆమెమీద పడినా సహించదు అందుకే ఇలా ఎవ్వరూ లేనప్పుడు పెరట్లోకివచ్చి గాలి పీల్చుకుంటుంది

విశాలమైన ఆకాశంకేసి చూస్తూ నిలుచుంది.

మరో మనిషి దగ్గర్లో వున్నట్లని పించింది. తిరిగి చూసింది తలుపుకివతల నిల్చున్న ఉదయ్ దీర్ఘంగా చూస్తున్నాడు.

ఉమ తిరిగి చూడగానే దగ్గరగావచ్చి నిల్చున్నాడు. అంత దగ్గరగా ఉదయ్‌ని స్పష్టంగా చూడడం మొదటిసారి. ఉమ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"మీరూ .?" అన్నాడు. ఓ అందమైన దృశ్యంచూపి ముగ్ధుడైనట్లున్నాయి అతని చూపులు.

అంటే! తనను ఇంతవరకు చూడలేదా ఉదయ్. శంకర్ భార్యను చూద్దాం అన్న కుతూహలం కూడ కలుగలేదా! అనుకుంటూ

ఉమను మీ వదినను కన్నులు క్రిందికి వాలుస్తూ అంది

"మైగాడ్ ...మీరు...." చకితుడై ఉమను చూస్తూ. "మీరు వదినగారా!" ఇంత చిన్నగావున్న ఈమె విధవ!! మాలతి వయస్సు వుంటుందా! అనుకున్నాడు.

ఇంతవరకూ శంకర్ భార్యను చూద్దాం. పలుకరిద్దాం అని అనుకోలేదు.

విధవ అయిన అన్న భార్యను చూసే ధైర్యం లేకపోయింది.

ఆమె చాటుగా తప్పుకుంటున్నప్పుడు చీర కుచ్చెళ్లో పైట చెంగో అతని కంట పడేది. జాలిపడేవాడు. అంతకంటేఁతనేమి చేయగలడు! పుట్టింటికి వెళ్ళిపోక ఇక్కడే వున్నందుకు సంతోషించాడు. అన్నలేక

పోయినా, అన్నకు ఆత్మీయురాలు ఇంట్లోనే వుంది అని తృప్తిపడ్డాడు.

చిన్నగ గూడు వదలిన పక్షిలా నిస్స హాయతగ ఒంటరిగావుంది. జాలితో అతని మనస్సు నిండిపోయింది. అంద మైన ఆస్త్రీని చేతుల్లోకి తీసుకుని ఆమె దిగులును పోగొట్టాలనిపించింది.

"ఉమా!" అన్నాడు అప్రయత్నంగ.

ఎప్పటిన్నుంచో ఆ పిలుపుకోసం వేచి వున్నదానిలా ఆశగా కనులెత్తి చూసింది. ఆ కన్నుల నిండుగ కన్నీరు వుబికి నందున ఉదయ్‌ను స్పష్టంగా చూడలేక పోయింది.

*   *   *

మనిషి ఏకాకికాడు. తోడు కోరుకుం టాడు. స్నేహాన్ని ఇష్టపడతాడు. వాటి కోసం ఏ సాహసమైనా చేస్తాడు.

తను ఎక్కడవున్న ఏంచేస్తున్న ఓ జత కళ్ళు తనను చూస్తుంటాయని ఉదయ్ గమనించాడు.

బయటికిపోతూ కంటికి ఎవ్వరూ కన పడకపోయినా వెళ్ళి వస్తానన్నట్లుగా చెయ్యి గాలిలో వూపుతాడు. ఉమ కిటికీ తెర కదులుతుంది.

ఉమ కిప్పుడు జీవితం మరీ నిస్సా రంగలేదు. 'తనకోమనిషి సానుభూతి వుంది.' అన్నతలంపు ఓవిధమైన బలం కలుగజేసింది.

తనకోసమే అన్నట్లుగా భోజనం దగ్గర మరి కాస్సేపు గడిపేవాడు. 'ఉమ గారూ! కాఫీ' అని నేరుగ పిలిచి అడుగు తున్నాడు.

ఆమె చేసినవంట బ్రహ్మాండం అని పొగుడుతూ, ఉమకు సంతోషాన్ని కలుగ చేసేవాడు. ఉమ చూసినప్పుడు తియ్యగా నవ్వుతాడు.

ఏ విధవను చూసిన, ఏ దీనురాలిని చూసినా ఉదయ్‌కు ఉమ గుర్తుకువస్తుంది. భర్త పిల్లలతో నూరేళ్ళు బ్రతకవలసిన ఉమ జీవితం అప్పుడే సమాప్తమైందా! ఇక జీవించినంతకాలం వంటగదికి అంకి తమై పోవలసిందేనా! ఆమె యవ్వని. మనస్సుంది. కోరికలు వుంటాయి. వాటిని బలవంతంగ చంపుకోవలసిందేనా అని పదే-పదే ఆలోచించేవాడు.

తనేం! చెయ్యాలి??

ఒకరోజు భోజనంచేస్తూ 'ఉమగారూ! ఎప్పుడూ వంటచేస్తూ గడిపేకంటే, చదువుకోకూడదూ! ఎంతవరకు చది వారూ!...." అయితే మెట్రిక్కు కట్టండి! పుస్తకాలు తెస్తాను. మాధవితో చెప్పించు కోండి" అని అన్నాడు.

అతను అనరాని మాటలు అన్నట్టుగా చూసింది అమ్మగారు.


"ఆఁ చదువు. దేనికి పనికివస్తుంది! ఉద్యోగం చేయాలా, వూర్లు ఏలాలా! వంటింటి విషయాలు మగవాడికి నీ కెందుకు...!" చీవాట్లు వేసింది.

పెద్దవాడు శంకర్‌ని తిట్టే ధైర్యం వున్నా, అతడు ఏంచేసినా అడ్డుచెప్పలేక పోయేది. మొండిపట్టుతో అన్నీ సాగిం చుకునేవాడు.

ఉదయ్ మెత్తటి మనస్సు కలవాడు. ఒకరిని నొప్పించే స్వభావంలేదు. అమ్మ కొట్టినా ఎదురుతిరిగేవాడు కాదు. అందుకే ఆ తల్లికి అతనంటే అంతులేని అను రాగం.

ఆమె కూతుళ్ళు మాధవి, మాలతి

జ్యోతి



చదువుకోటల్లేదూ!

ఉద్యోగంచేసే అవసరం వారికిలేదని చదువు మానేశారా?

రేపు పెళ్ళిచేసుకుంటే ఆ చదువు పిల్లల్ని కంటుందా! అక్షరజ్ఞానం లేని వెంకమ్మపుల్లమ్మలూకంటున్నారుపిల్లల్ని. వారికంటే భర్తలేని ఉమకు చదువు అవసరమని అమ్మ గ్రహించదేమి? అని తనలో తర్కించుకున్నాడేగాని యెదురు తిరిగి ఆమాటలు తల్లితో అనలేకపోయాడు పెద్దది నొచ్చుకుంటుందని అనుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. మాధవి, మాలతి పెళ్ళిళ్ళు జరిగాయి. ఉదయ్, ఉమలమధ్య ఆత్మీయతలో చనువు వృద్ధి అయింది. ఉదయ్‌కి ఏంకావాలో అన్నీ అమర్చేది. పనిమనిషి చేయటానికి వెను కాడే పనులుకూడా చేస్తుంది. పనిమనిషికి డబ్బులుయిచ్చి ఋణం తీర్చుకోవచ్చు. ఉమకు తను ఏంచేయగలడు. ఏంచేస్తే ఉమజీవితం చక్కబడుతుంది. ఉమ చూపులు తనను వెంటాడుతూ హాంట్ చేస్తుంటాయి.

మాధవి పెళ్ళి సమయంలో ఉమ గదిలో ఓమూల కూర్చుండిపోయింది. ఏదో పనిమీద వచ్చిన ఉదయ్ గోడకు ఆనుకుని కూర్చున్న ఉమను చూశాడు. అతని హృదయం కరిగిపోయింది. 'ఉమా' అన్నాడు. తెల్లటి కళ్ళతో చూసింది. బయట మంగళ వాయిద్యాలు, వాళ్ళనవ్వులు పరిహాసాలు ఆ లోకంతో సంబంధం లేకుండా ఏకాకిగావుంది. ఎన్నడూ కలు గని ఆలోచన ఆరోజున ఉదయ్‌కి కలి గింది.

'ఉమా! నీకు నేనున్నాను!' అంటూ ఆమెను హృదయానికి 'చేర్చుకోవాలని పించింది. అప్పటికప్పుడే హృదయానికి

చేర్చుకోలేకపోయినా ఆ భావాన్నికన్నుల్లో కురిపించాడు. ఆ చూపులు ముందు భయం గొలిపినా హాయిగాఅనిపించాయి. సన్నగా నవ్వింది ఉమ. సన్నాయి తారస్థాయి నందుకొంది.

పెళ్ళిలో ప్రతినిమిషం పెద్దకొడుకుని తలచుకొని అమ్మ కంటనీరు పెడుతూనే వుంది.

చచ్చిపోయిన వారికోసం యేడుస్తారు కాని, చావలేక బ్రతికివున్న వారికోసం ఏమీ చేయటానికి ప్రయత్నించరేం....!

మాధవి, మాలతులు అత్తవారింటికి వెళ్ళిపోయారు. ఇంట్లో సందడిలేదు. పెద్దకొడుకు వెళ్ళినరోజునే ఇంటి కళ తప్పింది.

ఇప్పుడు మౌనంగా. బోసిగవుంది. శంకర్ వుంటే ఈపాటికి పసిపిల్లలతో ఇల్లు కళగా నిండుగా వుండేది. అమ్మ కన్నీరు తుడుచుకుంది. ఉదయ్‌కి వెంటనే పెళ్ళిచేసి కోడలిని తెచ్చుకోవాలి.

ఇంట్లో పసివారు నడయాడితేగాని మనస్సు పూరుకోనంది

ఉదయ్‌తో పెళ్ళిప్రస్తావన తెచ్చి అమ్మాయిల వివరాలు చెప్పసాగింది.

అన్ని సంభాషణలు సాధారణంగ భోజనాల దగ్గరే వస్తుంటాయి,

ఉదయ్ నిదానంగా అమ్మను చూస్తూ నెమ్మదిగా "అమ్మా! ఉమను పెళ్ళి చేసు కుంటాను" అన్నాడు.


"ఏ ఉమరా!"

ఉమవైపు తలూపాడు. కూరగిన్నెలు పట్టుకువస్తున్న ఉమ అక్కడే ఆగి పోయింది. నోట మాటరానట్లు వుండి పోయినా మరుక్షణం భద్రకాళిలా నిప్పులు కురిపించింది తల్లి. "సిగ్గులేదట్రా! అన్న భార్యను చేసుకుంటాననటానికి! నీకు నోరు ఎట్లా వచ్చింది! అన్నమీద నీకు గౌరవంవుంటే నీకు ఈ ఆలోచన వస్తుందా!" నోటికి వచ్చినట్లు తిట్ట సాగింది.

ఉమ అక్కడనుంచి పరుగెత్తిపోయి తనగదిలో గజ గజ వణుకుతూ పడు కుంది.

"అమ్మా చచ్చిపోయిన వాళ్ళగురించి ఆలోచిస్తూ తపనపడుతున్నావు—బ్రతికి కంటి కెదురుగావున్న వాళ్ళగురించి ఆలో చించరేం! నేను చచ్చిపోయి నా భార్య అలావుంటే నేను పూరుకోలేను నా ఆత్మ శాంతిగా వుండదు అని తెలుసు"

"ఉదయ్!" అంటూ పిచ్చిగా అరచి, బల్లమీద పడిపోయింది. తన ముద్దుల కొడుకు అంతగా దిగజారిపోతాడనుకో లేదు. మరో పిల్లను పెళ్ళాడి పిల్ల పాపలతో నూరేళ్ళు బతుకుతాడనుకొంది. ఇంతగా మలిన పడతాడనుకోలేదు. తమ పరువు ప్రతిష్టలు ఏంకావాలి! తన ఆడ పిల్లలకి వారి అత్తగారింట్లో ఎలాటి గౌరవం లభిస్తుంది! వదినను చేసుకుం టాడా! అని అందరూ వ్రాయరూ! అవే శంతో ఆమె హృదయం భగ్గుమంది. మంచంలో పడుకున్నదల్లా లేచి పండ్లు కోసుకునే కత్తి అందుకొని పరుగెత్తి ఉమ గదిలో జొరబడింది. ఉమ కెవ్వుమంటూ కళ్ళు మూసుకుంది. ఉమ జుట్టు జవిరి పట్టుకుని "ముండ. నా పెద్దకొడుకుని మింగేశావు. చిన్నవాడ్ని కూడ నీ అందంతో చంపేస్తావా!"



అంటూ సర్రుమని జుట్టు కోసేసింది. "వాడు మరోసారి నీ పేరు ఎత్తాడా, ఈ కత్తి నీ గుండెల్లో గుచ్చుకుంటుంది." చేతుల్లో నిండుగావున్న బారెడు జడను విసిరికొట్టింది. అప్పటికి ఆమె కక్ష తీరినట్లు వెళ్ళిపోయింది.

అమ్మ తిట్టుతూ పడిపోగానే, విసురుగ ఇంటినుంచి వచ్చేశాడు ఉదయ్.

మనశ్శాంతి కోసం అక్కడా ఇక్కడా తిరిగి-క్లినిక్ లో వుండి రాత్రి పడిన తర్వాత ఇంటిదారి పట్టాడు.

ఇల్లంతా అతి నిశ్శబ్దంగావుంది. నాన్నగారు ఇంట్లోలేరు. లేకుంటే మరింత రభస జరిగేది అనుకుంటూ డైనింగ్ హాలుకి వచ్చాడు బల్లమీద భోజనం లేదు వంటచేసిన సూచనలు లేవు

అక్కడే కునికిపాట్లు పడుతున్న పని మనిషి పాలుతెచ్చి ఇచ్చింది అవి త్రాగి తన గదివైపు పోతున్నాడు కాలికి మెత్తగా తగిలినదానిని చేతులోకి తీసుకున్నాడు. అది జడ-విడివడివుంది. పని మనిషివైపు కళ్ళు విప్పారించి చూశాడు. ఆమె సైగచేస్తూ జరిగింది చెప్పింది. అతని గుండెల్లో రక్తం వేడెక్కింది. ఆ వెంట్రుకలను పట్టుకొని ఉమ గదిలోకి వెళ్ళాడు.

ఆ గది చీకటిగావుంది. తడుముకుంటూ ముందుకి వెళ్ళాడు.

గువ్వలా ముడుచుకుని పడుకున్న ఉమను తాకాడు.

ఆవేదనతో ఆమెను పొదవి చేతుల్లోకి తీసుకున్నాడు.

తల నిమిరాడు. ఉమకు జరిగిన అవమానానికి అతని గుండె నీరు కారిపోయింది ఈ సంఘంమీద అమ్మానాన్నలమీద కక్ష తనచేతగానితనానికి తనమీద తనకే అసహ్యం కలిగాయి

ప్రేమగా ఉమను గుండెలకు హత్తుకున్నాడు తను ఆమెకు ఏమి ఇవ్వగలడు। ఏమిస్తే ఆమె దుఃఖంపోతుంది

అతను ఇవ్వగలిగింది చేయగలిగింది ఒక్కటే తన ప్రేమ-తన శరీరం!

ఉదయ్ ప్రేమ ఉమ ఆత్మను తాకింది ఎన్నడూ పొందనంత సుఖం తృప్తి ఆ రాత్రి తను పొందినది.

ఉదయ్ కొరకు తన శిరోజాలేకాదు ప్రాణాలను కూడ సులభంగా ఇవ్వగలదు.

ఉదయ్ ఆ రోజునుంచి అమ్మముందు ఉమ పేరు ఎత్తలేదు.

చాటుగా మాటుగా వారు ఆనందాన్ని వెతుక్కుంటూనే వున్నారు.

ఒకరోజు ప్రక్కింటి తులశమ్మ ఇంట్లో ఏడుపులు. వినిపించాయి. తన విధవ కూతురు కులంకానివాడితో లేచి పోయి పెళ్ళి చేసుకుందని. కూతుర్ని వాడిని వారం రోజులు తిడుతూ శపిస్తూనే వుంది.

ఉమతో ఉదయ్ ఎక్కడ లేచిపోతాడో నని అమ్మకు భయం పట్టుకుంది.

ఉమను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టే ప్రయత్నంలో వుండగా! 'పిచ్చిదానా, మధువు. మగువ మరిగిన మగవాడు దేనికైనా తెగిస్తాడు. ఎంతటి నీచానికైనా దిగజారిపోతాడు. దాన్ని తరిమేస్తే బయట బాహాటంగా కాపురం పెట్టేస్తాడు. కనుక దాన్ని ఇంట్లోనేవుంచి, నీ కొడుక్కి పెళ్ళిచేయి' అని భర్త సలహా ఇచ్చాడు.

"ఉమా! అమ్మ పెళ్ళిచేసే ప్రయత్నంలో వుంది. ఒకరికి న్యాయం చేయబోయి మరొకరికి అన్యాయం చేస్తానేమో! మనం ఎక్కడికైనా వెళ్ళిపోదాం! పెళ్ళిచేసుకుందాం! నేను డాక్టర్ని. నిన్ను పోషించలేకపోను...." అన్నాడు

ఇంతకంటె ఎక్కువ ఆశించటం దురాశ అవుతుందని ఉమ అనుకొంది

'సంఘం మారలేదు. ఏ కొంత మారినా మన ఆచారాలు మాసిపోలేదు. మనవాళ్ళ భావాలు మనస్సులు బూజు పట్టివున్నాయి. నాలాటి అభాగ్యుల గతి ఇంతే. వెళ్ళిపోయి ఇందరిని బాధపెట్టి మనం సుఖపడలేం' అని ఉమ ఉదయ్‌తో అంది.

అమ్మ అంటే ఉదయ్‌కి ఎంత ప్రేమ వుందో ఉమకు తెలుసు. ఆమె ప్రాణాలైన వదులుతుందిగాని వారిపెళ్ళికి అమోదించదు. అందుకే అలా చెప్పింది.

ఉదయ్ పరిస్థితులకు బానిస కాక తప్పలేదు. అమ్మతెచ్చిన అమ్మాయి రాజ్యలక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు.

ఉదయ్‌కి పెళ్ళి అవుతుంటే బాధతో తన హృదయం పగిలిపోతుందని అనుకొంది. కాని ఉదయ్‌కి మంచి భవిష్యత్తు వుండాలంటే అతను పెళ్ళిచేసుకోవాలి. సుఖంగా పాపలతో కలకాలం జీవించాలనుకొంది. అతనిమీద ప్రేమ అలా ఆలోచింప చేసింది.

అతన్ని చూడగలదు. అతనికి సేవ చేయగలదు. బ్రతికివుండటానికి ఓకారణం వుంది. అది చాలు అనుకుంది ఉమ.

* * *

ఉదయ్ ఉమను మరువలేదు. ఆమె సాంగత్యాన్ని వీడలేదు. భార్యను తృప్తి పరచి ఉమ దగ్గరకు వచ్చేవాడు.

అది 'తప్పు' అని ఇద్దరికీ తెలుసు. పరిస్థితులకు బానిసలై పోయారు. ఉమ బాధ పడుతుంటే అతను 'ఉమా! తప్పు అనుకుంటే అంతా తప్పుగానే కవిపిస్తుంది.

మన పుట్టుకే పాపంతో మొదలయింది. నిన్నిలా మ్రోడుగా బ్రతకమని శాపించటం తప్పుకదూ! నీతిగా బ్రతికేదారి వున్నా తప్పుడుదోవను వారే చూపించారు మన సంబంధం ఇంట్లో అందరికీ తెలుసు. తెలియనట్లు నటిస్తున్నారు.

నీతిగా బ్రతుకుతామంటే ఒప్పుకునే గుండె ధైర్యం లేదువారికి. అమ్మకినాన్న అవసరం ఇంకా వున్నప్పుడు, కూతురు లాంటి నీకు వారిలా కోరికలు వుంటాయని ఎందుకు ఆలోచించదు?....' అలా తాము చేస్తున్న తప్పును సమర్థించేవాడు.

* * *

లైన్స్‌క్లబ్ మెంబర్లు ఒకనెలరోజులు విదేశ పర్యటన చేద్దాం అని తీర్మానించుకున్నారు.

ఆయాదేశాల్లోవున్న లైన్స్ మెంబర్సుతో సంప్రదింపులు జరిపారు. పదివేల రూపాయలతో కొన్ని దేశాలయినా చూడవచ్చు. ఈ తరుణం మరలా రాదనుకొన్నారు.

ఉదయ్, ఉదయ్ నాన్నగారు ఫారిన్ యాత్రకు బయలుదేరారు.

ఆయా దేశాలను సందర్శించి వస్తూ వస్తూ తీసుకురాగలిగిన వస్తువులు పట్టుకు వచ్చారు.

ఉదయ్ తనకు ఇద్దరు భార్యలు అనుకొంటూ రహస్యంగా తనలోతాను నవ్వుకున్నాడు. ఉమకు, రాజ్యలక్ష్మికి బహుమతులు కొంటున్నప్పుడు

రాజ్యలక్ష్మి, అమ్మ సంబరంగా స్వాగతం చెప్పారు. వారి బహుమతులనుచూపి మురిసిపోతుండగా ఉదయ్ ఉమను చూద్దాం అన్న ఆతురతతో డైనింగ్ టేబుల్‌వద్దకు వచ్చి "ఉమగారూ! మీ చేతికాఫీ కోసం అలమటించిపోయాను. స్ట్రాంగ్ కాఫీ...." అంటూ ఉత్సాహంగా పలుకరించాడు.

కొత్తగావచ్చిన వంటమనిషి కాఫీకప్పు బల్లమీద వుంచుతూ...."ఉమగారు ఆసుపత్రిలో వున్నారు" అని చెప్పింది.

"హాస్పిటల్ లోనా? ఎందుకు?" ఆ కంఠంలో ఆతురత వుంది.

"ఉమగారికి టెటనస్ వచ్చిందండీ!" వెనుకగా వచ్చిన రాజ్యలక్ష్మి అంది.

"ఉమగారికి టెటనసా. మైగాడ్! టెటనసా?" నమ్మలేనట్లు అన్నాడు.

"ఎందుకు వచ్చిందీ? ఎలా వచ్చిందీ" పైకి లేస్తూ అన్నాడు

"చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా! ఎవరి కర్మకు ఎవరు కర్తలు ..." హాలులోవున్న అమ్మ మాటలు స్పష్టంగా విన్నాడు.

పరుగులాంటి నడకతో బయటకువచ్చి "ఒక్కదాన్నే హాస్పిటల్లోవుంచారా! ఆమె దగ్గర ఎవ్వరున్నారు?" అన్నాడు.

"పక్కింటి తులశమ్మ అక్కడేవుంది." భుజంమీద వేసుకొన్న చీర సొగసులను చూస్తూ రాజ్యలక్ష్మి అంది.

* * *

చీకటిగదిలో మూల మంచంలో పడి వుంది ఉమ. ఆ జబ్బుతో వచ్చినఫిట్సులో కట్టెలా బిగుసుకుపోతున్న శరీరం, వంగి పోయిన వీపు, గొంతులో పిండే బాధ, మూతి వంకరపోయి, అష్టవంకరలు తిరిగి పోయిన ఉమను చూశాడు. ఇంజెక్షన్లు, మందులతో అదో విధమైన వాసననిండి వుంది ఆ గదిలో.

మత్తు మందుల్లో మత్తుగా పోయే ప్రాణంతో పెనుగులాడుతోంది ఉమ.

'ఉమ! ఉమా!' ఆవేదనగా పిలిచాడు. ఆమెను రెండుచేతులతో చుట్టివేస్తూ. ఆ స్వరం వేణునాదంలా ఆమెను తాకింది. కన్నులు విప్పింది.

ప్రేమ పూరిత నయనాలతో చూస్తున్న ఉదయ్ కనిపించాడు. ఇప్పుడు తను ఎంత అసహ్యంగా, వికారంగా వుంటుందో తనకు తెలుసు. అయినా ప్రేమగా పిలుస్తున్నాడు ఉదయ్.

తన అందాన్నికాదు అతను కోరుకుంది. హృదయమున్న మనిషిగా తనను చేరదీశాడు. అందుకే ఉదయ్‌ని దేవుని కంటె ఎక్కువగా ప్రేమించింది. అతన్ని శాశ్వతంగా తనలో ఇముడ్చుకోవాలనుకున్నది. ఉదయ్ బిడ్డ తనలో పెరుగుతున్నాడంటే సంతోషించింది. మూడు నెలలు ఇష్టంగా అతని ప్రాణాలను దాచుకుంది. కాని తనకా సంతోషం శాశ్వతం కాదు. తను మోడు. చిగురించకూడదు. పాపం. తను లోకుల దృష్టిలో కులట. అందుకే తన గర్భాన్ని తీసేసుకుంది. పక్కింటి తులశమ్మ ఎవ్వతెనో తెచ్చింది అది ఎలా చేసిందో ఏమో మూడోరోజుకు జబ్బు చేసింది.

కాకిలా కలకాలం జీవించేకంటె ఈ అమృతమూర్తి చేతుల్లో తన జీవితం సమాప్తమైతే అంతేచాలు. అతని కోసం ప్రాణాలన్నీ కూడదీసుకొని వేచివుంది.

ఉదయ్ కన్నుల్లోకి చూస్తూ ప్రాణాలు వదిలింది ఉమ.

"ఉమా! నీవు చనిపోలేదు. నిన్ను హత్యచేశారు." అంటూ ఉదయ్ హృదయం ఏడుస్తూ మూలిగింది. □

ఆశయ - ఆలయ

చింతా రాంబాబు

ఆఫీసు పనిమీద పదిరోజుల క్యాంపు ముగించుకొని ఆ రోజున ఇంటి కొచ్చాను. వచ్చీరాంగానే చెల్లి చెప్పింది. శ్రీనివాసరావు పెళ్ళిచేసుకోబోతున్నాడని! "సీముఖం. అతనికెవరే పిల్లనిచ్చేది?" అన్నాను. "ఎవరేమిటి? మన వీధిలో ఆడపిల్లల తల్లితండ్రులంతా పోటీ పడు తుంటేను" అంది. ఆశ్చర్యపోయాను! ఈ పెద్దమనుష్యులే ఒకప్పుడు శృతి మించిన అతని విశృంఖలతని గర్హించి అతనికి బుద్ధులు చెప్పటానికి ప్రయత్నిం చిన వాళ్ళు! ఇప్పుడు కన్నకూతుళ్ళ గొంతుకలే కొయ్యటానికి సిద్ధపడుతున్నా రంటే నాకు బాధ, కోపం రెండూ కలిగాయి.

ఇక్కడ శ్రీనివాసరావు గురించికొద్దిగా చెప్పాల్సివుంది. ఇతను నెలకి సుమారు ఏడెనిమిదివందలు తెచ్చుకొనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. వయసు ముప్పైఐదు వరకూ వుండవచ్చు. ముగ్గురు బిడ్డల తండ్రి.

ఈ శ్రీనివాసరావు అర్ధరాత్రిపన్నెండు గంటలకి ముందు ఎప్పుడూ యింటికి రావటం అంటూ జరగదు. ఇతనికొక స్కూటరుందిలెండి. మాకు నాల్గయిదిళ్ళ ప్రక్కనే ఇతనిల్లు కాబట్టి ఆ చప్పుడికి తెలుస్తూవుంటుంది. ఏ రోజన్నా భార్యకి ప్రాణంవిసిగి నిలదీసి అడిగితే, ఆరాత్రి ఆమెకి సామాన్య పరిభాషలో బడితపూజే! ఒక్కొక్కసారి అన్పించేది. అలాంటి మొగుడ్ని ఎలా భరిస్తుందాని! తప్పదు మరి. మన భారతస్త్రీ వోపిగ్గా మొగుడి చేత ఎన్నిదెబ్బలు తింటే అంతగొప్ప. ఆమాత్రం వోపిక చూపకపోతే సీత.


మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి
జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిష్ట్లా, ఫోన్: 73467, 77052

సావిత్రిల్లాగ మహాసాధ్వీలెలా అవుతారని సరిపెట్టుకోవాల్సిందే!

ఆమె పెద్దగ చదువుకొన్నట్లు లేదు. అయినా చూడగానే రూపానికి తగ్గ గుణవంతురాలనిపించేది. భగవంతుడు కావాలనే ఈమెలాంటి వాళ్ళని చదువున్నా సంస్కారంలేని శ్రీనివాసరావు లాంటి వాళ్ళని జతపర్చుతాడేమో అన్పించేది.

ఈ శ్రీనివాసరావు సంస్కారం యే పాటిదంటే—భార్యని స్కూటరు మీద బయటకి తీసికెళడానికి చెడ్డచిరాకు. కాని. పరాయిపిల్లని తీసికెళ్ళడం మహానందం—

పిల్లాడికి జ్వరంవస్తే డాక్టరుకి చూపించడానికి తీరుబడిలేదు. క్లబ్బుల్లో గంటల తరబడి కూర్చొని పేకాడటానికి చాలా తీరుబడి వుంటుంది—

ఇంటిమొఖం చూడకుండా తెల్లవార్లు త్రాగుతూ కూర్చోవచ్చు. సంజాయిషీ అడిగితే పెళ్ళానికి తన్నులు—సహనానికి కూడా ఒక హద్దంటూ ఉందంటారు. ఆమెపట్ల అదే జరిగింది. సహనంచచ్చిన రోజు యేదో మింగి తనే చచ్చిపోయింది.

ఇదే విషయంలో మరీ సెన్సిటీవ్‌గా వుండే ఆడవాళ్ళలో ఇంకోలాగ జరుగుతుంది. మాకు తెల్సిన ఒకామె భర్త ఎవరో అమ్మాయిని శాశ్వతంగా వుంచుకొన్నాడనితెల్సి, అతన్ని ఆమెనుండి తప్పించటానికి విశ్వప్రయత్నాలు చేసి విఫలురాలయింది. చివరకు ఎప్పుడూ అవే ఆలోచనలతో బుర్ర చెడగొట్టుకొని పిచ్చిదై రోడ్డు పట్టుకు తిరగకపోయినా ఇప్పుడు అదో లోకంలో జీవిస్తుంది.

మనకంటికి కన్పించే ఇలాంటి ఒకటి రెండూ కుటుంబాలేకాదు, బయటికి కన్పించని ఎన్నో కుటుంబాల స్త్రీలు ఈ విషయంలో కృంగిపోతూ వుంటారు. మన స్త్రీ భారతనారీ కనుక కనీసం కన్న తల్లి తండ్రులతో కూడ చెప్పుకోలేనంత ఆత్మాభిమానం వాళ్ళది. ఈ స్త్రీలు అటు భర్తను మార్చనూలేక ఇటువదిలిపోలేక, అతని ప్రవర్తనతో రాజీపడనూలేక సతమతమైపోతూ వుంటారు. ఇది మరీ భరించరాని విషయం. ఎక్కువమంది స్త్రీలలో ఇదే జరుగుతుంది.

మరి, దీనికి పరిష్కారమేమిటంటే సమాధానంలేదు. ఒక్కొక్కసారి అన్పిస్తుంది. ఎవరన్నా ఏదన్నా మంత్రంవేసి శ్రీనివాసరావులాంటి వాళ్ళనందర్ని మార్చివేస్తే బాగుండునని.

అసలు నేనిక్కడ చెప్పవల్సిన విషయం ఇదికాదు.

పెళ్ళాం చనిపోయి నెలతిరక్కుండానే అతనిగురించి పూర్తిగా తెల్సివుండికూడ ఈ వీధిలోనివాళ్ళే అతనికి పిల్లనివ్వడానికి ఎగబడుతున్నారంటే, ఇంకా మన ఆడపిల్లల పరిస్థితి ఎంత దయనీయమయంగా వుందో చూడండి.

ఈ వీధిలో వాళ్ళు అతని స్కూటరుని హోదాని చూసి గౌరవించే వాళ్ళేకాని నిజంగా అతనిమీద ఎవరికీ గౌరవంలేదు. అందరూ అసహ్యించుకొనే వాళ్ళే! ఒక్కొక్కసారి అతను భార్యని మానసికంగా, శారీరకంగా పెట్టే హింసలు చూడలేక చనువున్నవాళ్ళు అతనికి నీతులు చెప్పిన వాళ్ళే! మరి ఇప్పుడేమిటి ఇలా ప్రవర్తిస్తున్నారు?

వీళ్ళు పిల్లలులకిచెప్పే హితోక్తు ఎలా వుంటాయంటే ...


KayGeeLene
FABRICS
FOR
LIVE LONG
STYLES!
LOOK LONG
FASHIONS!!
BANKIMCHANDRA & CO.
BOMBAY - 400 002
Bachi
SAMATA

—రెండో పెళ్ళివాడయితేనేం— రెండు చేతులా సంపాదిస్తున్నాడు అది చాలదూ—? నీకు రెట్టింపు వయసు వుంటేనేం, ఇంట్లోవున్న రెండు యు—ఫోం పరుపులను గుర్తుకి తెచ్చుకో! తలుపులు రెండూ మూసితంతేనేం, పెద్ద ఇంట్లో వుండవచ్చుగా! సరిగ్గా చూడక పోతేనేం అందరిలో అంతస్తు, హోదా పెరుగుతుంది! త్రాగుతాడు, తిరుగుతాడంటావా-ఇంట్లో ఫ్రిజ్‌వుంది కాబట్టి నీవు త్రాగవచ్చు చల్లటినీళ్ళు, ఆపైన నీవు కూడ సరదాగా తిరగటానికి స్కూటరుందని తల్చుకో! ఆడపిల్లకి ఇంతకన్నా ఏంకావాలి—?

దురదృష్టమేమిటంటే తంద్రులమాట అటుంచి ఈ హితోక్తులు చెప్పే వాళ్ళలో ఒకళ్ళిద్దరు తల్లులు స్త్రీ ఉద్ధరణకి కంకణం కట్టుకొన్నవాళ్ళే! ఒకామె 'స్త్రీకి వివాహ విషయంలో స్వేచ్ఛకావాలంటే' మరొకామె 'భర్తతిడితే పూరు కోటానికి, తంతే పడివుండటానికి ఆడదంటే ఆటబొమ్మకాదు, రక్తమాంసాలు గల మనిషి, అంటూ మహిళామండలిలో ఉపన్యసించినవాళ్ళే.

ముత్తానికి మూడవనెల తిరక్కుండానే ఒక ముహూర్తాన పట్టణ పురప్రముఖ సమక్షాన శ్రీనివాసరావుపెళ్ళి బ్యాండు మేళాలతోపాటు ఘనంగా జరిగిపోయింది. పోటీలో యే పెద్దమనిషి నెగ్గాడు పిల్లయెవరన్నది మనకి అనవసరం బలియివ్వటానికి ఏ మేకపిల్లయితేనేం—?

అతనుకట్టే తాళి పసుపుత్రాడే అవుతుందో, ఉరిత్రాడే అవుతుందో! అతను మారితే పిల్లదాని అదృష్టం, మారకపోతే దాని దురదృష్టం అంటూ 'అదృష్ట దురదృష్టాల'కి పరీక్షపెట్టి వదిలేసే ఈ తల్లీ తండ్రులనేమి అనాలో పారకమహాశయా ఆలోచించదొక్క క్షణం!! □

తుపాను పాలబడి
ఆస్తులనూ, ఆత్మీయులనూ కోల్పోయి
అల్లల్లాడుతున్న
సాటి మానవులకు
మీ శక్తిమేరకు

సాయం చెయ్యండి

సీరియల్



మనిషికేం కావాలి?

—కొమ్మూరి వేణుగోపాలరావు

అక్కడ వున్నంతసేపూ అదే ధోరణి

కాసేపు కడుపువైపు చూపిస్తుంది. 'ఇదేమిటీ' అన్నట్లు చేతులు పెడుతుంది. అంతలో నావంక చూస్తోంది. ముఖంలో ఒక పిచ్చినవ్వు

చెయ్యి గాల్లో తమాషాగా ఆడించి, నాలికలో ప్చ ప్చ అన్నట్లు చప్పుడుచేసి "నే వెడుతున్నాగా నే వెడుతున్నాగా" అన్నట్లు చూపిస్తూంది

అంతలో ఫిట్‌లా వస్తుంది కాళ్ళూచేతులూ బిగుసుకుపోతాయి గొంతులోంచి హృదయ విదారకమైన మూలుగు వినిపిస్తుంది

దాని అవస్థ నేను చూడలేకపోయాను కడుపులో ప్రేవులు కదలిపోయినట్లు యింది కళ్ళు తుడుచుకుంటూ యివతలకు వచ్చాను

వాళ్ళమ్మ నా వెనకేవచ్చింది మూడు నెలల బట్టీ యిలాగే తీసుకుని తీసుకుని యీస్థితికి వచ్చిందిట పెద్ద పెద్ద డాక్టర్లందరూ చూశారు మొదట్లో వ్యాధి

జరిగిన కథ

తాను ప్రేమించిన శ్రీకాంత్ ద్వారా విశ్వం పరిచయమయ్యాడు సునీతికి నారీ ద్వేషి అయిన విశ్వాన్ని సునీతి అసహ్యించుకొంది సునీతిని రక్షించి ఆదుకొన్న రాజారావుగారు తన ఆస్థిలో విశ్వానికి వాటా ఇచ్చారు రాజారావుగారు మరణించడంతో ఆవేదనలో విశ్వం ఓదార్పు కోరింది సునీతి రెండు నెలలుగా ఆ ఊరిలో లేని శ్రీకాంత్ రావడంతో సునీతి సంఘర్షణకు లోనైంది తనకు తెలియకుండానే విశ్వాన్ని కోరుకొన్న భావన, శ్రీకాంత్‌ని వదులుకోలేని స్థితిలో సతమతమైపోసాగింది శ్రీకాంత్ పెళ్ళి ఏర్పాట్లు చేసేశాడు కాని చివరిక్షణంలో విశ్వంతో వెళ్ళిపోయి అతన్ని చేసుకొంటుంది సునీతి విశ్వం మధురలో హోటల్‌పెట్టి కొద్ది కాలంలోనే డబ్బూ, హోదా సంపాదిస్తాడు అనుకోకుండా కలిపిన వినయబాబుద్వారా తన స్నేహితురాళ్ళు జ్యోతిల విశేషాలు తెలుస్తాయి సునీతికి ఉష పిచ్చిదై ఆస్పత్రిలోవుంది జ్యోతి ఉష, ఆరోగ్యంచెడి ఇంటిదగ్గరే ఉంటోంది వారిని చూసేందుకు హైదరాబాదు వెళ్ళింది సునీతి!

నిర్ణయం చెయ్యలేక పోయారు కడుపులోకి నీరు కూడా వచ్చాక ఆ నీరుతీసి పరీక్షలకు పంపి క్యాన్సర్ అని నిర్ణయించారు అప్పటికి సమయంమించిపోయింది లాభంలేదని చెప్పిపంపించేశారు

వాళ్ళమ్మ చెప్పేదివింటూ మధ్య మధ్య జ్యోతి దగ్గరకు వెళ్ళి చూస్తూ అక్కడ చాలాసేపు గడిపాను

నేను బయల్దేర బోతూండగా మురారి వచ్చాడు మనిషి బక్క చిక్కివున్నాడు గడ్డం పెంచాడు అతన్నిచూసి అసహ్యమేసి పలకరించ కూడదనుకుని, ముఖం ప్రక్కకి త్రిప్పుకోబోయాను గాని, అతనే "నమస్కారమండీ" అని పలకరించాడు

సమాధాన మివ్వక తప్పలేదు

అతన్తో సంభాషణ చాలా క్లుప్తంగా జరిగింది తర్వాత అక్కణ్నుంచి హోటల్ రూంకి వెళ్ళిపోయాను.

రోజూ వెళ్ళి జ్యోతినిచూసి వస్తూనే వున్నాను రెండు మూడుసార్లు ఉష దగ్గరకెళ్ళాను

రాత్రింబవళ్ళు వాళ్ళ స్వరూపాలే కళ్ళముందు మెరుస్తూ వుండేవి. ఎలాంటి జీవితాలు ఎలా తారుమారయిపోయినాయి దుఃఖం ఆపుకోలేక పోయేదాన్ని

వారం రోజులు గడిచాక—జ్యోతి చచ్చిపోయింది

ఆమెను తీసుకెళ్ళేవరకూ ఆయింటిలోనే కూర్చుండి పోయాను నా కన్నీళ్ళు యింకిపోయినట్లు, పొడిగా కళ్ళు గ్రుచ్చుకుంటున్నాయి ఎవరెవరో వస్తున్నారు. పోతున్నారు నే నెవర్నిగురించీ పట్టించుకోవటం లేదు.

చివరకు గుండెల్ని కోసివేసే ఏడుపుల మధ్య జ్యోతిని తీసుకెళ్ళిపోయారు

వెళ్ళటానికి లేచి గుమ్మందాటాను

"సునీతీ!"

ఎవరు? గుండె గబగబ కొట్టుకుంది

వెనుదిరిగి "శ్రీకాంత్!" అన్నాను తడబడే గొంతుకతో

ఎవరగి? నా శ్రీకాంతేనా? కాషాయ బట్టలు వేసుకుని వున్నాడు. గడ్డం పెరిగి వుంది కళ్ళు కాంతితో మిలమిల మెరుస్తున్నాయి ముఖంలో చిలిపితనం పోయి గంభీరత్వం కనిపిస్తోంది

అతన్నారూపంలో చూడగానే భూమిని చీల్చుకుని ఆ పొరల్లోకి ఎక్కడికో వెళ్ళిపోవాలనిపించింది

"సునీతీ! ఎప్పుడొచ్చావు?"

"వారం రోజులయింది "

"జ్యోతి పోయిందని తెలిసి యింతకుముందే వచ్చాను రాగానే నువ్వు కనిపించావు, అప్పుడే పలకరిద్దా మనుకున్నాను కాని నువ్వీలోకంలో లేవు?"

నేనేం మాట్లాడలేదు క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టి నాలో ప్రజ్వరిల్లే ప్రకంపనను అణిచిపెట్టటానికి ప్రయత్నిస్తూన్నాను


"సునీతీ! విశ్వం బాగున్నాడా?"

తల ఊపాను

"ఇలా నిన్ను చూడగలగటం ఆశ్చర్యంగావుంది పద అలాపోతూ మాట్లాడుకుందాం నాతో రావటానికి నీకేమైనా అభ్యంతరమా?"

లేదన్నట్లు తల ఆడించాను

పాపాయిని ఫారెక్స్‌తో పెంచుతునందుకు నిజంగా నేను గర్విస్తున్నాను



మా డాక్టర్ అన్నారు: "పాపాయికి 3 నెలలు వచ్చాక కేవలం పాలు మాత్రమే ఇస్తే చాలదు. వానికి కావాలి ఫారెక్స్".

డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు ?

అందుకు రెండు కారణా లున్నాయి. పెరిగే మీ పాపాయికి కావలసిన మొట్టమొదటి సంతులిత మైన ఆహారాన్ని ఇది పూర్తిగా సమకూరుస్తుంది. సున్నితమైన పాపాయి జీర్ణకోశానికి ఇది సరిగ్గా సరిపోతుంది కూడా.

ఫారెక్స్ ఏ విధంగా పాపాయికి తగిన సంతులిత ఆహారం ?

పాపాయి మెదడు, శరీరం పెరుగుదల కోసం ఫారెక్స్ సులభంగా జీర్ణమయ్యే ప్రోటీన్లను తగినంతగా అందిస్తుంది. పాపాయికి శక్తినిచ్చేందుకు కార్బోహైడ్రేట్లను కూడా సమకూరుస్తుంది. ఫారెక్స్‌లో పాపాయి రక్తాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తగినంత ఐరన్ ఉంది. మరో విషయం. ఫారెక్స్‌లో మీ పాపాయికి దృఢమైన ఎముకలు, గట్టి పళ్ళు పెరిగేందుకు తోడ్పడే కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ డి తగినంతగా ఉన్నాయి.

3 నెలలు వచ్చాకనే ఎందుకు ?

ఈ వయస్సులో పాపాయికి నమలడం అలవాటు కావాలి. ఇప్పటినుంచే ఫారెక్స్ ఇచ్చినట్ల-యితే పెద్దవాడయ్యాక తినే ఆహారాన్ని సరిగ్గా నమిలి చక్కగా జీర్ణం చేసుకోగలడు.

బంగాళ దుంపలు ఉడికించి మెత్తగాచేసి ఇస్తే కాదా ?

మీ పాపాయికి ఏదైనా ఘన ఆహారం పెట్టే ముందు పాపాయి జీర్ణశక్తి గురించి కూడా కొంచెం ఆలోచించండి. 3 నెలలప్పుడు పాపాయి జీర్ణకోశం ఇంకా సున్నితంగా ఉంటుంది. అందుచేత, అతడు సులభంగా జీర్ణం చేసుకోగలిగే ఘన ఆహారమే ఇవ్వాలి. పైగా, మామూలుగా ఇచ్చే ఆహారాలు సంతులితమైనవి కావు. మీ పాపాయికి అతి ముఖ్యంగా కావలసిన ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ డి మొదలైన వన్నీ అవి సమకూర్చలేవు. అందుకే 3 నెలలు వచ్చాక మీ పాపాయికి ఫారెక్స్ తప్పని సరిగా ఇవ్వాలని డాక్టర్లు చెప్పడంలో ఆశ్చర్యం లేదు.

"పెద్దలు తినే ఆహారాన్ని" ఎప్పటి నుంచి ఇవ్వవచ్చు ?

మొదటిసారిగా పాపాయి తప్పటడుగులు వేసినప్పుడు అతడికి పళ్ళు, కూరగాయలు, పప్పు, గుడ్లు ఇవ్వండి. అయితే ఫారెక్స్‌ను మాన్పించకండి. మీ పాపాయికి మూడేళ్ళు వచ్చేవరకు, కొంచెం ఆలోచించి అతడు తినేవాటన్నిటిలో ఫారెక్స్ కలిపి పెట్టండి.



సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదలకోసం పాపాయి మొట్టమొదటి ఘన ఆహారం.

గ్లాక్సో

లింటాస్-GF.87-1710 TL (R)

"రా మరి" అతను ముందుకు నడిచాడు. కొంత దూరంలో అతని లేత ఆకు పచ్చ ఫియట్ ఆగివుంది

"అప్పటిదే, కారు మార్చలేదు "

డోర్ తెరిచి, మళ్ళీ ఏదో తోచినట్లు "నువ్వు డ్రైవ్ చేస్తావా?" అనడిగాడు

నాకు మొట్టమొదట డ్రైవింగ్ నేర్పింది శ్రీకాంతే నేర్చుకున్నది కూడా యీ కారు మీదే

"వొద్దు"

లోపలకూర్చుని, అటువైపు ఫ్రంట్ డోర్ తెరిచాడు నేనూ వెళ్ళి కూర్చుని "సన్యాసులు కారు డ్రైవ్ చేస్తారా?" అన్నాను నవ్వు తెచ్చుకుంటూ

"దొంగ సన్యాసులు చేస్తారు "

"నిన్ను చూస్తే అలా అనిపించడం లేదే "

అతను నవ్వాడు! ఆ నవ్వు ఎంతో సమ్మోహనంగా, హాయిగా, జాహ్నవీ తరంగంలా గోచరమై ముగ్ధురాల్నయి పోయాను

"అది నా నటన కావచ్చుగా?"

"అబద్ధం నాకు తెలిసిన వ్యక్తుల్లో నటించటమనేది తెలియన్ది నీ కొక్కడికే "

"నాగురించి ఏమోగాని, నాకు యింకొకరి విషయం మాత్రం ఖచ్చితంగా తెలుసు సునీతీ!"

"ఎవరి గురించి?"

"విశ్వం! నాకు తెలిసినంత వరకూ అతనెప్పుడూ నటించలేదు చెప్పటాని కిష్టం లేనివి దాచిపెట్టాడు అంతే "

శరీరమంతా అగుపించని అంకుశాలతో మాట్లు పొడిచినట్లయింది

"శ్రీకాంత్! సన్యాసులు దేముళ్ళగురించే మాట్లాడాలి మనుషులగురించి మాట్లాడరాదు!"

"నేను దేముళ్ళ గురించే మాట్లాడుతున్నాను "

అతని ఉద్దేశం అర్థమైంది కాని తర్కించే స్థితిలో లేను కారు మెత్తగా సాగిపోతుంటే మెదలకుండా వూరుకున్నాను

"సునీతీ! మాట్లాడటం లేదేం?"

"వినాలనిపిస్తోంది మాట్లాడాలనిపించటం లేదు."

అతను మళ్ళీ నవ్వాడు

"మరీ అంత స్వార్థం పనికిరాదు సునీతీ!"

పదినిమిషాలు గడిచివుంటాయి కారుబ్రేకుపడి ఆగంగానే పరధ్యానంనుంచి కోలుకున్నాను కారు శ్రీకాంత్ యింటిముం దాగివుంది.

"సునీతీ! దిగు"

లోపలకు అడుగు పెడుతూంటే ఆ యింట్లోని మార్పులన్నీ కొట్టొచ్చినట్లు కనిపించాయి ఎటుచూస్తే అటు ఏవేవో ఎక్స్‌టెన్షన్స్ కనిపిస్తున్నాయి, ఎక్కడ పడితే అక్కడ మనుషులు, ఆడువారు, పిల్లలు, వయసు మళ్ళినవారు ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమై కనిపించారు ఒకచోట గీతా పారాయణం జరుగుతుంది ఒక గదిలో పిల్లలు శ్రద్ధాసక్తులతో చదువుకుంటున్నారు ఒక భాగం హాస్పిటల్‌లావుంది పేషెంట్లు చాలామంది వచ్చి జబ్బులు చెప్పి చిన్నచిన్న పొట్లాలలాంటివి తీసుకెళ్ళి పోతున్నారు కొంతమంది ఆడవాళ్ళు ఏవో పనిపాటలు చేస్తున్నారు ఒకచోట భగవతార్చన జరుగుతోంది ఆఖరికి ఆతని డ్రాయింగ్ రూం బెడ్‌రూంలతో సహా అన్ని వివిధ కార్యక్రమాలకు నియోగించబడి వున్నాయి

శ్రీకాంత్ వాళ్ళతో మధ్య మధ్య ముచ్చటిస్తూ, వాళ్ళు చెప్పేది వింటూ నలు వైపులా కలయ తిరుగుతున్నాడు వాళ్ళంతా అతన్తో మాట్లాడేటప్పుడు "బాబు గారూ!" అని ఎంతో నమ్రతతో సంబోధించటం నన్నాకర్షించింది

"సునీతీ! యిక్కడ నేను ఓ చిన్న పాఠశాల, గీతా మందిరం, ఉచిత ఆసుపత్రి నడుపుతున్నాను ఆసుపత్రి అంటే హోమ్యోపతీ చికిత్స యిస్తా మన్నమాట ఈ మధ్య హోమియో మీద నాకు అభిరుచి పెరిగిందిలే!"

"బాగానేవుంది గానీ నువ్వుండే జాగా ఏదీ? నీ గదులన్నీ యిచ్చేసినట్లున్నావు? ఎక్కడుంటున్నావు మరి?"

అతను నవ్వాడు "నేను వేరేచోట వుంటున్నాను"

"ఎక్కడ? ఊరికి దూరంగా పూరిపాకేదన్నా వేసుకుని, అందులో నివసిస్తున్నావా?"

"కాదులే ఇల్లులాంటిదే అదికూడా చూపిస్తాను పద ఇప్పుడే వస్తాను" అని అతను యిద్దరి ముగ్గురిదగ్గరకు వెళ్ళి వాళ్ళ కార్యక్రమాలని గురించి క్లుప్తంగా చర్చించి, కొందరికి ఏవేవో పురమాయించి అయిదు నిమిషాల్లో మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు

"పద"

ఇద్దరం మళ్ళీ బయటకువచ్చి కారెక్కాం

ప్రొద్దుటినుంచీ నాకు తిండీ తిప్పలూలేవు, అయినా వాటిమీదకు ధ్యాసపోవటం లేదు నేను హైదరాబాద్ వచ్చేముందు శ్రీకాంత్ ఎక్కడో అక్కడ కనబడతాడని తెలీదా? తెలిసే ఆ ఆలోచనను అర్థం చేసుకోవటానికి రాజీ పడక త్రొక్కి పట్టానా? నా మనసు నాకు తెలియటం లేదు

"ఇంటికి వచ్చాం సునీతీ! ఈ లోకంలోకిరా!"

ఉలికిపడి దృష్టి ముందుకు మరల్చాను మళ్ళీ ఉలికిపడ్డాను ఇదేమిటి? యిది మా యిల్లు

"ప్రస్తుతం నేను వుంటూన్న యిల్లు యిదే సునీతీ! లోపలకు పోదాంరా?

తలంతా ఆలోచనలతో ఉద్విగ్నమై, ఉక్కిరి బిక్కిరై చివరకు బండ బారి పోయింది మంత్ర బద్ధలా కారుదిగి అతనివెంట నడిచాను

బయట తలుపు తాళం వేసివుంది చేతిలోవున్న చిన్న జిప్ బాగ్‌లోంచి తాళం చెవితీసి తలుపు తెరిచాడు

లోపలకడుగు పెడుతూంటే కాళ్ళు వణికిపోయినాయి ఎదురుగుండా అమ్మ సరస్వతి, నాన్న రాజారావుగారిదీ పెద్ద సైజు ఫొటోలు గోడకు అమర్చివున్నాయి. వళ్ళు ఝల్లుమన్నది. వాళ్ళంతా బ్రతికేవుండి ఆయింట్లో సంచరిస్తున్నట్లు అనుభూతి కలిగింది ఆ ఫొటోలదగ్గర నిలబడి అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాను

"సునీతీ!"

"ఊ!"

"ఏడుస్తున్నావా?"

"ఊహూ. ఏడుపు మరిచిపోయాను."

"నువ్వింతగా ఎదిగితే నాకు సంతోషం సునీతీ!"

అతనివైపు తిరిగి సూటిగా కళ్ళలోకి చూశాను. కాని ఎక్కువసేపు చూడ టానికి శక్తి చాలలేదు.

"సునీతీ! నువ్వు చాలా అలిసివున్నావు. కాసేపు విశ్రాంతి తీసుకో."

"పర్వాలేదు."

"పర్వాలేదు కాదు. నువ్వెలా వున్నావో నీకు తెలీదు."

"సరే" అని మంచంమీద కూర్చున్నాను.

"అలాకాదు. కాసేపు పడుకో. పోనీ నేనుండటం సిగ్గయితే-ఎలాగూ స్నానంచెయ్యాలి, మళ్ళీ వస్తాను" నా సమాధానం కోసం చూడకుండా అతను చక చక నడుస్తూ లోపలకు వెళ్ళిపోయాడు

అతని ఆజ్ఞ శిరసావహిస్తున్నట్లుగా నెమ్మదిగా వెనక్కి వాలాను మెదడు యింకా బండబారే వుంది ఆలోచించే ప్రయత్నం చెయ్యకుండా కళ్ళుమూసుకుని భావరహితమైన స్థితిలో వుండటానికి ప్రయత్నించాను

అలా ఎంతసేపు గడిచిందో తెలీదుగాని, అడుగుల చప్పుడయితే కళ్ళు విప్పి చూశాను

ఎదురుగా శ్రీకాంత్ అప్పుడే వేసుకున్న కాషాయవస్త్రాల్లో స్వచ్ఛంగా, స్నిగ్ధంగా ప్రకాశిస్తున్నాడు హిమాలయాలనుండిఅప్పుడే దిగివచ్చిన పురుషోత్తముడిలా గోచరించాడు

"శ్రీకాంత్! ఈ యిల్లు ఎలా స్వాధీనం చేసుకున్నావు?"

"ఏముంది? తర్వాత ఏంచెయ్యాలో తెలీక యింటికి తాళం వేశాను అన్ క్లెయిమ్‌డ్ ప్రాపర్టీక్రింద జమకట్టి గవర్నమెంటు స్వాధీనపర్చుకోవటానికి ప్రయత్నించింది వాళ్ళకి కోరినంత డబ్బుకట్టి యీయిల్లు నా సొంతం చేసుకున్నాను"

"ఎందుకలా చేశావు?"

"తర్వాత చెబుతాను. ముందు వెళ్ళి స్నానంచేసిరా కొంత అలసట తీరుతుంది "

"స్నానంచేస్తే ఇక్కడ మరి వేరే బట్టలో?"

"ఈ యింట్లో కాషాయవస్త్రాలకి కొదవలేదు యిస్తానుండు" అని బీరువా తెరిచి చిన్న సూట్‌కేసు బయటకు తీశాడు "ఇవి సరికొత్తవని చెప్పనుగాని, యిస్త్రీ చేసినవి వున్నాయి మరి వెళ్ళిరా?"

ఇహ తర్కించకుండా లోపలకు వెళ్ళి తలుపేసుకున్నాను బాత్‌రూంలో ఓ యిస్త్రీ టవల్ ఎప్పుడుంచాడోగాని, వొంకెకు పెట్టివుంది

ఇది నా స్నానాలగది నాకేమీ కొత్తగాలేదు వెచ్చటినీళ్ళు మీద పోసుకుంటూంటే, మొద్దుబారిన మస్తిష్కం తిరిగి దారిలోకి వస్తున్నట్లు, చురుకుతనం తిరిగి ప్రవేశిస్తున్నట్లూ అనుభూతులు కలిగాయి

స్నానం ముగించి, టవల్ వంటికి చుట్టబెట్టుకుని, అతనిచ్చిన సూట్‌కేసు తెరిచాను

ఒక్కక్షణం నిర్ఘాంతపోయాను అందులో వున్నవి కాషాయంబరాలు కావు నేనిదివరకు వేసుకునే చీరె, జాకెట్లలో రెండుమూడు వున్నాయి ఒకప్రక్కన అమ్మ నాకు చేయించిన నీలంరాళ్ళ నెక్లెస్‌కూడా వుంది

ఇవి ధరించమని శ్రీకాంత్ ఆజ్ఞ క్రిక్కురుమనకుండా అందులో ఒక చీరే, జాకెట్టూ తీసి వేసేసుకున్నాను `ఇవి ధరించినప్పుడు ఒకప్పుడు శ్రీకాంత్ 'బ్లూ డైమండ్' అని పిలిచినట్టు గుర్తు నెక్లెస్‌కూడా మెడకు అలంకరించుకున్నాను

తలుపులు తెరిచి బయటకు వచ్చేసరికి శ్రీకాంత్ తలవంచుకుని కప్పుల్లో కాఫీ పోస్తున్నాడు

"సన్యాసీ!" అని పిలిచాను

తలఎత్తి నావంక చూసి నవ్వి 'గుడ్' అన్నాడు. "అలావుండాలి బుద్ధిమంతురాలిగా రా కూర్చో. కాఫీ త్రాగుదాం!"

తలింకా దువ్వుకోలేదు అతనికెదురుగా ఓ కుర్చీలో కూర్చుంటూ 'సన్యాసులు పాలూ, పళ్ళూ తీసుకుంటారంటారే నువ్వేమిటి కాఫీ త్రాగుతున్నావు?"

"చెప్పానుగా నేను దొంగ సన్యాసినని ఈ సన్యాసి కాఫీలూ త్రాగుతాడు. షడ్రసోపేతంగా భోజనమూ చేస్తాడు!"

అని కాఫీ కప్పు నా చేతికి అందిచ్చాడు

"రెండోదాన్నిగురించి నాకు కొంత అనుమానముందిగానీ యింత శ్రీమంతుడివి. ఇవన్నీ చేసిపెట్టటానికి మనుషులు లేరా? ఎవరూ కనిపించరేం?"

"పనివాడు, పనిచేసే అమ్మాయి వస్తారు. వాళ్ళవాళ్ళ టైముల్లో విధులు ముగించుకుని వెళ్ళిపోతారు. ఇక్కడ నేను తప్ప ఎవరూ వుండటానికి వీల్లేదు."

"ఎందుకని?"

"వీల్లేదు అంతే." మాట కఠినంగా వున్నా ముఖంలో ప్రశాంతత చెదరలేదు.

"మరి వంట?"

"నేనే చేసుకుంటున్నాను!"

"ఎందుకు నీకు నువ్వు శిక్ష విధించుకుంటున్నావు?"

"ఇది శిక్షకాదు. ఆనందం."

ఒక్క నిముషం మౌనంగా గడిచింది. కాఫీ త్రాగటం ముగించి కప్పు టీపాయి మీద వుంచాను.

" . ఈయిల్లు శిథిలాలయంలా మారిపోయివుంటుందనుకున్నాను. ఎంత నీట్‌గా, ఆకర్షణీయంగా వుంచావు? నా చీరెలూ అవీ....నాకు చాలా ఆశ్చర్యంగా వుంది శ్రీకాంత్!"

అతనేం మాట్లాడలేదు.

"మాట్లాడవేమి శ్రీకాంత్?"

"ఇప్పుడు వినటం ఆనందంగా వుంది."

"అంత స్వార్థంవద్దు. ఏవీ? నా వస్తువులు యింకేవేవి భద్రపరిచావో చూపించు."

"చూపిస్తాను రా" అతన్తోపాటు నేనూ లేచాను.

గదులన్నీ త్రిప్పాడు. నా పుస్తకాలు, పెన్, ట్రాన్సిస్టర్, నేను చిన్నపిల్లలా ఆడుకునే కీ బొమ్మలూ అన్నీ .... ఒక్కటికూడా పోకుండా అన్నీ వున్నాయి.

"ఇది చూడు" అని ఓ మూలవున్న సైకిలు చూపించాడు. పాతదై, తుప్పు పట్టకపోగా, అప్పుడే ఎవరో తుడిచినట్టు నీట్‌గా నిగనిగలాడుతోంది.

ఇహ నిగ్రహించుకోలేకపోయాను. "శ్రీకాంత్! శ్రీకాంత్!" అనుకుంటూ బయటకు పరిగెత్తి మంచంమీద వాలిపోయాను.

"ఏడుపు మరిచిపోయిన వాళ్ళు....నిగ్రహంగానే వుండాలి."

నేను చప్పున లేచి కూర్చుని "ఎందుకు శ్రీకాంత్ ఏడుపు? అందులో నాకేమీ బాధా విస్ఫృత్తి కనబడదు" అన్నాను.

"అంటూనే మనుషులు ప్రలోభానికి లొంగిపోతూ వుంటారు "

*   *   *

అంతవరకూ టైమెంతయిందో అన్న ధ్యాసేలేదు. చూసుకునేసరికి సాయంత్రం దాటిపోయింది.

"అయ్యయ్యో చాలా టైము అయిపోయిందే" అని ఆతృత వెలిబుచ్చాను

"అవును సునీతీ! ఇంకాసేపట్లో చీకటి పడుతుందికూడా నువ్వే హోటల్లో దిగావో చెప్పు. డ్రాప్ చేస్తాను "

"ఉహూ వెళ్ళనిప్పుడు "

"అదేమిటి? వెళ్ళక ఏంచేస్తావు?"

"ఈపూట నీకు వొండిపెడతాను "

ఒక్కక్షణం అతని ముఖంలో ఏవేవో భావాలు దొర్లిపోయాయి అంతలోనే ఆ స్థానాన్ని ప్రశాంతత ఆక్రమించింది.

"నువ్వు వంట బాగా చెయ్యటం నేర్చుకున్నావా సునీతీ! అయితే చెయ్యి!"

వంటింట్లో సామానంతా ఏమీ వెతుక్కోని కష్టపడకుండా అమర్చివుంది. నాకు ప్రయాసేం అనుభవించలేదు ఓ గంటలోపల ఫ్రిజ్‌లోని కూరగాయలతో, టేబిల్‌మీద గ్రైండర్ సాయంతో కూర, పచ్చడి, పులుసు అన్నీ చేశాను

అన్నంతింటూ శ్రీకాంత్ "వెరీగుడ్ వంట చాలా బాగాచేశావు సునీతీ" అంటూ మెచ్చుకున్నాడు

ఇద్దరం ప్రక్కప్రక్కనే కూర్చుని భోజనంచేశాం ఎక్కడో పరాయి చోట వున్నట్లు నా మనసుకెందుకో అనిపించటంలేదు

"చాలా పొద్దుపోయింది సునీతీ "

"అయితే"

"నీకాలశ్యం అయిపోవటంలేదూ?"

"నన్నిక్కడ్నించి తొందరగా పంపించేద్దామనుకుంటున్నావా?"

"నేనేమీ అనుకోవటంలేదు "

"మరి?"

"నీ యిష్టం" అంటూ వాష్‌బేసిన్ దగ్గర చెయ్యి కడుక్కొని బయటకు వెళ్ళిపోయాడు

డైనింగ్ టేబిల్‌ని శుభ్రపరిచి, గిన్నెలు సర్ది నేనివతలకు వచ్చేసరికి అతను మంచంమీద పడుకుని వున్నాడు కనులు మూసివున్నాయి నిద్రపోవటంలేదని తెలుసు.

మంచంమీద బాలయోగిలా, తేజస్సు వుట్టిపడుతూ పడుకునివున్న శ్రీకాంత్ నాకెంతో అందంగా, అద్భుతంగా గోచరించాడు

అతని కాళ్ళవైపుకు కుర్చీలాక్కుని కూచున్నాను. ఆ అలికిడికీ కనులు విప్పలేదు

"మౌనముద్ర అనుకుంటాను అవునా బాబుగారూ" అనేశాను అప్రయత్నంగా.

(సశేషం)

మీ ప్రశ్నకు మా
మా ప్రశ్నకు మీ **జవాబు**

నిర్వహణ: ధనికొండ హనుమంతరావు

ఎస్. ఈశ్వరరావు, బొబ్బిలి.

ఒక రచయితకాని, రచయిత్రికాని ఒక నవలనుగాని, కథగాని సహజంగా ఉండేటట్లు రాస్తే, జరుగుతున్నది ఉన్నది వున్నట్లు రాయటం ఒక గొప్పేనా అని పాఠకులు అంటారు. అయితే రచనలు వాస్తవానికి దూరంగా వుండేటట్లు రాస్తే 'చాలా అసహజంగా వుంది' అని కొట్టిపారేస్తారు సినిమా కథల్లోకూడా యిలాంటి అభిప్రాయాలే ఉన్నవి. ఐతే సగటు పాఠకునికి లేదా ప్రేక్షకునికి ఎలాంటి కథలు నచ్చుతాయి? ఈ విషయంపై మీ అభిప్రాయం ఏమిటి?

(25 రూపాయలు బహుమతి పొందిన ప్రశ్న)

రచన వాస్తవంగావుంటే కేవలం జరిగింది జరిగినట్లుగా రాస్తే అది కేవలం వార్తలాటిది అవుతుంది. ఆ సహజత్వాన్ని రచనా శిల్పంతో జోడించి, మనసుకు పట్టే విధంగారాస్తే దాన్ని పాఠకుడు తప్పక మెచ్చుకునేందుకు ఎంతయినా అవకాశం వుంది. అంటే నిజంగా కావలసింది 'Reality' కాదు. Reality ఉన్న Realism. ఒక చిత్రకారుడు కొబ్బరిచెట్టు బొమ్మగీస్తే అది మనం మామూలుగా చూసే కొబ్బరి చెట్టుగానే వుంటే, దాన్ని మెచ్చుకోము. కాని ఆ కొబ్బరిచెట్టునే వంకర్లు తిప్పి కనులకు ఇంపుగాఉండేటట్లురాస్తే మెచ్చుకుంటాం. ఐతే దాన్ని చూడగానే కొబ్బరిచెట్టు అని అనుకోవాలి. దాని సొంపులు వేరేవిధంగా వుంటవి. అలాగే వాస్తవాన్ని వాస్తవికతగా మలచుకోవాలి. ఇక ఎలాటి కథలు పాఠకులకు నచ్చుతాయి? అనే విషయానికి ఎలాటి నిబంధనలూలేవు. ఎవ్వరూ చెప్పలేరు. ప్రయోగించి చూడటం తప్ప వేరు మార్గంలేదు.

మణిపాండురంగ, హైదరాబాద్.

హృదయపు లోతును సముద్రపు లోతుతో పోలుస్తారే, ఎందుకని?

రెండూ అగాధాలే గనుక.

ఆర్. సంజీవకుమార్, వరంగల్.

చీకటి లేనప్పుడు వెలుగు. వెలుగు లేనప్పుడు చీకటి వుంటుంది కదా! ఈ రెండూ లేనప్పుడు?

కొద్దో గొప్పో వెలుగులేని చీకటి ఉండదు. అకాస్త వెలుగుకూడా లేకుంటే చీకటి ఎలా కనిపిస్తుంది?

పి. మార్కండేయులు, గమడ.

మామూలు మనిషికి — కథలురాసే మనిషికి భేదం ఏమిటి?

మామూలు మనిషి ఆలోచించగలడు. కొన్ని సందర్భాలలో కథలురాసే మనిషి

డిసెంబరు ప్రశ్నకు సమాధానం.

ఏది పోగొట్టుకుంటే జీవితం దుర్లభమౌతుంది? ఎందుకని?

ఈ ప్రశ్నకు 'ప్రాణం' అనే జవాబు చాలామంది రాశారు ప్రాణం పోగొట్టుకోవటం (ఆత్మహత్య ఐతే తప్ప) ఎవరి ప్రయత్నంలోనూ లేదు. అందుకని ఏ వ్యక్తి కృషికాని యీజవాబు అంగీకరించలేము.

ఏదివున్నా లేకున్నా 'ధైర్యం' ఉంటే జీవితాన్ని పునరుద్ధరించుకోవచ్చు 'ధైర్యం', 'ఆత్మవిశ్వాసం' అనే యీరెండు జవాబుల్నీ అంగీకరించవలసి వస్తోంది

సరైన ఈ జవాబును చక్కని వివరణతో పంపిన ఈక్రింది పాఠకులకు బహుమతి మొత్తం పంచబడుతుంది

1 ఎస్. రవికుమార్, పార్వతీపురం.	2 వై. సుజాత, నెల్లూరు 2.
3 కె. రామచంద్రారెడ్డి, అనపర్తి.	4. పి. శ్రీనివాసరావు, విజయవాడ
5 టి. ప్రభాకరరావు, హైదరాబాదు.	6. ఎస్ పి. లక్ష్మణరావు, సికింద్రాబాద్.
7 టి. ఎస్. బాబూరావు, కడప.	8. ఎస్. విజయరాజు, వాల్తేరు.

కన్న గొప్పగా ఆలోచించగలడు. కాని తన భావాలను రాయలేడు. రాయగలిగే వాడు రచయిత అవుతున్నాడు. అదే భేదం!

సి హెచ్. వెంకటేశ్వరరావు, నెల్లూరు.

పతివ్రత, పతిత యిద్దరూ ఒకేసారి భగవంతుణ్ని నైవేద్యాలతో, భక్తితో పూజిస్తే దేముడు మరి ఎవరిపూజ ముందుగా అందుకుంటాడు?

ఎవరిది ముందుగా అందుకుంటాడో ఎవరికీ తెలియదు; అలాటి సాక్ష్యాధారాలు లేవు. కాని దేముణ్ని 'పతిత పావనుడు' అంటున్నారు కనుక పతిత పూజలేముందు అందుకుంటుండ వచ్చనుకోవాలి.

ఆర్. ఎస్. రామచంద్రరావు, పాల్వంచ

రచయితల సంఖ్య విపరీతంగా పెరిగి, స్థాయి అతి తక్కువ అయిపోయిన ఈ తరుణంలో ఇప్పటికే అనేకచచ్చు రచనలు చదవలేక అవస్థ పడుతుండగా ఇంకా కొత్త పత్రికలుతీసి మరి కొందరి చౌకబారు రచనలను ప్రోత్సహించడం లేదా? దీనికి విరుగుడు లేదా?

ఉన్నది. అలాంటి పత్రికల్ని ఆదరించక పోవటమనే ఆయుధం పాఠకులచేతుల్లోనే ఉన్నది. దాన్ని ప్రయోగిస్తే తిరుగే ఉండదు!

కిలపర్తి జగ్గారావు, శ్రీహరికోట.

పగటికలలకూ, రాత్రి కలలకూ తేడా ఏమిటండీ?

మొదటి కోవకు సంబంధించినవిపగలు నిద్రించేప్పుడూ, రెండోకోవకు సంబంధించినవి రాత్రి నిద్రించేప్పుడూ వస్తాంటవి.

బుస్సూరి ప్రతాప్‌జీ, నారాయణపురం

ప్రతి మగవాడి ప్రతిభ వెనుక ఆడదాని అదృశ్యహస్తం వుంటుందనీ మగవాడి ప్రతిభకు ఆడదాని అదృష్ట హస్తమే కారణమనీ కొందరు పెద్దల వాదన ఎంతవరకు సమంజసం?

నిజమే అయుండొచ్చు ఒకమహా రచయిత ఒకగొప్పనవలరాచి తన భార్యకు అంకితమిస్తూ ఆమె నాతో పోట్లాడిమూడునెలల పాటు పుట్టింటికివెళ్ళి ఆ మూడునెలల్లోనూ ఈ నవలనుపూర్తిచేసే అవకాశాన్ని నాకు కలిగించినకారణంగా అని పేర్కొన్నాడు. ఇందువల్ల ఆడదాని అదృశ్య (అదృష్ట) హస్తం వెనుక ఉన్నదనే అనుకోవాలి.

పి కనకవల్లి, నరసారావుపేట

క్రమశిక్షణ అవసరం అని అందరం వొప్పుకుంటాం కావాలని కోరుకుంటాం ఇతరులలో క్రమశిక్షణ మెచ్చుకుంటాం కాని మనం ఆ క్రమశిక్షణకు లోనయే పరిస్థితివస్తే తప్పుకోవటానికి ప్రయత్నిస్తాం ఏమిటీ మనస్తత్వం?

బెర్నార్డ్‌షా అన్నట్లు చేతనయినవాడు చేస్తాడు చేతకానివాడు ఇతరులకు చెపుతాడు అన్న సర్వసామాన్య మానవ మనస్తత్వమే అది.

బి వి ఆర్ గుప్తా, విశాఖపట్టణం

నా అభిమాన రచయిత(త్రు)ల పుస్తకాలుకొనిచక్కగా బైండింగ్‌చేయించి ఉంచుకోవడం నాకు చాలా యిష్టం అడిగిన వారికి కాదనకుండా పుస్తకాలను యిచ్చి చాలా పుస్తకాలన పోగొట్టుకున్నాను అన్ని పుస్తకాలన ట్రంకు పెట్టెలలోభద్రపరచుకున్నాను అద్దాల బీరువాల్లో అందంగా అమర్చుకోవాలన్న నాకోరిక తీరాలంటే నేనేం చెయ్యాలి?పుస్తకాలు కొనడంమానేయమంటారా?

మీ కోరిక తీరాలంటే ముందుగా అద్దాల బీరువాలు కొనాలి తరువాత పుస్తకాలుకొనో ఇతరుల దగ్గర ఎరువు తీసుకునోవాటిల్లో అమర్చుకోవాలి పుస్తకాలు తేవటం మానుకుంటే అద్దాల బీరువాలు మాత్రం మిగులుతవి పుస్తకాలు ఎరువివ్వటం మొదలుపెడితే అద్దాల బీరువాలే మిగులు ఆ బీరువాలనుకూడా ఎరువిస్తే ఇల్లుఖాళీ. మీరు వినలేదా—పుస్తకాలను ఎరువిచ్చేవాడు మూర్ఖుడు ఎరువు తీసుకొన్న పుస్తకాన్ని తిరిగి ఇచ్చేవాడు పరమమూర్ఖుడు.

ఎ సీతారామశాస్త్రి, విజయనగరం

ఈనాడు ఎక్కువగా తెలుగు నవలలు వస్తున్నాయి వాటిలో భాషా భావనా పటిమ కథాసంవిధానం చాలా బలహీనంగా వున్నా వాటిని తెలుగు సినిమాలుగా తీస్తున్నారు సాహిత్యరంగంలో విశిష్టస్థానం ఆక్రమించుకున్న నవలలు తెలుగు సినిమాలుగా రాకపోవడానికి కారణం?

ఆ విశిష్టస్థానాన్ని నాశనం చేసేందుకు ఇష్టపడని చిత్రనిర్మాతల గొప్ప ఆశయం.

తాగుడు కధ

రామానుజం చేతిలోని కాగితం చదివి ఆనందం పట్టలేక కెవ్వున కేక వేశాడు.

"ఏమిట్రా? ఎవరయినా పోయారా?" జాలిగా అడిగాడు రామ్మూర్తి.

"ఛట్-అదికాదురా! రేడియోలో నన్ను కథ చదవమని కంట్రాక్ట్ పంపించేరు." గర్వంగా అన్నాడు రామానుజం.

"ఓర్నీ—నీ ప్రతిభ రేడియోస్టేషన్ వరకూ పాకిందన్నమాట..." ఆశ్చర్యంగా అడిగాడు చంద్రం.

మరుక్షణంలో రామానుజం రేడియోలో కథ తనే స్వయంగా చదువబోతున్నాడన్న వార్త ఆఫీసంతా కొత్తగా వచ్చిన జీవోలా వ్యాపించిపోయింది. చాలామంది రామానుజం సీటుదగ్గర గుమికూడి పోయేరు.

"బ్రాడ్‌కాస్టింగ్ ఎప్పుడు?" అడిగింది టైపిస్ట్ సుమతి.

"వచ్చేనెల అయిదో తారీఖు...." పొంగిపోతూ అన్నాడు రామానుజం.

"అంటే ఆ రోజే మీరు రేడియో స్టేషన్లో చదువుతారా?" అడిగాడు సుదర్శనం.

"అబ్బే—అంతకు పదిరోజుల ముందు రికార్డింగ్ చేస్తారు. తరువాత అదే బ్రాడ్‌కాస్ట్ అవుతుంది...."

తనకు తెలిసిన విషయాలూ, మిగతా వారికి తెలీని విషయాలూ అన్నీ కలిపి యమ ఫో జు లో లెక్చరిచ్చేస్తున్నాడు రామానుజం.

అందరూ అతను చెప్పే విషయాలు విని హోరున ఆశ్చర్యపోతున్నారు.

"ఇప్పుడు నేను రాయాల్సిన కథే మిటో తెలుసా? తాగుడువల్ల కలిగే నష్టాలు కష్టాలు గురించి అల్లాలన్నమాట! అలా అని అది వ్యాసంలా ఉండకూడదు. మాంచి ఇంటరెస్ట్ కలిగించాలి వినే వారికి. అఫ్‌కోర్సు అదేమంత కష్టం కాదనుకో! నూటయాభయ్ కథలు వ్రాసిన వాడిని. కాబట్టి ఇట్టే రాసేయగలను ..."

"నీవి ఎనిమిదేగా పత్రికల్లో ప్రచురింపబడింది?" అనుమానంగా అడిగాడు రామ్మూర్తి.

"కాదని ఎవరన్నారు? అంతమాత్రాన రాసినవి నూటయాభయ్ కాకూడదని ఎక్కడయినా ఉందేమిటి?"

"ఒరేయ్ మమ్మల్నిద్దరినీ ఆ కథ చదివే రోజున నీతోపాటు రేడియో స్టేషన్‌కి తీసుకెళ్ళరా! మేమెప్పుడూ రికార్డింగ్ ఎలాచేస్తారో చూడలేదు...." బ్రతిమాలుతూ అన్నారు రామ్మూర్తీ, సుదర్శనం.

యర్రంశెట్టి శాయి

రామానుజం కొద్దిక్షణాలు ఆలోచించి "ఆల్ రైట్" అనేశాడు.

వాళ్ళిద్దరూ దేవుడు వరమిచ్చినంతగా పొంగిపోయారు ఆ జవాబు విని.

అసలు ఆఫీసులో ఆ ముగ్గురిదీ ఓ జట్టు. ఉదయం ఆఫీస్ కొచ్చేప్పుడూ, మధ్యాహ్నం లంచ్ కెళ్ళేప్పుడూ, సాయంత్రం ఆఫీస్ ముగిశాక ఎప్పుడు చూసినా ఆ ముగ్గురూ కలిసే కనిపించే వాళ్ళు అందరికీనూ.

ఆ రోజునుంచీ తాగుడువల్ల కలిగే హానిగురించి కథ తయారుచెయ్యడం మొదలు పెట్టాడు రామానుజం. తాగుడు వల్ల ఎన్నిరకాల నష్టాలు జరుగుతోంది ముగ్గురూకలపి ఎన్నో వివరాలు సేకరించారు. వాటన్నిటినీ రామానుజం తన డయిరీలో రాసుకొన్నాడు.

చివరకు కథ పూర్తయింది.

రికార్డింగ్ రోజున ఉదయం రమ్మన్న సమయానికి ఓ గంటముందే రేడియో స్టేషన్ చేరుకొన్నారు ముగ్గురూ. వాళ్ళిద్దరినీ బయట చెట్లకింద నిలబెట్టి, తను లోపలికెళ్ళి ఆ సెక్షన్ ఇన్‌ఛార్జికి తన కథ అందించాడు రామానుజం.

కథ చదివి "చాలా బాగా రాశాడు. తాగుడు వల్ల జరిగే కొన్ని దారుణాలు చాలా నేచురల్‌గా వర్ణించారు...." అని మెచ్చుకొన్నాడాయన. రామానుజం మరింత పొంగిపోయాడు.

రికార్డింగ్ పూర్తయింది రామానుజం టేబుల్ ముందు కూర్చుని మైకులో కథ చదవడం అది ఎదురుగ్గా ఉన్న గదిలో రికార్డవటం ఆనందంతో గమనించారతని మిత్రులు.

బయటికొచ్చేముందు డ్యూటీ ఆఫీసర్ రామానుజానికి ముప్ఫయ్ రూపాయలు చెక్కు కూడా అందించేడు. ఇది మరీ గర్వ కారణమయింది రామానుజానికి. అతను రాసిన నూటయాభయ్ కథలకూ ఎనిమిదే ప్రచురింపబడినాయ్. ఆ ఎనిమిది లోనూ రెండింటికే పారితోషికం లభించింది. మిగతా ఆరింటికోసం ఎన్ని ఉత్తరాలు రాసినా, టెలిగ్రామ్ లిచ్చినా ఏమాత్రం ఉపయోగం లేకపోయింది.

ముగ్గురూ బయటికొచ్చేరు.

రేడియో స్టేషన్ దగ్గర్లోనేవున్న బాంకులో చెక్కుమార్చి డబ్బు తీసుకొన్నాడు రామానుజం.

"ఒరేయ్ ఈ డబ్బుతో మాకు పార్టీ ఇవ్వవుట్రా?" అడిగారు రామ్మూర్తీ, సుదర్శనం

"పార్టీకోసం కాకపోతే నాకెందుకురా ఇది! జీతంలో ఎలాగూ పార్టీలు చేసుకోలేము. దీంతోనయినా కానిద్దాం...." అన్నాడు రామానుజం.

ముగ్గురూ వెంటనే బాంకు పక్కనే ఉన్న బార్‌లోకి నడిచి విస్కీ తాగేసి ఇళ్ళకెళ్ళి స్పృహలేకుండా పడిపోయారు. □

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

ప్రమోషన్‌పై జపాన్ దేశానికి వెళ తున్న సందర్భంలో శ్రీ డి. ఎన్.లింగం గార్ని ఈ శీర్షికలో పరిచయం చెయ్యడం మాకు ఆనందంగావుంది. ఎయిర్ఇండియా సంస్థలో దక్షిణభారత దేశపు విభాగానికి డిప్యూటీ మానేజర్‌గా వుంటున్న శ్రీ లింగం. ఇప్పుడు ఎయిర్ ఇండియాలో మేనేజర్ హోదాతో జపాన్‌లోని 'ఒసాకా' నగరంలో పనిచేయడానికి వెళుతున్నారు. 'నేను చదివిన ప్రదేశానికి వెళ్తున్నందుకు ఆనందంగా వుంది' అన్నారు శ్రీ లింగం ఈ సందర్భంలో. ఆయన ఒసాకా నగరంలో 25 సంవత్సరాల క్రితం ఉన్నత విద్య నభ్యసించి వున్నారు.

చదివింది సాంకేతిక విద్యే అయినా కళలపై విపరీతమైన ఆసక్తిగలవారు ఈయన. కాలేజిలో చదివే రోజుల్లో డిబేటింగ్ పోటీలలో ప్రథమ బహుమతు లందుకున్న శ్రీ లింగం నాటకాలలో నటించారుకూడా. కలకత్తాలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో అక్కడి ఆంధ్రా అసోసియేషన్ సెక్రటరీగా వున్నారీయన.

చాలామంది ఉన్నత విద్యకోసం అమెరికా, బ్రిటన్ దేశాలకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తారు. మీరు జపాన్ నెందుకు ఎన్నుకున్నారన్న ప్రశ్నకు బదులుగా "1942లో. యుద్ధంలో సర్వనాశనమైన దేశం.... తిరిగి కోలుకొని కేవలం ఒక దశాబ్దంలో అద్భుతమైన అభివృద్ధి సాధించడం సాధారణమైన విషయంకాదు. ఆ అద్భుతాన్ని సాధించిన దేశం జపాన్. కేవలం ఉన్నత విద్యకేగాక జపాన్ ఇంత అభివృద్ధి ఎలా సాధించగలిగిందన్న ప్రశ్నకు జవాబు తెలుసుకునేందుకూ ఉత్సాహపడ్డాను" అన్నా



శ్రీ డి. యన్. లింగం


రాయన. సంగీతం అంటే ఇష్టపడే ఈ సాంకేతిక విద్యావేత్తకు చిట్టిబాబు వీణ, బాలమురళి గాత్రం ఎంతో ఇష్టం.

యువతకు ఏం చెప్ప దలచుకున్నారన్నప్పుడు "సాహసగుణం కలిగి ఉండాలి వారు. నిజమే. ఇప్పుడున్న పరిస్థితులలో చదువులయిన వెంటనే ఉద్యోగాలు లభించడంలేదు. అయినా నిరుత్సాహ పడకూడదు. మనం కొన్ని పరిధులు గీసుకొని ఇటువంటి ఉద్యోగమే, మనవూరికి దగ్గరగానే చేయాలి అనుకోకూడదు. అవకాశం లభించినప్పుడు ఎక్కడికయినా వెళ్ళి పనిచేసేందుకు సిద్ధపడాలి. నిజానికి ఎన్ని ప్రదేశాలు చూడగలిగితే అంతగా విజ్ఞానమూ అభివృద్ధి చెందుతుంది మనకు" అన్నారాయన.

శ్రీ లింగం, నూతన పదవీ బాధ్యతలు విజయవంతంగా నెరవేరుస్తూ, జపాన్‌లో శుభప్రదమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాము.

—పి. సరళాసూర్యారావు

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు ఫిబ్రవరి '78

అడ్డం

1 ముక్కు నా జుట్టు

4 ఎవరికో చరిత్ర? వెనకనుంచి వెన్నెల పిట్ట!

7 గురజాడ సృష్టి

9 అరెబాబా కాకారాయుడు ఊదేస్తున్నాడు

11 శపించు

12 కందుకూరి కవి

14 దీర్ఘాక్షరం

15 సిగ్గేం కాను

16 జీవితకాలం గాలికి ప్రాస

17 ఎటుచూపినా మోసమో?

19 వా! వా!

22 న్యాయం పాలిస్తుంది

23 అవసరానికి రమ్మంటుంది. ఒకప్రసిద్ధ పద్యం ఆరంభం

25 అరటి పర్యాయపదం

26 1కి ప్రాస. చిరుగుకి మూత

నిలువు

2 —దండుగ క్షేత్రమాహాత్మ్యం
3 కూర్మి
4 విభక్తి వినాయకుడిది
5 ఇది కొనడం మంచిది
6 ఇడ్లీ నేస్తం
8 మాకీ—నకు పాండుక్ష్మాపాలుడు
10 పాపజాతి
11 పాట
13 బ్రహ్మ విష్ణు మహేశ్వరులు
16 రాజ్‌కపూర్ వేషం
18 నడు
20 త్రినేత్రుడు
21 కులమా పాడా? ఈదేవికి
23 అంటే (చిగురు)
24 తిరగేసిన 2 ఒకపోగు

జనవరి సమాధానాలు

అడ్డం 1 ఘరానా 4 పాపాయి 7 మనుచరిత్ర 9 మాకూ 11 అప్పు 12 నిర్మాత 14 బాలుడు 15 బలియం 16 పాతాళం 17 అమాన 19 వరం 22 సంచి 23 జరగడాలు 25 అబ్బురం 26 నిక్కవం

నిలువు 2 రాము 3 నానుడి 4 పారిపో 5 పాత్ర 6 నేమాని 8 చెప్పుడు 10 కూర్మావతారం 11 అలుక్షమానం 13 సాలీడు 16 పావని 18 సచివా 20 కురరం 21 కడాని 23 జబ్బు 24 లుక్క

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి ఫిబ్రవరి 1 తేదీలోపు మాకు చేరునట్లు పంపండి తెల్లకాగితం మీద గళ్ళుగీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు 50/ బహుమతి ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది

జనవరి పదబంధ ప్రవేశ ఫలితం

ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒక్కటీ రాలేదు

ఈ నెల బహుమతి

జాక్‌పాట్ రు **100/**

సినిమా

చిరంజీవి చాప్లిన్

సినిమా తెరపై మాటల్లేకుండా కేవలం బొమ్మలే కనిపించే మూకీ యుగంలోనే హాస్యానికి ఒక అపురూపమైన స్థానాన్నిచ్చి, ప్రముఖ ఆంగ్లరచయిత బెర్నార్డ్ షాచే "చిత్రరంగంనుంచి వచ్చిన ఏకైక మేధావి"గా పొగడబడ్డ చార్లీ చాప్లిన్— 1977లో క్రీస్తు జన్మదినోత్సవపు వేడుకలు జరుగుతున్న రోజు (డిసెంబర్ 25)న మరణించాడు. ఆయన వయసు 88 సంవత్సరాలు.

'ఫ్రం రాగ్స్ టు రిచెస్' అన్న ప్రయోగం చాప్లిన్‌కి అక్షరాలా అన్వయించవచ్చు. బీదతనంతో తల్లడిల్లిన స్థితినుండీ కోటీశ్వరుడుగా ఎలువబడ్డ స్థితికొచ్చినవాడు చాప్లిన్.

పొట్టిమనిషి, జారిపోతూండే వదులు పంట్లాము, పొడవాటి టోపీ, ఫ్రెంచ్‌కట్ మీసం చేతిలో ఒంకీ కర్ర ఈ రూపంతో ప్రపంచంలో కోట్లాది ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడమేగాక, గుండెలు పిండేలా బాధననుభవించేలానూ చేశాడు చాప్లిన్. అతని హాస్యానికి అంతటి శక్తివుంది.

ఈ మహానటుడు చార్లెస్ స్పెన్సర్ చాప్లిన్‌గా లండన్‌లో 1889 ఏప్రియల్ 16న జన్మించాడు. చాప్లిన్ తండ్రి సంగీత విద్వాంసుడిగా ప్రతిభకలవాడు.




'చిలిపి కృష్ణుడు'లో నాగేశ్వరరావు, వాణిశ్రీ

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

ప్రమోషన్‌పై జపాన్ దేశానికి వెళు తున్న సందర్భంలో శ్రీ డి. ఎన్. లింగం గార్ని ఈ శీర్షికలో పరిచయం చెయ్యడం మాకు ఆనందంగావుంది. ఎయిర్ ఇండియా సంస్థలో దక్షిణభారత దేశపు విభాగానికి డిప్యూటీ మానేజర్‌గా వుంటున్న శ్రీ లింగం, ఇప్పుడు ఎయిర్ ఇండియాలో మేనేజర్ హోదాతో జపాన్‌లోని 'ఒసాకా' నగరంలో పనిచేయడానికి వెళుతున్నారు. 'నేను చదివిన ప్రదేశానికి వెళ్తున్నందుకు ఆనందంగా వుంది' అన్నారు శ్రీ లింగం ఈ సందర్భంలో. ఆయన ఒసాకా నగరంలో 25 సంవత్సరాల క్రితం ఉన్నత విద్య నభ్యసించి వున్నారు.

చదివింది సాంకేతిక విద్యే అయినా కళలపై విపరీతమైన ఆసక్తిగలవారు ఈయన. కాలేజీలో చదివే రోజుల్లో డిబేటింగ్ పోటీలలో ప్రథమ బహుమతు లందుకున్న శ్రీ లింగం నాటకాలలో నటించారుకూడా. కలకత్తాలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో అక్కడి ఆంధ్రా అసోసియేషన్ సెక్రటరీగా వున్నారీయన.

చాలామంది ఉన్నత విద్యకోసం అమెరికా, బ్రిటన్ దేశాలకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తారు. మీరు జపాన్ నెందుకు ఎన్నుకున్నారన్న ప్రశ్నకు బదులుగా "1942లో యుద్ధంలో సర్వనాశనమైన దేశం.... తిరిగి కోలుకొని కేవలం ఒక దశాబ్దంలో అద్భుతమైన అభివృద్ధి సాధించడం సాధారణమైన విషయంకాదు. ఆ అద్భుతాన్ని సాధించిన దేశం జపాన్. కేవలం ఉన్నత విద్యకేగాక జపాన్ ఇంత అభివృద్ధి ఎలా సాధించగలిగిందన్న ప్రశ్నకు జవాబు తెలుసుకునేందుకూ ఉత్సాహపడ్డాను" అన్నారాయన. సంగీతం అంటే ఇష్టపడే ఈ సాంకేతిక విద్యావేత్తకు చిట్టిబాబు వీణ, బాలమురళి గాత్రం ఎంతో ఇష్టం.




శ్రీ డి. యన్. లింగం

యువతకు ఏం చెప్ప దలచుకున్నారన్నప్పుడు "సాహసగుణం కలిగి ఉండాలి వారు. నిజమే. ఇప్పుడున్న పరిస్థితులలో చదువులయిన వెంటనే ఉద్యోగాలు లభించడంలేదు. అయినా నిరుత్సాహ పడకూడదు. మనం కొన్ని పరిధులు గీసుకొని ఇటువంటి ఉద్యోగమే, మనవూరికి దగ్గరగానే చేయాలి అనుకోకూడదు. అవకాశం లభించినప్పుడు ఎక్కడికయినా వెళ్ళి పనిచేసేందుకు సిద్ధపడాలి. నిజానికి ఎన్ని ప్రదేశాలు చూడగలిగితే అంతగా విజ్ఞానమూ అభివృద్ధి చెందుతుంది మనకు" అన్నారాయన.

శ్రీ లింగం, నూతన పదవీ బాధ్యతలు విజయవంతంగా నెరవేరుస్తూ, జపాన్‌లో శుభప్రదమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాము.

—పి. సరళాసూర్యారావు

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు

ఫిబ్రవరి '78

అడ్డం

1 ముక్కు నా జుట్టు

4 ఎవరికో చరిత్ర? వెనకనుంచి వెన్నెల పిట్ట!

7 గురజాడ సృష్టి

9 అరెబాబా కాకారాయుడు ఊదేస్తున్నాడు

11 శపించు

12 కందుకూరి కవి

14 దీర్ఘాక్షరం

15 సగ్గం కాను

16 జీవితకాలం గాలికి ప్రాస

17 ఎటుచూపినా మోసమో?

19 వా! వా!

22 న్యాయం పాలిస్తుంది

23 అవసరానికి రమ్మంటుంది ఒకప్రసిద్ధ పద్యం ఆరంభం

25 అరటి పర్యాయపదం

26 13 ప్రాస. చిరుగుకి మూత

సంక్రాంతికి నాయుడుబావ

నిర్మాత ఎం. ఎస్. రెడ్డి తమ కౌముదీ పిక్చర్స్ పతాకం క్రింద రంగులలో నిర్మించిన 'నాయుడుబావ' చిత్రం జనవరి 13న విడుదల కాబోతుంది. శోభన్‌బాబు, జయసుధ, జయప్రద నటిస్తున్న ఈ చిత్రంలో ఇంకా సత్యనారాయణ, రాజబాబు, మోహన్‌బాబు, సాక్షిరంగారావు, మమత, నిర్మల, జయమాలిని, హాలం, విజయలక్ష్మి, సుధ నటిస్తున్నారు. పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో తయారౌతున్న ఈ చిత్రలోని పాటలన్నిటినీ 'మల్లెమాల' రచించారు. సంగీతం సత్యం నిర్వహించారు.

సురేఖా ఆర్ట్ పిక్చర్స్ నిర్మించే ఈ చిత్రానికి దర్శకుడు కె. యస్. రెడ్డి.

కూనలమ్మ పదాల 'గోరంతదీపం'

జ్యోతి మాసపత్రికలో ప్రచురింపబడి, పుస్తకరూపంలోకూడ వచ్చిన ఆరుద్ర 'కూనలమ్మపదాలు' కొన్ని దర్శకుడుబాపు రూపకల్పనచేస్తున్న 'గోరంత దీపం' చిత్రంద్వారా మీరుమళ్ళీ....(సారీఅప్పుడు చదివారుకదూ!)....ఇప్పుడు వినే అవకాశమొస్తూంది "పెరిగె ఇన్‌కంటాక్స్, పెరిగె సూపర్‌టాక్స్. టాక్స్ లేనిదిసెక్స్ ఓ కూనలమ్మా" అనీ .. తాగుచుండే బుద్ధి, తరుగుతుండే కొద్ది, మెదడుమేయునుగద్ది ఓకూనలమ్మా" ఇటువంటి పదాలు ముప్పై ఈ చిత్రంలో వింటారు. శ్రీధర్, వాణిశ్రీ తొలిసారిగా హీరో హీరోయిన్ చేరగా నటిస్తున్న ఈ చిత్రంలో మోహన్



'ఆగడు అందడు ఆదరడు'లో జయచిత్ర

బాబు, రావుగోపాలరావు, సూర్యకాంతం అల్లురామలింగయ్య, హాలం, ముక్కామల, సాక్షిరంగారావు, జయవిజయ, యూనీస్, కల్పన నటిస్తున్నారు. నేరెళ్ళ రామలక్ష్మి ఈ చిత్రానికి కథ సమకూర్చగా, ఆచిత్రానికి మాటలు సమకూర్చి, చిత్రాన్ని నిర్మిస్తూంది అప్పారావు సృష్టికర్త. (అప్పారావు సృష్టికర్త అంటే తెలియనివారు ముళ్ళపూడి వెంకటరమణగా చదువుకోగలరు)



శ్రీ చిత్రవారి తొలిచిత్రంలో శ్రీప్రియ

'పంతులమ్మ'కునూతన రచయిత

"జమీందారుగారి అమ్మాయి" "అమెరికా అమ్మాయి" చిత్రాలు నిర్మించిన నవతా ఆర్ట్స్‌సంస్థ ఇప్పుడు రంగులలో నిర్మించే 'పంతులమ్మ' చిత్రంద్వారా— రేడియో రాంబాబుగా సుప్రసిద్ధుడూ, మంచి రచయితగా పేరొందిన వాడూ అయిన డి. వెంకట్రామయ్య మాటల రచయితగా పరిచయం కాబోతున్నారు. వేటూరి సుందరరామ్మూర్తి పాటలూ, బాలు మహేంద్ర ఛాయాగ్రహణం,రాజన్ నాగేంద్ర సంగీతంగల ఈ చిత్రాన్ని ఎన్ కృష్ణంరాజు సంగీతం శ్రీనివాసరావుదర్శకత్వంలోనిర్మిస్తున్నారు.రంగనాధ్,లక్ష్మిదీప, శరత్‌బాబు ముఖ్యతారలీ చిత్రంలో

విజయనిర్మల దర్శకత్వంలో తదుపరి చిత్రం

నటిగానేగాక, దర్శకురాలిగాకూడా ప్రేక్షకుల అభిమానం చూరగొన్న విజయనిర్మల దర్శకత్వంలో 'రౌడీ రంగమ్మ చిత్రం రూపుదిద్దుకుంటోందిప్పుడు మహారధి మాటలతో, రమేష్‌నాయుడు సంగీతంతో, పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రహణంతోవచ్చే ఈచిత్రంలో రంగనాధ్ విజయనిర్మల, పద్మప్రియ, గిరిబాబు, చంద్రమోహన్, నాగభూషణం నటిస్తున్నారు

పుట్టిన పదిరోజులకే క్రీస్తుకుశిలువ

మన్నించండి! మేం క్రీస్తు చరిత్రను తిప్పిరాయడంలేదు. క్రీస్తు జీవితాన్ని వివరంగా ప్రేక్షకులకు చూపించే ప్రయత్నంగా నిర్మాణమవుతున్న రంగులచిత్రం 'కరుణామయుడు' చిత్రానికిగాను చిత్రీకరించబడుతున్న దృశ్యం గురించి చెప్పే ప్రయత్నమిది. 1977 క్రిస్టమస్ (క్రీస్తు పుట్టిన రోజు) తమ కార్యాలయంలో పత్రికా విలేఖరులతోనూ, రాధాచిత్ర (కరుణామయుడు నిర్మిస్తున్న సంస్థ) యూనిట్‌తోనూ కలిసి పండుగగా చేసుకొన్న ఈ చిత్రనిర్మాత, క్రీస్తు పాత్రధారీ విజయచందర్ వెంటనే బయలుదేరి నాగార్జున సాగర్‌వద్ద అవుట్‌డోర్ లొకేషన్‌కు వెళ్ళారు. అక్కడ జరిగే పదిరోజుల షూటింగ్‌లో క్రీస్తుకు శిలువవేసే దృశ్యంతోపాటు మరికొన్ని దృశ్యాలు చిత్రీకరించబడుతాయని నిర్మాత చెప్పారు.

సీతామాలక్ష్మి

అనగనగా ఓ ఊరు. ఆ ఊళ్ళో ఓ చిన్నచెట్టు. ఆచెట్టుపై నివశిస్తున్న పక్షులలో ఓ చక్కని చిలుకకూ, మరో మంచి గోరంకకూ చెలిమి కలిసింది. చెలిమిలో చిలిపి కలహాలూ ఉన్నాయి. చిలిపి కలహాలు వాటిని మరింత దగ్గర చేశాయే గాని దూరానికి జరగనివ్వలేదు. ఎప్పటికయినా ఓమహావృక్షంపై నివసించాలన్న కోరిక ఈ చిలుకా గోరింకలకున్నా పరిస్థితుల కారణంగా చిలక మాత్రమే ఆ అదృష్టానికి నోచుకుంది. ఆకులులేని ఎండిన చిన్నచెట్టుపైన జీవితంకన్నా అడయారు మర్రి అంతటి మహావృక్షంపైన జీవితం సౌఖ్యంగానే వున్నా, తనగోరింక లేనిలోటు పూరించలేనిదైపోయింది చిలుకకు. సుఖమున్నా సంతోషం లేదనిపాపో యింది. తానక్కడ ఉంటూనే, చిన్నచెట్టుపైన గోరింకతో చెలిమి కొనసాగించాలనుకొంది.....కాని అది ఫలించని కోరికగా తెలుసుకొన్న చిలక విలవిలలాడింది పెద్దచెట్టు నొదులుకోవడమా, తనప్రాణ సమానమయిన గోరింక నొదులుకోవడమా అన్న సమస్యలో పడింది? ఇంతకూ ఆ చిలకఏంచేసింది? 'తెలిసీ చెప్పకపోయావో సీతల వేయి వ్రక్కలగును' బాపతు భేతాళకథ కాదిది. యువచిత్ర నిర్మిస్తున్న 'సీతామాలక్ష్మి' చిత్రకథకు 'సింబాలిక్' రూపం! ఈచిత్రం కె. విశ్వనాథ్ దర్శకత్వంలో, చంద్రమోహన్, నూతనతార తాళ్ళూరి రామేశ్వరి, శ్రీధర్‌లు ప్రధాన పాత్రలతో తయారవుతోంది. నిర్మాత: మురారి



'భగవాన్ ప్రొడక్షన్' తొలిచిత్రంలో దీప


అందరికీ అభినందనలు!

తుఫాను బాధితులకు సహాయ పడేందుకు చిత్రపరిశ్రమలోని అందరూముందుకొచ్చి మానవత్వపు విలువలు ప్రదర్శించినందుకు ఆనందంగా వుంది మాకు. ఎవరెలా చేశారన్నదిగానీ, ఎంతమేరకు చేశారన్నదిగానీ కాదుప్రశ్న. అసలు చేశారా? లేదా? అన్నదే పాయింటు. మొత్తానికి ఎవరికి తోచిన రీతిలోవాళ్ళు, ఎవరికి సాధ్యమయినమేరకు వాళ్ళు చేయూతనందించి బాధితులకు అండగా నిలబడ్డారు అందరికీ జ్యోతి అభినందనలు.

—యస్వీ నారాయణ


గంగాధర
లక్ష్మీ ఫిలిమ్స్ కంబైన్స్
కృష్ణవేణి
నిండుమనిషి
యస్. డి. లాల్
యస్. ఆర్. అనురాధాదేవి


గంగ,యమున,సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి,సువాసన,పరిమళాల సమ్మేళనం
"త్రివేణి" వక్కపొడి
TRADE MARK
Regd No. 169505
TRIVENI
TRIVENI
PARIMALA
NUT POWDER
తయారుచేయువారు..
PHONE-270
త్రివేణి నట్ పౌడర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ
మేనేజింగ్ పార్ట్నర్.... దేసు వెంకటసుబ్బారావు...
పోర్టురోడ్............ మచిలీపట్నం (ఆంధ్ర)



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600 024, & Printed by D Hanuman the Press at Kranti Press 12, Francis Joseph Street, Madras-600001.